www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 15-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 46
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: తదియ తె.4.03 తదుపరి చవితి; నక్షత్రం: జ్యేష్ఠ మ.2.07 తదుపరి మూల; వర్జ్యం:రా.10.47-12.31; దుర్ముహూర్తం: ఉ.10.03-10.54, మ.3.11-4.02; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.46; సూర్యాస్తమయం: 6.36
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


జస్టిస్ గవాయ్‌తో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ముర్ము

సీజేఐ జస్టిస్ గవాయ్

ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము
హాజరైన ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు
తొలి బౌద్ధ, రెండో దళిత సీజేఐగా గవాయ్ రికార్డు
1985లో న్యాయవాదిగా కెరీర్ ఆరంభం
2003లో హైకోర్టు.. 2019లో సుప్రీం జడ్జిగా..
ఆర్టికల్ 370 రద్దు, బుల్డోజర్ న్యాయం తదితర కీలక తీర్పుల్లో భాగస్వామ్యం
2


హైదరాబాద్ జలసౌధలో నిర్వహించిన కొలువుల పండుగలో.. కొత్తగా ఎంపికైన ఓ అభ్యర్థికి ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, పొన్నం

ఇంజనీర్ల పని.. నేతలు చేయొద్దు

అలా చేసిన ఫలితమే కాళేశ్వరం ప్రాజెక్టు
ప్రపంచంలో మూడేళ్లలో కూలింది ఇదొక్కటే
రాజకీయ నాయకులు చెప్పినట్లు చేస్తే..
ఇంజనీర్లు ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుంది
ఉద్యోగ నియామకాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం
గ్రూప్-1పై రాజకీయ ప్రేరేపిత పిటిషన్
త్వరలో గ్రూప్-1, 2, 3 నియామకాలు: సీఎం
ఏఈ, జేటీవోలకు నియామక పత్రాలు
కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాకు కృషి
సమ్మక్క సాగర్‌కు త్వరలోనే ఎన్‌వోసీ
5 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వడమే లక్ష్యం
తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో
అనుమతుల ప్రక్రియ సులభతరం కావాలి
ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు తమ పని తాము చేయాలని, ప్రాజెక్టులు కట్టాలనే విధాన నిర్ణయం మాత్రమే ప్రజాప్రతినిధులు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంజనీర్లు చేయాల్సిన పనిని.. ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రులు చేయకూడదన్నారు. అలా చేయడం వల్ల వచ్చిన ఫలితమే కాళేశ్వరం ప్రాజెక్టు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.వేల కోట్లు పెట్టిన ప్రాజెక్టులకు కనీసం భూభౌతిక పరీక్షలు కూడా చేయలేదని, పెద్దసారు హెలికాప్టర్‌లో పోతూ.. కిందికి చూసి, ఇక్కడొకటి, అక్కడొకటి కట్టమని చెబితే పేపర్‌లో రాసుకొని కాంట్రాక్టర్‌కు ఇచ్చి కట్టించారని ఆరోపించారు. బుధవారం.. కొత్తగా ఎంపికైన 224 మంది అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)లు, 199 మంది జూనియర్ టెక్నికల్ అధికారుల (జేటీవోల)కు జలసౌధలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా

మిగతా 14వ పేజీలో...

13 గురుకులాలకు నిత్యావసరాల సరఫరా

బాధ్యత మహిళా సంఘాలకు

ప్రభుత్వం సూత్రప్రాయ నిర్ణయం.. త్వరలో సీఎంకు నివేదిక
వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలుకు అధికార్ల కసరత్తు

ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్

కేరళ ప్రభుత్వ ఏజెన్సీకి బాధ్యతలు 3
నేడో రేపో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు
ధరణితో విలువైన భూముల రికార్డులు తారుమారయ్యాయని ఆరోపణలు
గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 15 వేల ఎకరాల సర్కార్ భూములు మాయం
అటవీ, దేవాదాయ, వక్ఫ్ భూములూ..
2014 నుంచి 2023 డిసెంబరు వరకు భూ లావాదేవీలపై శాస్త్రీయ విచారణ

సింధు జలాలపై నిర్ణయాన్ని పునఃసమీక్షించండి

భారత్‌కు పాకిస్థాన్ జలవనరుల శాఖ లేఖ
తీవ్ర దుర్భిక్షం నెలకొంటుందంటూ ఆందోళన

స్వతంత్ర దేశంగా బలూచిస్థాన్!
గుర్తించాలంటూ భారత్, ఐరాసకు బీఎల్ఏ వినతి

బీఎస్ఎఫ్ జవాన్‌ను భారత్‌కు అప్పగించిన పాక్
ఆ దేశ రేంజర్‌ను విడుదల చేసిన భారత్

పాక్‌కు డ్రోన్లే కాదు.. సైనికుల్నీ పంపిన తుర్కియే!
'సిందూర్'లో ఇద్దరు తుర్కియే జవాన్ల మృతి

కిరానా హిల్స్‌లో ఏం జరిగింది?
అణుధార్మికత లీక్ అయ్యిందా?? 12

భారత్, పాక్ కలిసి డిన్నర్ చేయాలి!
2 దేశాల మధ్య యుద్ధాన్ని నేనే ఆపాను: ట్రంప్


వరంగల్ సందర్శన సందర్భంగా స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న మిస్‌వరల్డ్ పోటీదారులు

శిల్ప.. సౌందర్యం

రామప్ప శిల్పాల మధ్య ప్రపంచ సుందరీమణుల సందడి
చీరకట్టు.. నుదుట బొట్టుతో తెలుగుదనం ఉట్టిపడేలా ముస్తాబు
వరంగల్ కోట, రామప్ప, వేయి స్తంభాల గుడి సందర్శన.. పూజలు
కాకతీయ శిల్ప సౌందర్యానికి ముగ్ధులైన ముద్దుగుమ్మలు

ములుగు/వెంకటాపూర్/వరంగల్, మే 14 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ చీరకట్టు, నుదుట బొట్టు, జడ కొప్పు, మల్లెపూలు ధరించి.. ప్రపంచ సుందరి పోటీదారులు తెలుగుదనం ఉట్టిపడేలా ముస్తాబయ్యారు. స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆట, పాటలతో నృత్యాలు చేశారు. దేవాలయాలను దర్శించుకున్నారు. పర్యాటక ప్రదేశాల్లో ఫొటోలకు పోజులిస్తూ వయ్యారాలు పోయారు. మొత్తంగా బుధవారం మిస్‌వరల్డ్-2025 పోటీదారులు ఓరుగల్లు పర్యటనలో సందడిగా గడిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు రెండు బృందాలుగా వచ్చిన 57 మంది సుందరీమణులు చారిత్రక వేయి స్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్ప ఆలయాలను సందర్శించారు. తొలుత వివిధ దేశాలకు చెందిన 33 మంది ముద్దుగుమ్మలు సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక బస్సులో జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి భారత సంప్రదాయ చీరకట్టులో ములుగు జిల్లాలో వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప ఆలయానికి వచ్చారు. యునెస్కో గుర్తింపు పొందిన ఈ ఆలయాన్ని చూసి

మిగతా 13వ పేజీలో...

పైసలిస్తామన్నా.. పట్టించుకోలే!
కొందరు అధికారుల నిర్లక్ష్యంతో మిస్ వరల్డ్ పోటీల స్పాన్సరర్లు వెనక్కి.. రాష్ట్ర సర్కారుపై రూ.27 కోట్ల భారం 13



కెనడా విదేశాంగ మంత్రిగా అనితా ఆనంద్

» మంత్రివర్గంలో మరో ముగ్గురు భారత సంతతి ఎంపీలు



ఒట్టావా, మే 14: కెనడా మంత్రివర్గ పున ర్వ్యవస్థీకరణలో భారత సంతతి ఎంపీలకు కీలక పదవులు లభించాయి. ఇటీవల కెనడాలో జరిగిన ఫెడరల్ ఎన్నికల్లో లిబరల్ పార్టీ మరోసారి ఘనవిజయం సాధించి అధికారాన్ని దక్కించుకుంది. ఈ క్రమంలోనే కెనడా ప్రధాని మార్క్ కార్నీ మంత్రివర్గంలో భారత మూలాలున్న నలుగురు కెనెడియన్లు చోటు దక్కించుకున్నారు. అనితా ఆనంద్‌ను విదేశాంగ మంత్రిగా, మణిందర్ సిద్ధును వాణిజ్యమంత్రిగా కీలక శాఖలు కేటాయించారు. రూబీ సహోటా నేర నిరోధక విభాగ సహాయ మంత్రిగా, రణ్‌దీప్ సారాయ్ అంతర్జాతీయ విదేశాంగ కార్యదర్శిగా నియమితులయ్యారు. 58 ఏళ్ల అనితా ఆనంద్ కెనడాలోని ఓక్‌విల్లే నుంచి ఎంపీగా 2019లో ఎంపికయ్యారు. గతంలో కెనడా రక్షణ మంత్రిగా సహా పలు కీలక పదవుల్లో పనిచేసిన అనుభవం ఉంది. ఒకానొక సమయంలో ప్రధాని పదవికి పోటీదారుగా నిలిచారు. 41 ఏళ్ల మణిందర్ సిద్ధు బ్రాంప్టన్ ఈస్ట్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. వాణిజ్యమంత్రిగా సిద్ధు నియామకం ట్రంప్ ప్రభుత్వం కెనడాపై విధించిన టారిఫ్‌లను వ్యతిరేకిస్తున్న సమయంలో జరగడం గమనార్హం. ప్రధాని తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ప్రమాణస్వీకారం అనంతరం ఎక్స్ వేదికగా మంత్రులు ప్రకటించారు.

మసూద్ అజర్‌కు రూ.14 కోట్ల పరిహారం!

ఇస్లామాబాద్, మే 14: జైషే మహ్మద్ చీఫ్, ఐరాస అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన మసూద్ అజర్‌కు పాకిస్థాన్ సర్కారు రూ.14 కోట్ల పరిహారం ఇవ్వనుంది. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ చేసిన క్షిపణి దాడుల్లో మసూద్ అజర్ కుటుంబ సభ్యులు 14 మంది హతమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మృతులు ఒక్కొక్కరికి పాక్ ప్రభుత్వం రూ.కోటి చొప్పున పరిహారం ప్రకటించినట్లు 'ద ట్రిబ్యూన్ ఇండియా' కథనంలో పేర్కొంది. మృతుల వారసులకు ఈ సొమ్మును అందించనున్నారని.. ఒకవేళ అజర్ తానే వారసుడినని ప్రకటించుకుంటే మొత్తం డబ్బు అతనికే ఇస్తారని తెలిపింది. పరిహారంతో పాటు భారత్ దాడుల్లో ధ్వంసమైన ఇళ్లను కూడా పునర్నిర్మిస్తామని పాక్ సర్కారు పేర్కొన్నట్లు వెల్లడించింది. ఈ చర్యలతో పాకిస్థాన్ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

అరుణాచల్‌లోని 27 ప్రాంతాలకు చైనా పేర్లు

న్యూఢిల్లీ, మే 14: చైనా మరోసారి తన వక్ర బుద్ధిని ప్రదర్శించింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని దాదాపు 27 ప్రాంతాలకు కొత్త పేర్లు పెట్టింది. దీనిపై భారత విదేశాంగ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని పేర్కొంది. "అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు పేర్లు పెట్టడానికి చైనా ప్రయత్నాలు చేస్తున్నట్లు మేం గమనించాం. అటువంటి ప్రయత్నాలను తిరస్కరిస్తున్నాం. పేర్లు మార్చినంత మాత్రాన వాస్తవాన్ని మార్చలేరు. అరుణాచల్ ప్రదేశ్‌ను భారత్ నుంచి వేరు చేయలేరు. అది ఎప్పటికైనా భారత్‌లో అంతర్భాగమే" అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చైనాకు గట్టి బదులిచ్చారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 84 మంది మృతి

గాజా, మే 14: హమా‌స్‌ను తుదముట్టించే చర్యల్లో భాగంగా ఇజ్రాయెల్... గాజాలో జరిపిన వైమానిక దాడుల్లో 84 మంది మృతిచెందారు. వీరిలో 22 మంది చిన్నారులున్నారు. ఖాన్ యూనిస్‌తో పాటు ఉత్తర గాజాలోని పలు ప్రాంతాల్లో ఈ దాడులు కొనసాగాయి. హమాస్ తమ వద్ద బందీగా ఉన్న అమెరికన్ జాతీయుడిని విడుదల చేసిన మరుసటి రోజే ఈ దాడులు జరిగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖతార్‌లో పర్యటిస్తుండగా, హమాస్-ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం కోసం మధ్యవర్తులు దోహాలో సమావేశమవుతున్న తరుణంలో ఈ దాడులు జరగడం కలకలం రేపింది. హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారినందరినీ విడుదల చేసేదాకా దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ ఇప్పటికే స్పష్టం చేసింది.

సీజేఐ జస్టిస్ గవాయ్

ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము.. హాజరైన ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు

» తొలి బౌద్ధ, రెండో దళిత సీజేఐగా జస్టిస్ గవాయ్ రికార్డు

న్యూఢిల్లీ, మే 14: జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ భారతదేశ 52వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా బుధవారం ప్రమాణం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ గవాయ్ చేత ఈ మేరకు ప్రమాణం చేయించారు. ప్రమాణం అనంతరం జస్టిస్ గవాయ్ తన తల్లి కమల్‌తాయి గవాయ్‌కి పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, జేపీ నడ్డా, అర్జున్‌రాం మేఘ్వాల్, ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్, మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, విపక్షనేత రాహుల్‌గాంధీ తదితరులు హాజరయ్యారు. 64 ఏళ్ల వయసున్న జస్టిస్ గవాయ్.. ఈ ఏడాది నవంబరు 23 వరకూ సీజేఐ పదవిలో కొనసాగనున్నారు. కాగా, జస్టిస్ గవాయ్ బౌద్ధమతావలంబకులు. తద్వారా దేశ తొలి బౌద్ధ సీజేఐగా నిలిచారు. అంతేకాదు జస్టిస్ బాలకృష్ణన్ తర్వాత సీజేఐ పదవిని చేపట్టిన రెండో దళితవ్యక్తిగా పేరొందారు.

జస్టిస్ గవాయ్ మహారాష్ట్రలోని అమరావతికి చెందినవారు. ఆయన తండ్రి ఆర్ఎస్ గవాయ్ సీనియర్ రాజకీయ నాయకుడు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (గవాయ్) పార్టీని స్థాపించి దళిత వర్గాల నేతగా పేరొందారు. 1985లో భూషణ్ రామకృష్ణ గవాయ్ న్యాయవాదిగా తన కెరీర్‌ను ప్రారంభించారు. 1992-93లో బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్‌లో ప్రభుత్వ అసిస్టెంట్ ప్లీడర్‌గా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. 2000లో ప్రభుత్వ ప్లీడర్‌గా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పదోన్నతి పొందారు. 2003లో బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005లో హైకోర్టు శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. 2019 మే24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిపొందారు. సీజేఐగా మంగళవారం పదవీ విరమణ చేసిన జస్టిస్ సంజీవ్‌ఖన్నా అదే ఏడాది అదేరోజు సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు.



52వ సీజేఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న జస్టిస్ గవాయ్

700 ధర్మాసనాల్లో భాగస్వామి

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ గత ఆరేళ్లలో దాదాపు 700 ధర్మాసనాల్లో ఉన్నారు. దాదాపు 300 తీర్పులను స్వయంగా రాశారు. పలు కీలక తీర్పుల్లో ఆయన భాగస్వామి. వాటిలో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చిన ఆర్టికల్ 370ను కేంద్రం రద్దు చేయటానికి సమర్థన, పెద్దనోట్ల రద్దు సబబేనని తీర్పు, ఎన్నికల బాండ్లరద్దు, బుల్డోజర్లతో ప్రభుత్వమే నిందితుల ఇళ్లను కూల్చటాన్ని నిలిపివేస్తూ తీర్పు.. ఉన్నాయి. ఇటీవల అలహాబాద్ హైకోర్టు జడ్జి ఒకరు.. నిందితుడు ఓ మహిళ పైజామా తాడు లాగటం, ఛాతిని తాకటం రేప్ కిందకు రాదంటూ ఇచ్చిన తీర్పును జస్టిస్ గవాయ్ సారథ్యంలోని బెంచ్ నిలిపేసింది.

జై భీం అంటూ పలకరింపు

సీజేఐగా ప్రమాణం అనంతరం సుప్రీంకోర్టులో తనను న్యాయవాదులు కలిసిన సందర్భంగా జస్టిస్ గవాయ్.. 'జై భీం' అంటూ వారిని పలకరించారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనల స్ఫూర్తితో 'జై భీం' నినాదం రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. కాగా, సీజేఐగా ప్రమాణం చేయటానికి కొన్ని రోజుల ముందు తన నివాసంలో జస్టిస్ గవాయ్ విలేకర్లతో మాట్లాడుతూ.. సీజేఐగా తనకు రాజ్యాంగమే అత్యున్నత ప్రమాణంగా ఉంటుందని స్పష్టం చేశారు. పదవీ విరమణ తర్వాత ఏ ప్రభుత్వ పదవినీ చేపట్టబోనని చెప్పారు. తాజాగా, రిటైర్ అయిన సీజేఐ సంజీవ్‌ఖన్నా కూడా ఏ పదవీ చేపట్టనని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

శత్రు డ్రోన్ల దండుపై 'భార్గవాస్త్రం'

» స్వదేశీ కౌంటర్ డ్రోన్ వ్యవస్థ పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ, మే 14: భారత గగనతల రక్షణ వ్యవస్థ మరింత బలోపేతమయ్యే దిశగా మరో ముందడుగు పడింది. గుంపుగా వచ్చిపడే శత్రు డ్రోన్ల సమూహాన్ని పక్కాగా ఛేదించే స్వదేశీ కౌంటర్ డ్రోన్ వ్యవస్థ 'భార్గవాస్త్ర'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డీఏఎల్) స్వదేశీ పరిజ్ఞానంతో, తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేసిన భార్గవాస్త్ర... ఒకేసారి అనేక డ్రోన్లతో దాడి చేసినప్పటికీ వాటిని సమర్థవంతంగా అడ్డుకుంటుంది. ఈ వ్యవస్థలో ఉపయోగించిన రాకెట్లకు ఒడిసాలోని గోపాల్‌పూర్‌లో ఉన్న సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో మంగళవారం నిర్వహించిన పరీక్ష విజయవంతమైంది. ఈ సందర్భంగా ఇది అన్ని లక్ష్యాలను విజయవంతంగా ఛేదించినట్లు ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ (ఏడీడీ) అధికారులు తెలిపారు. దీనికి మొత్తం మూడు ట్రయల్స్ నిర్వహించారు. రెండు సార్లు ఒక్కో రాకెట్‌ను విడివిడిగా పరీక్షించగా.. మూడో ట్రయల్‌లో రెండు సెకన్ల వ్యవధిలో రెండు రాకెట్లను పరీక్షించారు. పరీక్షల సందర్భంగా ఈ నాలుగు రాకెట్లు సమర్థవంతంగా పనిచేశాయని, నిర్దేశిత పారామితులను సాధించాయని అధికారులు చెప్పారు.



6-10 కి.మీ. దూరంలోనే గుర్తింపు

భార్గవాస్త్రను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. ఇది 2.5 కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న డ్రోన్లను గుర్తించి మైక్రో రాకెట్ల సాయంతో నిర్వీర్యం చేయగలదు. తొలి లేయర్‌లో అన్‌గైడెడ్ మైక్రో రాకెట్ల సాయంతో 20 మీటర్ల పరిధిలో ఉన్న డ్రోన్ల దండును నాశనం చేయగలదు. రెండో లేయర్‌లో ఉన్న గైడెడ్ మైక్రో మిస్సైల్స్ లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో గుర్తించి నిర్వీర్యం చేస్తాయి. ఇందులో ఏర్పాటు చేసిన రాడార్ వ్యవస్థ గగనతలంలో 6 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముప్పును కూడా పసిగట్టగలదు. దీనిలోని ఎలక్ట్రో-ఆప్టికల్/ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్ సూట్ తక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లను కూడా అత్యంత కచ్చితత్వంతో గుర్తించగలదు. సముద్ర మట్టానికి 5వేల మీటర్ల ఎత్తులో ఉండే భూభాగాల్లో, కొండ ప్రాంతాల్లోనూ వీటిని సమర్థవంతంగా ఉపయోగించవచ్చు.

లోకం తీరు



మోదీ అధ్యక్షతన సీసీఎస్ భేటీ

న్యూఢిల్లీ, మే 14: ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశం జరిగింది. భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ తర్వాత సీసీఎస్ భేటీ కావడం ఇదే తొలిసారి. తాజా భద్రతా పరిస్థితులు, దేశ సన్నద్ధతపై సమావేశంలో చర్చించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. కాగా, మహా దళపతి (సీడీఎస్) అనిల్ చౌహాన్‌తో పాటు త్రివిధ దళాధిపతులు బుధవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. మరోవైపు, భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ భద్రతను కేంద్రం మరింత పెంచింది. ఇటీవల జరిపిన సమీక్షలో భాగంగా ఆయనకు ప్రస్తుతం కల్పిస్తున్న జెడ్ కేటగిరీ సెక్యూరిటీలో మరో రెండు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను చేర్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

కశ్మీర్‌లో 9,500 బంకర్లు.. మరిన్ని నిర్మిస్తాం: సీఎస్ అటల్


జమ్మూకశ్మీర్, మే 14: భారత్ - పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంబడి 9,500 బంకర్లు ఉన్నాయని, జనావాసాలే లక్ష్యంగా పాకిస్థాన్ కాల్పులకు తెగబడుతుండడంతో స్థానికుల భద్రత దృష్ట్యా వాటి సంఖ్యను మరింత పెంచుతామని జమ్మూకశ్మీర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అటల్ దుల్లూ అన్నారు. నియంత్రణ రేఖ వెంబడి ఉన్న కాల్పుల ప్రభావిత ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అవసరానికి అనుగుణంగా బంకర్ల సంఖ్యను పెంచుతామన్నారు. ప్రాణ, ఆస్తినష్టాలు జరిగాయని నష్టపోయిన వారికి త్వరలోనే పరిహారం అందజేస్తామని తెలిపారు. బాధితులకు సంఘీభావాన్ని ప్రకటించి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి భద్రతకు, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు.

వేసవిలో తరగతులపై మీకెందుకు బాధ?

» బాధితులుంటే వారే కోర్టుకు వస్తారు కదా?

» ప్రతివాదులు ఎవరో ఎందుకు చేర్చలేదు?

» పిటిషనర్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): పలు కాలేజీలు వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నాయంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలుచేసిన న్యాయవాది బందెల క్రాంతికుమార్, ఆయన న్యాయవాది సీఆర్ సుకుమార్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'వేసవి సెలవుల్లో ఏ కాలేజీలు తరగతులు నిర్వహిస్తున్నాయి? వాటిని ప్రతివాదులుగా చేర్చడానికి భయం ఎందుకని ప్రశ్నించింది. వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించడం వల్ల బాధితులు ఉంటే వారే కోర్టుకు వస్తారు. వారికి లేని బాధ మీకెందుకు? వాళ్లు తమ జీవితాలు బాగుపడాలని ఇష్టపూర్వకంగా తరగతులకు వెళ్తుండవచ్చ'ని పేర్కొంది. ఈ పిటిషన్ వేయడానికి పిటిషనర్‌కు ఉన్న అర్హత ఏమిటని ప్రశ్నించింది. ఇష్టం వచ్చినట్లు ప్రసంగాలు చేయడానికి ఇది రాజకీయ వేదిక కాదని, కోర్టుకు సమాధానం చెప్పేటప్పుడు మర్యాదలు పాటించాలని హితవు పలికింది. ఈ వ్యాజ్యంపై జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ ప్రభుత్వం, ఇంటర్ బోర్డు కౌంటర్ వేసేలోపు వేసవి సెలవులు ముగిసిపోతాయని, అందువల్ల హైకోర్టు చూస్తూ ఊరుకోకూడదని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. మరోవైపు ప్రభుత్వం, ఇంటర్ బోర్డు తరఫు న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదిస్తూ పిటిషనర్ ప్రచారం కోసమే ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. పిటిషనర్ ఆయా కాలేజీలకు వెళ్లి బెదిరింపులకు పాల్పడ్డారని, ఆయన సోషల్ మీడియా ఖాతాలు పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుందని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం పిటిషనర్ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ప్రభుత్వ కౌంటర్ లేకుండా ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంటూ విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.

'దోస్త్'పై స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి సంబంధించిన దోస్త్ నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. ఎస్సీ వర్గీకరణపై దాఖలైన పిటిషన్లు తేలేవరకు ఎస్సీ కులాలకు చెందిన విద్యార్థుల సీట్ల భర్తీని ఆపడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే మాల మహానాడు, షెడ్యూల్డ్ కులాల ఐక్య వేదిక వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశాయి. వాటిపై ఇప్పటికే ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు... ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదు. తాజాగా నూతన ఎస్సీ వర్గీకరణ చట్టం ఆధారంగా డిగ్రీ సీట్ల కేటాయింపును ఆపాలని కోరుతూ పిటిషనర్లు మాలమహానాడు, షెడ్యూల్డ్ కులాల ఐక్య వేదిక పిటిషన్లలో మధ్యంతర అప్లికేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 29న సీట్ల కేటాయింపు ఉందని, ఎస్సీ కులాల విద్యార్థుల సీట్ల కేటాయింపును కనీసం జూన్ 9వరకు ఆపాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది మామిడి అవినాశ్ రెడ్డి కోరారు. అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదిస్తూ ఎస్సీ వర్గీకరణ చట్టరూపం దాల్చి అమల్లోకి వచ్చిందని, అమలులో ఉన్న ఒక చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. వాదనలు విన్న జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు ధర్మాసనం.. దోస్త్ నోటిఫికేషన్, సీట్ల భర్తీపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. విచారణను జూన్ 10వ తేదీకి వాయిదా వేసింది.

'మైలాన్' విద్యుత్ కనెక్షన్ తొలగించవద్దు: హైకోర్టు

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న మైలాన్ ల్యాబొరేటరీపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మైలాన్‌లోని ఒక యూనిట్‌లో పేలుడు సంభవించడంతో విద్యుత్ కనెక్షన్ తొలగించాలని కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. చిన్న యూనిట్‌లో మానవ తప్పిదం వల్ల జరిగిన పేలుడుతో మొత్తం సంస్థపై చర్యలు తీసుకోవడం సబబు కాదని మైలాన్ తరఫు న్యాయవాది వాదించారు.

శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలి

» ఆయుధాలు వీడటంపై ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకోలేం

» మావోయిస్టు అధికార ప్రతినిధి అభయ్

హైదరాబాద్, మే14 (ఆంధ్రజ్యోతి) ఆపరేషన్ కగార్ పేరిట దారుణమారణకాండ కొనసాగుతోందని, దీనికి అడ్డుకట్ట వేస్తూ శాంతిచర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని ఓ లేఖలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ కోరారు. శాంతిచర్చలకు అనుకూల వాతావరణంలో భాగంగా తాము షరతుల్లేని కాల్పుల విరమణకు సన్నద్ధంగా ఉన్నట్లు ఇప్పటికే ప్రకటన జారీ చేశామని గుర్తు చేశారు. శాంతిచర్చల విషయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, బీఆర్ఎస్ నేత కేసీఆర్ బహిరంగసభలో శాంతిచర్చలు కావాలన్న డిమాండ్‌కు లక్షలాది ప్రజలు ఇచ్చిన స్పందన కేంద్రం గమనించాలని కోరారు. తమ పార్టీ నిర్మాణం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉంటుందని ఆయుధాల వీడటంపై తానొడినే నిర్ణయం తీసుకోలేనని, కేంద్రకమిటీ, కోర్ కమిటీ సమావేశమై చర్చ తర్వాత నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వాస్తవ పరిస్థితులు అందుకు అనుగణంగా లేవని కేంద్ర, కోర్ కమిటీసభ్యులు కలవడానికి వీలుగా కాల్పుల విరమణ, శాంతిచర్చల ప్రక్రియ కొనసాగించాలని కోరుకుంటున్నామన్నారు.

దాడులు ఆపి.. చర్చలు జరపాలి

» జస్టిస్ చంద్ర కుమార్ డిమాండ్

పంజాగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని, ఆదివాసీ ప్రాంతాల్లో కూంబింగ్ ఆపాలని పీస్ డైలాగ్ కమిటీ అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షుడు కందిమల్లా ప్రతాప్‌రెడ్డి, సమన్వయ కర్తలు ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, బండి దుర్గాప్రసాద్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, ఆదివాసీలపై కొనసాగిస్తున్న దాడులను ఆపాలని అన్నారు. ఆదివాసీ ప్రాంతాలలో శాంతి నెలకొల్పాలని అన్నారు. కర్రెగుట్టల నుంచి కేంద్ర, రాష్ట్ర బలగాలను వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్ పాఠశాలల్లో ఫీజుల పెంపును అనుమతించాలి

శ్రీధర్‌బాబుకు ట్రస్మా ప్రతినిధుల వినతి

ముషీరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ పాఠశాలల్లో ప్రతియేటా 15 శాతం ఫీజును పెంచుకునే విధంగా వెసులుబాటు కల్పించాలని తెలంగాణ స్కూల్ మేనేజ్‌మెంట్‌అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం కొత్త జీవోలు తయారు చేసే ముందు ట్రస్మా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు.

కర్రెగుట్టల్లో 31 మంది మావోయిస్టులు హతం

ఇప్పటి వరకు 28 మందిని గుర్తించాం.. కొందరు అగ్రనేతలూ హతమై ఉంటారు!

» నక్సల్స్‌కు లొంగిపోవడం తప్ప దారి లేదు

» సీఆర్‌పీఎఫ్ డీజీ జి.పి.సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ వెల్లడి

» శాంతిని నెలకొల్పుతాం: ప్రధాని

» మార్చి 31 కల్లా నక్సల్స్ రహిత భారత్: షా

చర్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): ఛత్తీసగఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో 21 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులను హతమార్చినట్లు అధికారులుతెలిపారు. మావోయిస్టు సమస్య అంతానికి ఇది ఆరంభమన్నారు. బీజాపూర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఆర్‌పీఎఫ్ డీజీ గ్యానేంద్ర ప్రతాప్ (జీపీ)సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్.. కర్రెగుట్టల ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. మావోయిస్టులకు లొంగిపోవడం తప్ప మరో అవకాశం లేదని స్పష్టం చేశారు. కర్రెగుట్టలపై మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం రావడంతో ఏప్రిల్ 21న ఆపరేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. అత్యంత కఠిన పరిస్థితుల్లో బలగాలు కూంబింగ్ చేశాయని, ఆపరేషన్ సాగిన 21రోజుల్లో 21 ఎన్‌కౌంటర్లు జరిగాయని చెప్పారు. అడవుల్లో 450 బీర్ బాంబులు, ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. మొత్తం 31 మంది మావోయిస్టులు చనిపోయారని, ఇప్పటివరకు 28మందిని గుర్తించామని, ఏడుగురి మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించామని వివరించారు. వీరందరిపై రూ.1.72 కోట్ల రివార్డు ఉందన్నారు. బలగాల దాడిలో చాలా మంది మావోయిస్టులు మృతి చెందారని, సెర్చ్ ఆపరేషన్‌లో మృతదేహాలు దొరుకుతున్నాయని తెలిపారు. మృతుల్లో చాలా మంది కీలక నేతలూ ఉంటారని పేర్కొన్నారు. గుట్టల్లో 214మావోయిస్టు డంపులు గుర్తించామని, 4 ఆయుధ తయారీ ఫ్యాక్టరీలను ధ్వంసం చేశామన్నారు. చనిపోయిన మావోయిస్టుల నుంచి అధునాతన మెషిన్‌గన్స్, ఏకే 47, ఇన్సాస్ తుపాకులు లభించాయని వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో 18 మంది జవాన్లు గాయపడ్డారన్నారు. ఆపరేషన్ కగార్ భవిష్యత్తులోనూ కొనసాగుతుందని తెలిపారు. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పిస్తామన్నారు.

వచ్చే మార్చి కల్లా నక్సల్స్ రహిత దేశం: షా

భద్రతా బలగాలు కర్రెగుట్టల్లో 31 మంది కరుడుగట్టిన నక్సలైట్లను హతమార్చడం ద్వారా దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చే లక్ష్యంలో కీలక ముందడుగు వేశాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. దేశంలో నక్సలిజాన్ని తుడిచిపెట్టేందుకు ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. మార్చి 31, 2026కల్లా దేశాన్ని నక్సల్స్ రహితంగా చేస్తామని మరోసారి హామీ ఇస్తున్నట్లు బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పుతాం: ప్రధాని

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పేందుకు కేంద్రం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ చెప్పారు. కర్రెగుట్టల్లో 31 మంది మావోయిస్టులను హతమార్చడం ద్వారా దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించివేయాలన్న ప్రభుత్వ లక్ష్యం దిశగా ముందడుగు పడినట్లు అయిందని పేర్కొన్నారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధిపథంలో నడిపిస్తామని ప్రధాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం!

» పలు జిల్లాల్లో వానలతో రైతుల ఇక్కట్లు

» ములుగు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన.. ప్రతి గింజా కొంటామని భరోసా

» పిడుగుపాటుకు ఒకరు.. వడదెబ్బతో మరొకరి మృత్యువాత

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

నడి వేసవిలో అకాల వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లు ఇంకా పూర్తి కాకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతంగా మారాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు.. బుధవారం సాయంత్రం పలు జిల్లాల్లో వానలు కురిశాయి. ములుగు జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం అర్ధరాత్రి దాటాక ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఏటూరునాగారం మండలం గోగుపల్లిలో సుమారు 50 మంది రైతుల ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. దీంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క, గోగుపల్లికి చెరుకుని తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని భరోసానిచ్చారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, ఓదెల మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో 1,500 క్వింటాళ్ల వరకు వరి ధాన్యం తడవడంతో పాటు కొంత కొట్టుకుపోయింది. ఓదెల మండలం మడకలో ఈదురుగాలులకు విద్యుత్తు వైర్లు తెగిపడి 25 గొర్రెలు మృతి చెందాయి. సిరిసిల్ల జిల్లాలో పిడుగుపాటుకు కోనరావుపేటలో ఎద్దు మృతి చెందగా, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడ్డారు. ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట, బెజ్జూరు మండలాల్లోనూ వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లాలోని పలు వ్యవసాయ మార్కెట్లలోనూ ధాన్యం కొట్టుకుపోయింది. షాబాద్ మండలం చందనవెల్లిలో అత్యధికంగా 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన మొక్కజొన్న, వరి ధాన్యం కళ్ల ముందే కొట్టుకుపోవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ఆమనగల్లు, చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి, నవాబ్‌పేట మండలాల్లో సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లపై వరద పారింది. వేసవిలోనూ వానలు క్రమంగా పడుతుండటంతో పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందారు. ఇక సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లిలో పొలం పనికి వెళ్లిన ఎడ్ల రత్నమ్మ (50) పిడుగుపాటుకు మరణించగా.. మరో కూలీ నాగమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. వడదెబ్బతో ఓ ఉపాధి కూలీ మృతి చెందింది. మహబూబాబాద్ జిల్లా పాత పోచారంలో గజ్జి యాకమ్మ ఉపాధి పనులు చేస్తూ కుప్పకూలి పడిపోయింది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించింది.



రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మార్కెట్‌లో వానకు కొట్టుకుపోయిన ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతు, పక్కన తడిసిన ధాన్యం బస్తాలు

తెలంగాణ కారు విజేతకు చెక్కు అందజేత

ఖమ్మం, మే 14 (ఆంధ్రజ్యోతి): ‘ఆంధ్రజ్యోతి’ 22వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో కారును గెల్చుకున్న రైతు గుడిపూడి శ్రీనివాసరావుకు బుధవారం ఖమ్మం యూనిట్ కార్యాలయంలో చెక్కు అందజేశారు. హైదరాబాద్‌లోని ‘ఆంధ్రజ్యోతి’ ప్రధాన కార్యాలయంలో గత నెల 11న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని డ్రా తీసి విజేతలను ప్రకటించారు. అందులో ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం రామాపురానికి చెందిన రైతు గుడిపూడి శ్రీనివాసరావును అదృష్టం వరించింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఖమ్మం ‘ఆంధ్రజ్యోతి’ యూనిట్ కార్యాలయంలో ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య చేతుల మీదుగా కారుకు సంబంధించిన నగదు చెక్కును అందజేశారు. శ్రీనివాసరావు, ఆయన సతీమణి నాగేంద్రలు కమిషనర్ చేతుల మీదుగా చెక్కును అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకుని రావడంలో ‘ఆంధ్రజ్యోతి’కి ప్రత్యేక స్థానం ఉందన్నారు. పాఠకుల కోసం ‘ఆంధ్రజ్యోతి’ లక్కీ డ్రా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ‘ఆంధ్రజ్యోతి’ ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ తాళ్లూరి పుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.


కారు విజేత గుడిపూడి శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆంధ్రజ్యోతి ఖమ్మం బ్రాంచ్ మేనేజరు పుల్లారావు, సిబ్బంది

కారులేని లోటును ‘ఆంధ్రజ్యోతి’ తీర్చింది

‘మాది వ్యవసాయ కుటుంబం. మాకున్న పది ఎకరాలతో పాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. ఎప్పటినుంచో కారు కొనాలని అనుకుంటున్నా అది సాధ్యపడలేదు. ఇప్పుడు మాకు కారులేని లోటును ‘ఆంధ్రజ్యోతి’ తీర్చింది. లక్కీ డ్రాలో గెలుపొందినట్లు ఫోన్ వచ్చిన తర్వాత కారు బుక్ చేసుకున్నాం. గత మూడేళ్లుగా ‘ఆంధ్రజ్యోతి’ పత్రికను చదువుతున్నాను. లక్కీ డ్రాలో రాష్ట్రస్థాయిలో విజేతగా నిలవడం గొప్ప అనుభూతినిచ్చింది’

- విజేత శ్రీనివాసరావు, నాగేంద్ర

ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్

కేరళ ప్రభుత్వ ఏజెన్సీకి బాధ్యతలు.. నేడో రేపో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌లో విలువైన భూముల రికార్డులు తారుమారు చేశారని, పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలను నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫోరెన్సిక్ ఆడిట్‌కు సిద్ధమైంది. కేరళ రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ ఏజెన్సీకే ఆడిట్ బాధ్యతలను అప్పగించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి ఒకటి రెండు రోజుల్లోనే ఉత్తర్వులు కూడా రానున్నాయి. 2024 డిసెంబరు 20న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ నిర్వహణలో లోపాలను, టెండర్ల కేటాయింపులో జరిగిన అవకతవకలను ప్రస్తావించారు. భూ రికార్డుల్లో అక్రమాలు జరిగాయా లేదా? అని తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని, నివేదికల ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆసక్తి ఉన్న ఏజెన్సీల నుంచి ప్రతిపాదనలు స్వీకరించింది. దేశీయ సంస్థలతోపాటు విదేశీ సంస్థలు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు ముందుకొచ్చాయి. దేశీయంగా 4 సంస్థలు ఆసక్తి చూపగా కేరళకు చెందిన ప్రభుత్వ ఏజెన్సీ వైపే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గుచూపింది. గతంలో టెర్రాసిస్ అనే విదేశీ సంస్థ ధరణి పోర్టల్ నిర్వహణ చేపట్టడంపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో.. స్వదేశీ సంస్థకే ఆడిట్ బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. కేరళకు చెందిన ప్రభుత్వ ఏజెన్సీకే ఆడిట్ బాధ్యతలను అప్పగించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ధరణి పోర్టల్ నిర్వహణ విదేశీ సంస్థకు అప్పగించడం వల్ల భూ యజమానుల గోప్యతకు భంగం వాటిల్లిందనే విమర్శలు వెల్లువెత్తాయి. కొంతమంది అధికారులు, ప్రైవేటు వ్యక్తులు అనధికారికంగా పోర్టల్‌ను యాక్సెస్ చేసి భూ రికార్డులను మార్చినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే సుమారు 15 వేల ఎకరాల విలువైన ప్రభుత్వ భూములను ధరణి పోర్టల్ ద్వారా ఆక్రమించారని ప్రభుత్వం వెల్లడించింది. ఈ భూముల విలువ రూ.లక్ష కోట్లకుపైగా ఉంటుందని అంచనా వేసింది. పోర్టల్‌లో అనేక లోపాలున్నట్లు ఐటీ నిపుణులు గుర్తించారు. దీంతో ప్రభుత్వం ధరణి పోర్టల్ రద్దు చేసి ఆ స్థానంలో భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

లక్షల ఎకరాల రికార్డుల తారుమారు!

2014 నుంచి 2023 మధ్య కాలంలో అటవీ భూములు, దేవాదాయ, వక్ఫ్, భూదాన్ భూములకు సంబంధించి లక్షల ఎకరాల రికార్డులు తారుమారు అయ్యాయని ప్రభుత్వం చెబుతోంది. ఇందుకు సంబంధించి ఆయా విభాగాల వద్ద ఉన్న రికార్డుల ప్రకారం 2014 ముందు ఉన్న భూముల వివరాలకు, 2023 తరువాత భూముల వివరాలకు పొంతన లేకుండా పోయిందనేది ప్రభుత్వ వాదన. 2014కి ముందు రిజిస్ట్రేషన్ శాఖ వద్ద నిషేధిత భూములకు సంబంధించి ఉన్న జాబితాలను తీసుకుని.. అదే సర్వే నంబర్లకు సంబంధించి ప్రస్తుత పరిస్థితిని బేరీజు వేసి.. ఎన్ని ఎకరాలు జాబితా నుంచి తొలగించారనే వివరాలను బయటపెడతామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ ఏడాది పాలన విజయోత్సవాల సందర్భంగా స్పష్టం చేశారు. తెలంగాణలో 2017 సెప్టెంబరు నుంచి 2018 జనవరి వరకు భూరికార్డుల నవీకరణ జరిగింది. ఆ సమయంలో అటవీశాఖ లెక్కల ప్రకారం 66.67 లక్షల ఎకరాల అటవీ భూమి ఉండాల్సి ఉంటే.. లెక్కల్లో 43.93 లక్షల ఎకరాలే ఉన్నట్లు తేలింది. 22.74 లక్షల ఎకరాల భూములు మాయమయ్యాయని అటవీ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే విషయమై ఆనాటి ముఖ్యమంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేసింది. అటవీ సరిహద్దు వివాదాల కారణంగా 2.18 లక్షల ఎకరాల భూమికి ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ కమ్ పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా ప్రభుత్వం.. వాటిని వివాదాస్పద భూముల జాబితాలో చేర్చింది. అటవీ శాఖ తాను కోల్పోయిన భూములు 22 లక్షల ఎకరాలు అని చెబుతుండగా.. కేవలం 2.18 లక్షల ఎకరాలే అభ్యంతర జాబితాలో ఉన్నాయి. ఈ భూములపై సమగ్ర సర్వే చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా నిర్ణయించింది. 2018 జనవరి 1 నుంచి 31వ తేదీ దాకా స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. జయశంకర్ భూపాలపల్లి, నాగర్‌కర్నూలు, కొమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, ఆదిలాబాద్, భద్రాద్రికొత్తగూడెం తదితర జిల్లాల్లోకి సర్వేయర్లతో కూడిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు వెళ్లాయి. అయితే ప్రభుత్వం 2.18 లక్షల ఎకరాల వివాదాలు తేల్చి.. ఆయా భూములను సాగు చేసుకుంటున్న రైతులకు ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ కమ్ పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇవ్వాలని రెవెన్యూశాఖ చెబుతుండగా.. అటవీ శాఖ మాత్రం 22 లక్షల ఎకరాల భూములను తమ శాఖ జాబితాలో చేర్చాలని కోరుతోంది. సర్వే అనంతరం పరిశీలించగా 42.53 లక్షల ఎకరాల అటవీ భూమి ఉన్నట్లు తేలింది. ఏకంగా 24.14 లక్షల ఎకరాల భూమి మాయమయిందని 2018లో అప్పటి పీసీసీఎఫ్ ప్రభుత్వానికి పలుసార్లు లేఖలు రాశారు. రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి 2023లో కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటికి భూరికార్డుల్లో జరిగిన అక్రమాలపై శాస్త్రీయంగా లోతైన అధ్యయనం చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దేవుడి భూములూ మాయం!

తెలంగాణలో 12 వేల దేవాలయాలుండగా.. గుడుల పేరిట 84,195 ఎకరాల భూమి ఉండేది. 2017-18 భూరికార్డుల నవీకరణ అనంతరం 10 వేల ఎకరాలు తగ్గి.. 74,128.07 ఎకరాలుగా మిగిలింది. ధరణిలోకి ఎక్కించే సమయానికి 49 వేల ఎకరాలకు చేరింది. సుమారు 25 వేల ఎకరాల లెక్కలు తేలాల్సిఉంది. రికార్డు నవీకరణకు ముందు తెలంగాణలో 74 వేల ఎకరాల వక్ఫ్‌భూములుండగా.. కేవలం 45,564 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. 28436 ఎకరాల భూమి రికార్డుల నుంచి మాయమై.. పాస్‌పుస్తకాల్లోకి ఎక్కి, పట్టా భూమిగా మారిపోయిందని తేలింది. లోపభూయిష్టంగా జరిగిన భూరికార్డుల నవీకరణలో అటవీ, వక్ఫ్, దేవాదాయ శాఖ భూములు క్రమంగా తగ్గి.. పట్టాభూముల శాతం పెరిగింది. రాష్ట్రంలో అసైన్డ్ భూములు 22.68 లక్షల ఎకరాలు ఉండగా.. ఇవి కూడా మాయమైపోయాయి. భూరికార్డుల నవీకరణకు ముందు రాష్ట్రంలో మొత్తం పట్టా భూములు 1.30 కోట్ల ఎకరాలుంటే 2020 అక్టోబరు 23 నాటికి ఈ లెక్క 1.55 కోట్ల ఎకరాలకు చేరింది. పట్టా భూముల జాబితాలో ఏకంగా 25 లక్షల ఎకరాలు అదనంగా చేరాయి. ఈ 25 లక్షల ఎకరాలు అటవీ భూములా లేక దేవాదాయ భూములా, వక్ఫ్ భూములా? అనేది తేలాల్సి ఉంది. అయినా రికార్డులు నవీకరణ అనంతరం 2020లో ధరణి పోర్టల్‌లోకి ఎక్కించేశారు. రిజిస్ట్రేషన్లు, ఆ వెంటనే మ్యుటేషన్లు జరిగిపోయాయి. మరోవైపు.. భూదాన్ భూములు 1.60 లక్షల ఎకరాల రికార్డులూ తారుమారు అయ్యాయి. ప్రస్తుతం సీసీఎల్ఏలో ఓ అధికారిని నియమించి పునఃపరిశీలన చేపట్టి సర్వే నంబర్ల వారీ భూదాన్ భూ వివరాలను సేకరిస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకు ప్రభాకర్ రావు

» బెయిల్ ఇస్తే అమెరికా నుంచి వస్తానని పిటిషన్

న్యూఢిల్లీ, మే 14 (ఆంధ్రజ్యోతి) : సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు అమెరికా వెళ్లిపోయారు. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే, తాను భారతదేశానికి తిరిగివస్తానని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుదీర్ఘ వాదనల తర్వాత ఈ నెల 2న బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. హైకోర్టు తీర్పును ప్రభాకర్ రావు ఈ నెల 9న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. తనపై ఆరోపణలన్నీ అవాస్తవాలేనని, ఆరోగ్యం బాగోలేక చికిత్సకు అమెరికా వెళ్లానని, ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దేశానికి తిరిగి వస్తానని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో కస్టడీకి శ్రవణ్‌రావు

» పీటీ వారెంట్ దాఖలు చేయనున్న సిట్

హైదరాబాద్, మే14 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడైన శ్రవణ్‌రావును పీటీ వారెంట్‌పై కస్టడీలోకి తీసుకోవడానికి సిట్ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ కేసులో శ్రవణ్‌రావును పలుమార్లు సిట్ అధికారులు విచారించినాసహకరించని నేపథ్యంలో సుప్రీంకోర్టు శ్రవణ్‌రావుకు ఇచ్చిన మధ్యంతర రక్షణను రద్దు చేయాలని ఇప్పటికే సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు నుంచి స్వల్ప ఊరటతో బయటపడిన శ్రవణ్‌రావు ఊహించని విధంగా చీటింగ్ కేసులో అరెస్టు కావడంతో సిట్ అధికారులకు ఇది అవకాశంగా మారింది.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

బంజారాహిల్స్, మే 14 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. నగరంలోని ఎర్రగడ్డలో ఉంటున్న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ సభ్యుడిగా వ్యవరిస్తున్నారు. ఈ నెల 14న బంజారాహిల్స్‌లో మీడియాతో సమావేశంలో పాడి కౌశిక్‌రెడ్డి టీజీఎస్ గ్రూప్-1 పరీక్షల్లో భారీ స్కామ్ జరిగిందని, ఇందులో రాములు నాయక్ అతని కోడలు కడావత్ రోజాబాయి ముఖ్య పాత్ర పోషించారని ఆరోపించారు. కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తమ గౌరవానికి, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని పేర్కొంటూ రాములు నాయక్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కౌశిక్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు పోగొట్టుకుని.. ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కోటగిరి, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు పోగొట్టుకోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన నిజామాబాద్ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రుద్రూరు ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని రుద్రూరు మండలం రాయకూర్ గ్రామానికి చెందిన గంగాధర్(20) చదువు మధ్యలో మానేసి.. ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడ్డాడు. మంగళవారం తన తండ్రి పోశెట్టి సెల్ నుంచి 5 వేల రూపాయలు తన ఫోన్‌కు పంపుకొని ఆన్‌లైన్ గేమ్‌లు ఆడాడు. గేమ్‌లో డబ్బులు పోవడంతో తండ్రి కోప్పడతాడేమోనని భయపడ్డాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై గ్రామ శివారులో గల చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి తండ్రి పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.


గంగాధర్(ఫైల్)

వేములవాడ బంద్ పాటించిన వ్యాపారులు

» దేవాలయాన్ని మూసివేయాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బంద్

» భక్తుల మనోభావాలకు భంగం కలిగిందన్న ఆలయ పరిరక్షణ సమితి

వేములవాడ, మే 14(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయాన్ని మూసివేయాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాజన్న ఆలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన వేములవాడ పట్టణ బంద్ విజయవంతమైంది. ప్రధాన రహదారుల్లో దుకాణాలు, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలను మూసివేశారు. ఈ సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రామతీర్థపు రాజు తదితరులు పాదయాత్ర చేశారు. రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేసే విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఆలయ అభివృద్ధికి ఎన్ని కోట్లు మంజూరయ్యాయో, ఏ రకమైన డిజైన్లు ఖరారు చేశారో వెల్లడించకుండానే జూన్ 15 నుంచి ఆలయాన్ని మూసివేసి భక్తులకు భీమేశ్వరాలయంలో దర్శనం కల్పించాలని నిర్ణయించడం సరికాదని ప్రతాప రామకృష్ణ అన్నారు. ఆలయ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, దర్శనాలు, ఆలయ విస్తరణకు సంబంధించి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని భక్తుల మనోభావాలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు

వేములవాడ ఆలయ అభివృద్ధికి.. బీజేపీ, బీఆర్ఎస్ అడ్డు : ఆది శ్రీనివాస్

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ ఆలయాన్ని ప్రభుత్వం రూ. 76 కోట్లతో అభివృద్ధి చేస్తుంటే.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు అడ్డు తగులుతున్నారంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. అభివృద్ధిని జీర్ణించుకోలేకనే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు వేములవాడ పట్టణ బంద్‌కు పిలుపు ఇచ్చారని విమర్శించారు. ఆలయ అభివృద్ధి పనులు కొనసాగిస్తూనే స్వామి వారికి నిత్య పూజలు యథావిధిగా నిర్వహిస్తామని, దేవాలయం మూసివేత ఉండదని స్పష్టం చేశారు. “భక్తులకు ఆర్జిత సేవలను దూరం చేయకుండా శృంగేరి పీఠాధిపతుల సూచనల మేరకు భీమేశ్వరాలయంలో ఏర్పాటు చేశాం... దానికి రాజన్నకు చేసే పూజలు భీమన్నకు ఎలా చేస్తారని వితండవాదం చేస్తే ఎట్లా? రాజన్న ఆలయంలోను, భీమన్న ఆలయంలోనూ ఉన్నది పరమశివుడే కదా?” అంటూ నిలదీశారు. అసలు మహా మండపాన్ని ముట్టుకుంటామని, దేవాలయాలను మారుస్తామని ఎవరు చెప్పారని ప్రశ్నించారు. ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు చర్చలకు వస్తే వారి సూచనలు, సలహాలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇందులో ఎలాంటి రహస్యం లేదని తెలిపారు. ఈమేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సీటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్రాలేవి?

» ఓపీ, ఐపీ, ఫ్యాకల్టీ, శస్త్రచికిత్సలు, వ్యాధి నిర్ధారణ పరీక్షల లెక్కల్లో తేడాలెందుకు?

» 20కిపైగా సర్కారు వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ షోకాజ్ నోటీసులు

» ప్రైవేటులోనూ మెజార్టీ కాలేజీలకు..

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కళాశాలల్లో మౌలిక సదుపాయాల లేమి, అధ్యాపకుల కొరతతో పాటు వివిధ అంశాలపై వారంలో వివరణ ఇవ్వాలంటూ తాజాగా ఈమెయిల్స్ పంపింది. రాష్ట్రంలో 20కిపైగా ప్రభుత్వ వైద్య కళాశాలలకు నోటీసులు అందాయి. ఆయా కళాశాలల్లో 90 శాతం కొత్తవే ఉన్నాయి. ముఖ్యంగా అనుబంధ ఆస్పత్రుల్లో సీటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్రాలు లేకపోవడం, అధ్యాపకుల కొరత, శస్త్రచికిత్సలు, ఓపీ, ఐపీలు తక్కువగా ఉండటం, ఆయా లెక్కల్లో తేడాలుండటంతో షోకాజ్ నోటీసులిచ్చినట్లు సమాచారం. రాష్ట్రంలో మొత్తం ప్రైవేటు కాలేజీలు 28 ఉండగా.. అందులో మెజార్టీ కళాశాలలకు కూడా నోటీసులందినట్లు తెలుస్తోంది.

రోజు వారీ నివేదికలను ఏడీఆర్‌తో పోల్చి

వైద్య కళాశాలలు, అనుబంధ ఆస్పత్రులు ప్రతీ యేటా విధిగా వార్షిక బహిర్గత నివేదిక (ఏడీఆర్)ను ఎన్ఎంసీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. అంటే ఆ ఏడాది తమ ఆస్పత్రిలో నమోదైన అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ వివరాలు, చేసిన శస్త్రచికిత్సలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, పడకల సంఖ్య, అధ్యాపకుల వివరాలు, సీట్ల సంఖ్యతో సహా అన్ని వివరాలను తెలపాల్సి ఉంటుంది. అలాగే ప్రతి బోధనాస్పత్రి కూడా రోజువారీ ఆయా వివరాలను కేంద్రం నిర్వహించే హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం (హెచ్ఎంఐఎస్) పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇలా రోజువారీగా అప్‌లోడ్ చేసే వివరాలతో, ఏడీఆర్ నివేదికలోని గణాంకాలు సరిపోలాలి. అలా కుదరని పక్షంలో ఆ వ్యత్యాసాలపై వివరణ ఇవ్వాలంటూ ఎన్ఎంసీ నోటీసులు జారీ చేస్తుంది. తాజాగా అలాగే దేశవ్యాప్తంగా కాలేజీలకు నోటీసులు పంపింది. ఇప్పుడు ఆయా కాలేజీలు పంపే వివరణకు ఎన్ఎంసీ సంతృప్తి చెందితే సరి.. లేదంటే వైద్య విద్య నిబంధనల ప్రమాణాల నిర్వహణ చట్టం-2023 నిబంధనల మేరకు రూ.కోటి వరకు జరిమానా విధిస్తామని ఆ షోకాజ్ నోటీసుల్లో పేర్కొంది. అయితే సర్కారు వైద్య కళాశాలల తరపున ప్రభుత్వమే అఫిడవిట్ ఇస్తుందని.. లోపాలను సరిదిద్దుకునేందుకు మరో అవకాశమివ్వాలని కోరితే.. ఎన్ఎంసీ జరిమానాతో సరిపెడుతుందని సీనియర్ అధ్యాపకులు చెబుతున్నారు.

తమిళనాడులో 36లో 34 కాలేజీలకు..

దక్షిణ భారతదేశంలో వైద్యం, వైద్య విద్యలో ముందున్న తమిళనాడుకు కూడా ఎన్ఎంసీ షాక్ ఇచ్చింది. ఆ రాష్ట్రంలో మొత్తం 36 ప్రభుత్వ వైద్య కళాశాలలుంటే, అందులో ఏకంగా 34 కాలేజీలకు నోటీసులు జారీ చేసింది.



సీఎంతో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ భేటీ

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సందీప్‌కుమార్ సుల్తానియా బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మొన్నటివరకు రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉండడంతో సందీప్‌కుమార్ ఆశాఖలోనే ఒక ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. అయితే ఇటీవల రామకృష్ణారావు కొత్త సీఎస్‌గా నియమితులైయ్యారు. దీంతో సందీప్ కుమార్ సుల్తానియాకు పూర్తిస్థాయి ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పార్లమెంట్‌ను సమావేశపర్చాలి

» సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం ఏ బేబీ

పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ వంటి అంశాల మీద వాస్తవాలను ప్రజలకు చెప్పేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడంపై ఆయన అభ్యంతరకరం వ్యక్తం చేశారు. అనంతరం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్‌ను కేంద్రం నిలిపివేయడం శుభ పరిణామమన్నారు. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రేవంత్‌కు తెలియదా ? అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రశ్నించారు.

సమగ్ర విత్తన చట్టం ముసాయిదా కమిటీ చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి

» కన్వీనర్‌గా శివప్రసాద్ సహా సభ్యుల నియామకం

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమగ్ర విత్తన చట్టం- 2025 ముసాయిదా కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముసాయిదా కమిటీ కన్వీనర్‌గా సంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి కె.శివప్రసాద్ నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా న్యాయవాది ఎం.సునీల్ కుమార్, జయశంకర్ వర్సిటీ విత్తన విభాగం డైరెక్టర్ డాక్టర్ నగేశ్ కుమార్, సుస్థిర వ్యవసాయ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామాంజనేయులు, వ్యవసాయ శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ రంగ నిపుణులు డి.నరసింహారెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి సిఫార్సుల మేరకు.. రాష్ట్రంలో సమగ్ర విత్తనచట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా ముసాయిదా కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టర్, జనగాం గారి ప్రకటన
ఫారం-VII
రూఢీ ప్రకటన
(చూడుము సబ్ రూల్ 1, రూల్-25, సెక్షన్ - 19(1) చట్టం-30/2013)
జిల్లా కలెక్టర్, జనగాం గెజిట్ నెం. LA/JN/18/2025 తేది.08.05.2025
జిల్లా కలెక్టర్, జనగాం ఫైల్ నెం. G1/419/2025 తేది.05.05.2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఫైల్ నెం. B/339-1/2024 తేది.21.08.2025
జనగాం జిల్లా, రఘునాథపల్లి మండలములోని, గోవర్ధనగిరి గ్రామములో ఆ క్రింద అనుబంధంలో చూపబడిన ఎ3-27 గుంటల భూమి ప్రజా ప్రయోజన నిమిత్తం ... D-8L కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.700 ... చట్టం-30/2013 ప్రకారం సేకరించుటకు నిర్ణయించినారు.
... D-8/HRMC కాలువ నిర్మాణము కొరకు ... (Declaration) ప్రకటన జారీ చేయనైనది.
అనుబంధం
గండిరామారం రిజర్వాయరు గ్రామం: గోవర్ధనగిరి మండలం: రఘునాథ్ పల్లి
హైలెవెల్ కుడికాలువకు
8-ఎల్ డిస్ట్రిబ్యూటరి

క్రమ సంఖ్య	సర్వే నెం.	ప్రైవేట్ రకం	భూమి రకం తరి/మెట్ట	భూసేకరణ విస్తీర్ణం ఎ.గుం.	పట్టాదారు/అనుభవదారు	వృక్షములు/నిర్మాణములు ఇంకా ఏమైనా
1	242	పట్టా	మెట్ట	0-20	ఎం.డి. బీబీ తండ్రి సాహెబ్ అలీ	
		పట్టా	మెట్ట	0-14	వల్లెపు ఆగయ్య తండ్రి లక్ష్మయ్య	
			మొత్తం	0-34		
2	244	పట్టా	మెట్ట	0-13	రాపాక నరేందర్ రెడ్డి తండ్రి రామకృష్ణ రెడ్డి	
		పట్టా	మెట్ట	0-13	వల్లెపు రేణుక భర్త కుమార్	
			మొత్తం	0-26		
				0-02	రోడ్	
3	273	పట్టా	మెట్ట	1-09	రాపాక నరేందర్ రెడ్డి తండ్రి రామకృష్ణ రెడ్డి	
4	278	పట్టా	మెట్ట	0-18	[illegible] తండ్రి ఐలయ్య	
		పట్టా	మెట్ట	0-18	జంకల మధు తండ్రి గట్టయ్య	
			మొత్తం	0-36		
		పూర్తి మొత్తం		3-27		

భూసేకరణ చట్టం, 30/2013 లోని సెక్షన్-15 క్రింద ఇచ్చిన అభ్యంతరములను పరిశీలించిన పిదప ఇట్టి రూఢీ ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ...
సం/- ప్రత్యేక ఉప కలెక్టర్, ఎల్.ఎ.-ఆర్ & ఆర్, యూనిట్-I, నీటి పారుదల ప్రాజెక్టులు, జనగాం
సం/- అదనపు కలెక్టరు జనగాం
సం/- జిల్లా కలెక్టరు జనగాం
DIPR RO.NO: 95/LA-PP/ADVT/PUBLICATION/2025-26


నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్
(స్టేట్ యాక్ట్ క్రింద స్థాపించబడిన విశ్వవిద్యాలయం)
పంజాగుట్ట, హైదరాబాద్-500082, తెలంగాణ. ఫోన్ : 040-23489000 / 9244
040-23396552, ఫ్యాక్స్ : 040-23310076, వెబ్‌సైట్: www.nims.edu.in
Rc.No.Plng I/20/2024/TCJ/Newspapers ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది. 05.2025
NIMS ... (www.eprocurement.telangana.gov.in) ... http://tender.telangana.gov.in ...
DIPR R.O.No.1813-PP/CL/ADVT/1/2025-26, Dt.:14-05-2025 సం/- ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్.

తెలంగాణ ప్రభుత్వం
అటవీశాఖ
Rc.No.1252/2019/S3, బహిరంగ కలప వేలం ప్రకటన Date:14.05.2025
... తేది:19.05.2025, 22.05.2025, 26.05.2025, & 31.05.2025 ఉదయం 10.00 గంటలకు ఏటూరు నాగారం ప్రభుత్వ కలప డిపో (Government Timber Depot) నందు బహిరంగ వేలం నిర్వహించబడును. ... (ఫోన్ నంబర్ :9177720923 నందు సంప్రదించగలరు) ...
(యస్.రమేష్) డివిజనల్ అటవీశాఖ అధికారి ఏటూరు నాగారం
DIPR RO No.1847-PP/CL/ADVT/1/2025-26,Dt.14.05.2025 వన్యప్రాణి విభాగం, జిల్లా ములుగు

తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్
జిల్లా కార్యాలయం : జనగామ
Lr.No.Mktg/M1/345/2025 సంక్షిప్త టెండరు ప్రకటన తేది: 14.05.2025
... మేనేజర్, TGSCSCL, రూమ్ నం.10, 2వ అంతస్తు, ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్, జనగామ - 506167 ... District Manager, TGSCSCL, Jangaon పేరున రూ.1000/- చెల్లించవలెను. ... సెల్ నం: 9441512991. ... 15.05.2025 ఉ.10.30 గం. ... 17.05.2025 మ.1.00 గం. ... 17.05.2025 సా.4.00 గం.
సం/- జిల్లా మేనేజర్, TGSCSCL, జనగామ సం/- అడిషనల్ కలెక్టర్ & EOED, TGSCSCL, జనగామ
DIPR RO No.1850-PP/CL/ADVT/1/2025-26, తేది: 14.05.2025

కోరుట్ల పురపాలక సంఘం
టెండరు ప్రకటన
ఎ. ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్:- (1) NIT No.E1/Tenders/465/2025, తేది:14.05.2025, (2) మొత్తం పనులు: 28 నం.లు, (3) మొత్తం ECV: రూ.1,06,55,000/-, (4) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 16.05.2025న ఉ.11.00 గం.లకు, (5) బిడ్ దాఖలుకు ఆఖరి తేది: 23.05.2025న సా.04.00 గం.లకు. (6) బిడ్ తెరుచు తేది & సమయం: 23.05.2025న సా.05.00 గం.ల నుండి. ... 9849922177 మరియు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://tender.eprocurement.gov.in ను చూడగలరు. ... DRCC ... 2TPD ... (JCB ...) ... 500 LPH, ... 20 kv UPS/ఇన్వర్టర్ ... 17.05.2025న సా.04.00 గం.లకు.
సం/- కమిషనర్, కోరుట్ల పురపాలక సంఘం
DIPR RO No.1843-PP/CL/ADVT/1/2025-26, తేది: 14.05.2025

AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED (ADCL)
54-15-1, Venkateswara Nagar, Near Yalamanchili Complex, Sonovision Building, Ring Road, Vijayawada, NTR Dist, Andhra Pradesh-520008. CIN Number: U93000AP2015SGC105535
E-PROCUREMENT TENDER NOTICE
Tender Notice No.009/CAO/ADCL/F&A/2025-26 Dt. 15.05.2025
Name of Work: ADCL - "Appointment of Internal Auditors for year 2025-26 for O/o ADCL, Vijayawada" - Estimated Contract Value: Rs.3,00,000/- (Exclusive of all Taxes). The Bid can be downloaded from AP e-procurement portal from 16.05.2025 to 30.05.2025 up to 14.00 hrs. Due date for submission of Bid is 30.05.2025 up to 15.30 hrs. Technical Bid opening 30.05.2025 16.00 hrs. For further details, please refer to www.apeprocurement.gov.in and https://adcl.in
Sd/- Chairperson and Managing Director, ADCL, Vijayawada


Professor Jayashankar
Telangana Agricultural University (PJTAU)
Rajendranagar, Hyderabad
ADMISSIONS OPEN 2025-26
UG Courses in Agriculture, Food Technology, Agricultural Engineering and Community Science. Regular / Special Category / NRI seats are available. Special courses with Western Sydney University (WSU), Australia - PJTAU - WSU joint / dual UG/UG+PG Self Finance course. Only University with ICARs accreditation in the State, offering Agriculture courses. 100% Placements. Highly qualified faculty, smart classrooms and advanced labs.
For details, visit website www.pjtau.edu.in
Contact: 040-24011854, 8332970271, 833 2970284
Dr. G. E. CH. VIDYA SAGAR
REGISTRAR
DIPR RO No. 1854-PP/CL/ADVT/1/2025-26, Dt. : 14.05.2025

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విరాట్ లేని క్రికెట్

ఆటలో విజయమే తప్ప రాజీపడని పోరాట యోధుడిగా పేరు గాంచిన క్రికెట్ కింగ్ విరాట్ కోహ్లీ తన టెస్టు ప్రస్థానానికి ముగింపు పలికాడు. ఇది క్రికెట్ అభిమానులకు ఒకింత బాధను కలిగించొచ్చు. మొన్నటికి మొన్న టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ క్రికెట్‌లో సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడం అందరినీ ఆశ్చర్య పరిచింది. ఇంతలోనే విరాట్ కూడా సంప్రదాయ క్రికెట్ నుంచి వైదొలగడం భారత క్రికెట్‌కు అతిపెద్ద లోటే. కానీ, ఎంత గొప్ప ఆటగాడైనా ఏదో ఒకరోజు తప్పుకోక తప్పదు. ప్రతి ప్రయాణానికీ ముగింపు ఉంటుందనేలా... కోహ్లీ కూడా తన సుదీర్ఘ కెరీర్‌కు గుడ్‌బై చెప్పేశాడు. అయితే, ఈ గొప్ప ఆటగాడి మజిలీలో ఎన్నో మలుపులు, మైలురాళ్లు, మరెన్నో అద్భుతాలను క్రికెట్ ప్రపంచం ఆస్వాదించగలగడం ఇక్కడ చెప్పుకోదగ్గ విశేషం.

కొందరు ఆటతో పేరు తెచ్చుకుంటారు, మరికొందరు ఆ ఆటకే వన్నె తెస్తారు. రెండో కోవలోకి వస్తాడు విరాట్ కోహ్లీ. సాధారణంగా ఓ క్రికెటర్‌కు ఒక ఫార్మాట్‌లో గొప్ప రికార్డు ఉంటుంది. కానీ, మూడు ఫార్మాట్లలోనూ ప్రతిభ చూపడం కోహ్లీకే చెల్లింది. టీ20, వన్డేలు, టెస్టుల్లో అద్భుతమైన ప్రదర్శనతో క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అద్వితీయమైన ఆటతో, మొక్కవోని పట్టుదలతో క్రికెట్ ప్రేమికులను మంత్రముగ్ధులను చేశాడు. ఎన్నో మెగా టోర్నమెంట్లలో ఒంటిచేత్తో ప్రత్యర్థులను అడ్డుకొని అపురూప మైన విజయాలను అందించాడు. మరీ ముఖ్యంగా ఛేదనలో ఒక్కొక్క బ్యాటర్ చేతులెత్తేస్తుంటే, ప్రత్యర్థి బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో కట్టి పడేస్తుంటే, అభిమానుల ఆశలు మోస్తూ చివరిదాకా మైదానంలో నిలిచిన సందర్భాలు అతని కెరీర్‌లో అనేకం. ధనాధన్ షాట్లతో, వేగంగా పరుగులు రాబట్టగలిగే పరిమిత ఓవర్ల ఆటకే పరిమితమవుతున్న నేటితరం క్రికెట్‌లో... మెరుపు వేగంతో దూసుకొచ్చే ఎరుపు బంతులను కళాత్మక షాట్లతో బౌండ్రీకి తరలిస్తూ ఐదురోజుల ఆటను మరింత జనరంజకంగా మలచిన ఘనత కోహ్లీది. శారీరకంగానే గాకుండా మానసిక పరీక్షగా నిలిచే 'టెస్టు' క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన ఆటగాడిగా నిలిచిన తీరు సర్వదా ప్రశంసనీయం. పద్నాలుగేళ్ల క్రితం వెస్టిండీస్ పర్యటనతో మొదలైన అతని టెస్టు ప్రస్థానం, ఒక్కో మెట్టు ఎక్కుతూ దినదిన ప్రవర్ధమానమైంది. 123 టెస్టులాడిన అతను 210 ఇన్నింగ్స్‌ల్లో 9,230 పరుగులు సాధించాడు. 30 శతకాలు, 31 అర్ధ శతకాలతో అలరించాడు. ఓ వైపు పరుగుల మోత మోగిస్తూనే, నాయకుడిగానూ తనకు తిరుగులేదని చాటుకున్నాడు. కెప్టెన్ హోదాలో 68 టెస్టుల్లో 40 విజయాలు జట్టుకు కట్టబెట్టాడు. ఆస్ట్రేలియా గడ్డపై చరిత్రాత్మక సిరీస్ విజయాన్ని అందించాడు. ఏకంగా 42 నెలలపాటు టీమిండియాను టెస్టుల్లో నెంబర్‌వన్ ర్యాంకుతో అగ్రపీఠాన నిలబెట్టాడు. టెస్టుల్లో అత్యంత విజయవంత మైన భారత సారథిగా ఖ్యాతి గడించాడు. స్వదేశం, విదేశం అన్న తేడా లేకుండా అన్ని పిచ్‌లపైనా రాణించగలగడం విరాట్ ప్రత్యేకత. విదేశాల్లో భారత జట్టు టెస్టు మ్యాచ్‌లను డ్రా చేసుకుంటే చాలు అన్న దశ నుంచి ప్రత్యర్థిని వాళ్ల గడ్డపైనే చిత్తు చేసే స్థాయికి తీసుకొచ్చిన గొప్ప సారథి అతను. భారత క్రికెట్‌లో చెరగని ముద్ర వేసిన ధోనీ వారసత్వాన్ని నిలబెట్టిన నిఖార్సయిన నాయకుడు. తనకే సాధ్యమైన ఆటతో ప్రపంచ క్రికెట్‌లో 'విరాట విప్లవం' తీసుకొచ్చిన దిగ్గజ ఆటగాడు. విరాట్ కోహ్లీ ఆటతోనే గాకుండా, సత్ప్రవర్తన, అభిరుచులలో కూడా ఉన్నతంగా నిలుస్తాడు. కఠినమైన శ్రమతో, ఉక్కు సంకల్పంతో వృత్తి జీవితాన్ని చక్కగా మలుచుకొన్న విరాట్ నుంచి ఈ తరం యువత ఎంతో నేర్చుకోవచ్చు.

విరాట్ తరహాలోనే రోహిత్ శర్మ కూడా భారత జట్టుకు లభించిన అరుదైన ఆణిముత్యం. పరిమిత ఓవర్ల ఆటలో ఎన్నో అద్భుత ప్రదర్శనలతో అలరించిన రోహిత్, టెస్టుల పరంగా అంతగా ఆకట్టు కోలేకపోయిన మాట వాస్తవం. కానీ, కోహ్లీ నుంచి నాయకత్వ బాధ్యతలు స్వీకరించాక, జట్టును అత్యున్నత స్థాయిలో చూపిన అగ్రగణ్యుడిగా రోహిత్ కీర్తి గడించాడు. గతేడాది భారత జట్టు టీ20 ప్రపంచకప్ గెలిచిన వెంటనే పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ, రోహిత్‌ల ఆట ఇక వన్డేలకు పరిమితం. ఈ ఇద్దరి అనూహ్య నిష్క్రమణతో ఇప్పుడు టెస్టులకు కొత్త సారథిని నియమించడం అనివార్యమైంది. వీళ్ల వారసత్వాన్ని కొనసాగించగల సత్తా ఉన్న ఆటగాళ్లను అన్వేషించే పనిలో భారత బోర్డు ఉంది.

కాల్పుల విరమణ సరైన వ్యూహమేనా?

ఆపరేషన్ సిందూర్‌కు ముందు, తర్వాత జరిగిన అంతర్జాతీయ పరిణామాలు, ఇదే సమయంలో దేశీయంగా గత కొన్నాళ్లుగా నక్సలిజంపై కేంద్రం అనుస రిస్తున్న అణచివేత ధోరణి గమనించిన విశ్లేషకులకు మోదీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరి అర్థమవుతుంది. సాగేచోట ఆధిపత్యం చెలాయించడం, సాగనిచోట రాజీకి రావడం... ఈ పద్ధతి ఎంతవరకు సమంజసం? ఇక్కడ ఇంట మావోయిస్టుల మీద అప్రతి హతంగా గెలుస్తూ, అక్కడ ఉగ్రవాదం విషయంలో అర్థాంతర కాల్పుల విరమణకు సిద్ధపడటం భారత ప్రభుత్వ ద్విముఖ విధానాన్ని చాటుతున్నది.

పహల్గామ్ ఉగ్రహింస తర్వాత పాకిస్థాన్‌పై వరుస దాడులతో సమర్థంగా విరుచుకుపడి, వెంటనే ఆకస్మిక అమెరికా జోక్యంతో కాల్పుల విరమణకు అంగీక రించడం వల్ల, మన దేశం టెర్రరిజంపై బేషరతు ఆధిపత్యాన్ని సాధించే అవకాశాన్ని కోల్పోయిందని వస్తున్న విమర్శ అర్థరహితమైనదేమీ కాదు. 'ఆపరేషన్ సిందూర్' పాకిస్థాన్ సైనిక వ్యవస్థను పతనం అంచుకు తీసుకువచ్చింది. అలాంటి స్థితిలో, వ్యూహాత్మకంగా ప్రశ్నార్థకమైన నిర్ణయంతో, భారతదేశం కాల్పుల విరమణకు అంగీకరించింది.



కాల్పుల విరమణ కారణంగా పాకిస్థాన్ తన దుష్ట సిద్ధాంతాల్ని విరమించుకుంటుందని ఆశించడం అమాయకత్వం మాత్రమే కాదు, ప్రమాదకరం కూడా. ఇటువంటి వ్యూహాల వల్ల పాకిస్థాన్ సైన్యం ఉగ్రవాదంపై ఆధారపడటాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది. గొప్ప శక్తులు స్నేహధర్మాన్ని అనుసరించి కాదు, స్వీయ ప్రయోజనాలను అనుసరించి వ్యవహరిస్తాయని భారతదేశం ఇప్పటికైనా గుర్తించాలి.

పాకిస్థాన్ సైన్యం పాటించే అసమాన యుద్ధ సిద్ధాంతంపై నిర్ణ యాత్మకమైన నష్టాన్ని కలగజేసే అరుదైన అవకాశాన్ని ఈ కాల్పుల విరమణ ద్వారా కోల్పోయామని, ఇది వ్యూహాత్మక తప్పిదమని కొందరు విశ్లే షకులు భావిస్తున్నారు. ఇరవయ్యవ శతాబ్దం చివరి నుంచి పాకిస్థాన్ సైన్యం కాపాడుతూ వచ్చిన ఉగ్రవాద సైద్ధాంతిక స్థావరాన్ని శాశ్వతంగా నిర్వీర్యం చేయడానికి ఇదొక మంచి అవకాశం అయ్యేది. దేశం లోపల నక్సలిజంపై చూపిస్తున్న కర్కశ, నిర్దయాత్మక విధానం అంతర్జాతీయ స్థాయిలో ఏమైంది? ఎవరి ఒత్తిడికి లేదా ఏ భీతికి గురై ప్రధానమంత్రి మోదీ ఈ రకమైన వెనకడుగు వేశారు? మొన్నటి వరకూ టెర్రరిజాన్ని కూకటివేళ్లతో పెళ్లగిస్తామని శపథాలకు పోయిన పట్టుదల "ఇది యుద్ధాల యుగం కాదు" అనే నీతివాక్యాల స్థాయికి ఎలా దిగజారింది? అగ్ర రాజ్యం అమెరికా జోక్యంతో భారత దేశం తాత్కాలిక ప్రశాంతతను పొంది ఉండవచ్చు, కానీ అందుకు బదులు దీర్ఘకాలిక వ్యూహాత్మక లాభాన్ని త్యాగం చేసింది. అలా చేయడం ద్వారా జిహాదిస్ట్ భావ జాలంతో బలపడుతున్న విరోధికి కొత్త ప్రాణం పోసింది.

భారతదేశానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఉపయోగించుకోవడానికి మూలాలు 1980ల చివరలో, 1990ల ప్రారంభంలో జనరల్ జియా-ఉల్-హక్ ఆధ్వర్యంలో స్థాపితమైన సైనిక సిద్ధాంతంలో ఉన్నాయి. భారత సైన్యం అఖండమైన సాంప్రదాయిక ఆధిపత్యాన్ని చవిచూసిన పాకిస్థాన్ చేసేదేం లేక అసమాన యుద్ధ వ్యూహాన్ని ఎంచుకుంది. మతపరమైన తీవ్రవాదాన్ని ఆయుధంగా చేసుకుని, కశ్మీర్‌లో "స్వాతంత్ర్య సమరయోధుల" ముసుగులో ఉగ్రవాద గ్రూపులను పెంచింది. దీనిని "వెయ్యి కోతలతో భారతదేశాన్ని రక్తసిక్తం చేయడం" అనే వ్యూహంగా పిలుస్తారు. దీన్ని పాటిస్తూ ఆ దేశం భారతదేశ పౌర, సైనిక సంస్థలపై నిరంతర నష్టాన్ని కలగజేసింది.

ఈ చారిత్రక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకున్నప్పుడు 'ఆపరేషన్ సిందూర్' తర్వాత భారత ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించడం సమస్యాత్మక నిర్ణయమని అర్థమవుతుంది. ఆపరేషన్ సిందూర్ జంట ఆపరేషన్లు కీలకమైన సైనిక స్థావరాలను ధ్వంసం చేశాయని, నియంత్రణ రేఖ వెంబడి ఉన్న ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాయని, పాకిస్థాన్ సంప్రదాయ సామర్థ్యాలను గణనీయంగా దెబ్బతీశాయని నివేదికలు చెబుతున్నాయి. పాకిస్థాన్ సైన్యంలో నైతిక స్థైర్యం సన్నగిల్లిపోయింది. ప్రజల అసంతృప్తి వీధుల్లోకి వ్యాపించింది. ఆ దేశ అంతర్గత లోపాలు విస్తరించడం మొదలైంది (ముఖ్యంగా బలూచిస్తాన్, ఖైబర్ పఖ్తుంఖ్వాలో). వ్యూహాత్మక ఆధిపత్యం చెలాయించే ఈ తరుణంలో కాల్పుల విరమణ ఉదారతను గానీ, సంయమనాన్ని గానీ సూచించదు. ఉగ్రవాదాన్ని నిరోధించేందుకు సంవత్సరాల ప్రయత్నాలను ఈ నిర్ణయం దెబ్బతీసింది. ప్రత్యర్థి మళ్లీ ధైర్యం పుంజుకునేట్టు చేసింది.

దేశాలు పైచేయి సాధించిన తర్వాత ఆ బలంతో దీర్ఘకాలిక శాంతిని పొందిన ఉదాహరణలు చరిత్ర నిండా ఎన్నో ఉన్నాయి. కానీ ఈ సందర్భంలో భారతదేశం ఇందుకు భిన్నంగా వ్యవహరించింది. కాల్పుల విరమణ కారణంగా పాకిస్థాన్ తన దుష్ట సిద్ధాంతాల్ని విరమించుకుంటుందని ఆశించడం అమాయకత్వం మాత్రమే కాదు, ప్రమాదకరం కూడా. ఇటువంటి వ్యూహాల వల్ల పాకిస్థాన్ సైన్యం ఉగ్రవాదంపై ఆధారపడటాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది. గొప్ప శక్తులు స్నేహధర్మాన్ని అనుస రించి కాదు, స్వీయ ప్రయోజనాలను అనుసరించి వ్యవహరిస్తాయని భారతదేశం ఇప్పటికైనా గుర్తించాలి. బాహ్య ఒప్పందాలకు లోబడి జాతీయ ప్రయోజనాలను త్యజించే ఏ విదేశాంగ విధానమైనా దీర్ఘకాలికంగా వ్యతిరేక ఫలితాలను ఇస్తుంది. జాతీయ భద్రతకు ఆటంకం కలిగించే అంశాల విషయంలో న్యూఢిల్లీ తన వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని నొక్కి చెప్పడం నేర్చుకోవాలి.

• దోర్బల బాలశేఖరశర్మ

అందాల పోటీలు, అనేక సవాళ్లు!



ముప్పై ఏళ్ల ప్రపంచీకరణ తర్వాత, బ్యూటీ పార్లర్లు ప్రతి గల్లీలో పుట్టుకొచ్చి, అనేకమంది యువతుల జీవితాల్లో సౌందర్య ఉత్పత్తులు భాగమైపోయి, అందం పరిశ్రమగా మారిపోయిన తర్వాత ఈ అందాల పోటీలని నిర్వహించి ప్రభుత్వం కొత్తగా ఏం సాధించాలని అనుకుంటోంది? ఫ్యాషన్ పరిశ్రమలోకి వెళ్లే ఆడవాళ్ళని మినహాయిస్తే, ఈ అందం నమూనాలలో ఇమడ లేని అత్యధిక శాతం అమ్మాయిల మానసిక సంఘర్షణ గురించి మన వ్యవస్థలో అసలేమైనా అవగాహన ఉందా?

హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీలు, అధికారుల్లో అత్యుత్సాహాన్ని, ఆలోచనాపరుల్లో కొంత కలవరాన్ని కలిగిస్తున్నాయి. ఈ పోటీలకు పెద్ద ఖర్చు పెట్టడం లేదనీ, పైగా దీని ద్వారా తెలంగాణాలో టూరిజం పెరుగుతుందని ప్రభుత్వం అంటోంది. డబ్బు తక్కువైన రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడులని ఆహ్వానించటానికి పడే తంటాల్లో ఇదీ ఒకటని అర్థం చేసుకుందాం అనుకున్నా, అంతకుమించి గత ప్రభుత్వం చేయలేనిది తామేదో కొత్తది చేసి, తామెంత గొప్ప వాళ్ళమో నిరూపించుకోవాలన్న కోరికే ఇక్కడ ఎక్కువ కనిపిస్తోంది. మిస్ వరల్డ్ నిర్వాహకులు దీనివల్ల ఆడ వాళ్ళలో 'స్ఫూర్తి' పెరుగుతుందని ప్రకటించారు. కానీ, ఈ కార్యక్రమం ప్రధానంగా మగవాళ్ళలోనే ఎక్కువ స్ఫూర్తిని నింపుతోందని మీడియా రిపోర్టులు చూస్తే తెలుస్తుంది.

దక్షిణాది రాష్ట్రాల్లో మానవ అభివృద్ధి సూచికలో, ముఖ్యంగా చదువు, ఆరోగ్యంలో వెనకబడి, అన్ని రకాల హింసనీ ఎక్కువగా ఎదుర్కొంటున్న సాధారణ తెలంగాణ మహిళలకి, రాజకీయాలు, ఉద్యోగాలు, పరిశ్రమల్లో వాటా లేనట్లే ఈ ప్రపంచ సుందరి పోటీలని టీవీలలో చూడటం తప్ప ఏమీ దొరకదు. వాళ్ళకేమీ సౌందర్య పిపాస తక్కువ లేదు. ఉన్నంతలో మంచిగా తయారవుతారు. చీరల రంగులు, జాకెట్ల డిజైన్లు, మ్యాచింగ్ నగల విషయంలో అన్ని సమూహాల స్త్రీలకీ, తమ స్తోమతని బట్టి కావాల్సినంత ఆసక్తి ఉంది. అదే లేకుంటే ఇన్ని రకాల దుకాణాలు, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు, గల్లీ చివర మగ్గం వర్క్ షాపులు పెరిగేవి కాదు. ఈ గల్లీ ఫ్యాషన్ ప్రపంచంలో భర్తలు, మగవాళ్ల కంటే, తోటి ఆడవాళ్ళ ప్రశంసలే ప్రధానం.

తెలుగు సినిమాలు ఆడవాళ్లకి ఉండాల్సిన ప్రధాన గుణం అందం అనీ, వాళ్ళు కేవలం మగవాళ్ళ కోసమే అందంగా తయారవుతారనీ దశాబ్దాలుగా అందర్నీ నమ్మించటానికి ప్రయత్నిస్తున్నాయి. 20వ శతాబ్దం మధ్యలో చదువులు, ఉద్యోగాల కోసం పరదా నుంచి బయటకొచ్చిన ఆధిపత్య కుల స్త్రీలకి ఆధునిక సంస్కృతి తొడిగిన కొత్త పరదాల్లో ఒకటి అందం. చీర, దాన్నుండి కనీ కనిపించకుండా అతి సన్నటి నడుము, పెద్ద జడ, బొట్టు ఉండే స్త్రీ శరీర రూపాన్ని తెలుగు సౌందర్యానికి ప్రతీకగా చేసిన బాపు బొమ్మ కొన్ని తరాల ఊహల్ని నిర్దే శించింది. ఓల్గా రాజకీయ కథలు, స్త్రీవాద కవిత్వం స్త్రీల జీవితాలని ఇటువంటి ఊహలు ఎంత బలంగా నియం త్రిస్తాయో వివరంగా విశ్లేషించినప్పటికీ, వాటి ప్రభావం చదువుకుని ఆలోచించే ప్రజలకే పరిమితమైంది. తెలుగు సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు, కొద్ది మినహాయింపులతో, స్త్రీలు = అందం అనే మూసలోనే బందీగా ఉండిపోయాయి. హీరోయిన్ల శరీర కొలతల గురించి బహిరంగంగా మాట్లాడటం, 'మిల్కీ బ్యూటీ', 'అందాలు ఆరబోయటం', 'నడిచొచ్చిన అందం' అంటూ వర్ణించటం ఇప్పటికీ తెలుగు సినిమా పరిశ్రమ రోజువారీ పదజాలంతో భాగం.

ఇలా ఆడవాళ్ళని అందమైన శరీరాలుగా మాత్రమే చూసే భావన 1990లో జరిగిన ప్రపంచీకరణ తర్వాత వస్తు ప్రధాన సంస్కృతిలో బాగా ఊపందుకుంది. 1990 లలోనే సుస్మితా సేన్, ఐశ్వర్యరాయ్ ప్రపంచ సుందరీ మణులు అయ్యారు. గత ఇరవయ్యేళ్ళల్లో వస్తువుల ఉత్పత్తితో పాటు వాటిని అమ్ముకోవటానికి స్త్రీల అందం ఒక ప్రధాన వనరుగా మారింది. ఈ సంస్కృతిలో అందమనే భావన కూడా రూపాంతరం చెందింది. అప్పటి వరకూ పుట్టుకతో వచ్చిన శరీర సౌందర్యం కొంతమంది ఆడవాళ్ళకి పెళ్లి కోసం పనికొచ్చేది. అందాన్ని ఆడవా ళ్ళందరికీ తప్పకుండా ఉండాల్సిన గుణాల్లో ఒకటిగా మార్చింది మార్కెట్. అందానికి ఒక కొత్త మూసని తయారు చేసింది. శరీరంపై ఒక్క వెంట్రుక లేకుండా, గీసిన కనుబొమలు, నల్లటి జుట్టు, సన్న ముక్కు, తెల్లటి చర్మం, ఎర్రని పెదవులు కలిగి ఉండటం దీనిలో భాగం. అత్యధిక శాతం భారతీయ స్త్రీలు దీనిలో ఇమడరు. చక్కగా కనిపించాలనే వారి సహజమైన కోరికని మార్కెట్ సంస్కృతి వాళ్ళ బలహీనతగా రూపుదిద్దింది. మా ఉత్పత్తులు వాడితే మీరు అందంగా తయారవుతారు అంటూ ఊదరగొట్టింది. అంతే కాదు, అందంగా ఉంటేనే సంతోషం, ఉద్యోగం, కెరీర్ అన్నీ సాధ్యమవుతాయనే సరికొత్త సక్సెస్ నమూనాని సమాజంలో ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో అందాల పోటీలు ప్రపంచ స్థాయి నుండి సాధారణ కాలేజీ ఫెస్టివల్‌లో భాగంగా మారితే; చర్మ సౌందర్య ఉత్పత్తులు, మేకప్ సామాగ్రి అనేకమంది విద్యార్థులు, ఉద్యోగినుల నెలవారీ సామాన్లలో భాగ మయ్యాయి. తెల్ల జుట్టు ఉండే ఆడవాళ్లు సినిమాలు, సీరియళ్లలోనే కాదు, నిజ జీవితంలో కూడా కనిపించటం మానేశారు. మార్కెట్ సంస్కృతిని తీవ్రంగా విమర్శించే వాళ్ళు కూడా దీని నుంచి బయట పడలేనంత లోతుగా ఈ సౌందర్య భావజాల ప్రభావం వ్యాపించింది. ఈ నిర్దేశిత సౌందర్య నమూనా నుండి పక్కకి జరిగితే చాలు, దాన్నొక జీవిత వైఫల్యంగా చూడటం మొదలైంది.

అయితే, సౌందర్య భావజాలం కేవలం శరీరం బయట ఆగిపోదు, లోపలికి ఇంకుతుంది. అది ఆడవాళ్ల ఆంతరంగిక చూపులో భాగంగా మారి, వాళ్ళు తమని తాము అంచనా వేసుకునే తీరునీ, ఆత్మవిశ్వాసాన్నీ ప్రభావితం చేస్తుంది. ఈ ప్రభావం టీనేజీ అమ్మాయిలు, యువతులలో తీవ్రంగా కనిపిస్తుంది. ఈ సౌందర్య మూసల్లో ఇమడటానికి అమ్మాయిలు తిండి మానెయ్యటంతో వారిలో అనేక శారీరక రుగ్మతలు పెరుగుతున్నాయి. ఇంటర్నెట్ పుణ్యమాని నగరాలకి పరి మితమైన ఈ రుగ్మతలు అన్ని చోట్లకీ పాకాయి. ముప్పై ఏళ్ల ప్రపంచీకరణ తర్వాత, బ్యూటీ పార్లర్లు ప్రతి గల్లీలో పుట్టుకొచ్చి, అనేకమంది యువతుల జీవితాల్లో సౌందర్య ఉత్పత్తులు భాగమైపోయి, అందం పరిశ్రమగా మారి పోయిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఈ పోటీలని నిర్వహించి కొత్తగా ఏం సాధించాలని అనుకుంటోంది? దీనితో పాటు ఒక సమాజంగా మనం ఇప్పుడు వేరే ప్రశ్నలు కూడా అడగాలి. ఫ్యాషన్ పరిశ్రమలోకి వెళ్లే ఆడవాళ్ళని మినహాయిస్తే, ఈ అందం నమూనాలలో ఇమడలేని అత్యధిక శాతం అమ్మాయిల మానసిక సంఘర్షణ గురించి మన వ్యవస్థలో అసలేమైనా అవగాహన ఉందా? ప్రభుత్వం గానీ, ఇతర విద్యా సంస్థలు గానీ దీని గురించి అధ్యయనాలు చేశాయా? చదువు, ఉద్యోగాలతో వచ్చే ఆత్మవిశ్వాసాన్ని ఈ సౌందర్య నమూనాలు ఏ విధంగా దెబ్బతీస్తున్నాయి?

ఈ విమర్శ మార్కెట్ నుంచి బయటపడి, అందంగా కనిపించాలనే ఆశని, చక్కగా తయారవ్వాలనే కోరికని వదిలేసుకొమ్మని, ఇతరులిచ్చే కాంప్లిమెంట్లని ఆస్వాదించ రాదని చెప్పదు. అలంకరణలో స్త్రీల వ్యక్తిగత ఇష్టాలు, నిర్ణయాధికారం ఉంటాయి. కానీ వారి నియంత్రణలో లేని మార్కెట్ పెద్దది, అక్కడ స్వయం నిర్ణయాధికారం తక్కువ. మార్కెట్ ఆడవాళ్ళకిచ్చే 'ఛాయిస్' ఎటువంటిది? బట్టలు, చెప్పులు, హెయిర్ క్లిప్పులు చవకగా అందించటం సరే, మన వేడి వాతావరణానికి సరిపడే సౌకర్యవంత మైన బట్టలు దొరుకుతున్నాయా? ఆడవాళ్ళ చెప్పులు గట్టిగా నడిస్తే తెగిపోయేటట్లు ఎందుకు తయారు చేస్తున్నారు? సల్వార్‌లకి జేబులు ఎందుకుండవు? అత్యధిక శాతం వాడే చర్మ సౌందర్య ఉత్పత్తులకి ప్రభుత్వ నియంత్రణ ఉందా? వివిధ వయసుల ఆడవాళ్ల ఆరోగ్యంపై వీటి ప్రభావం ఏంటి? ఇవి కేవలం ఆడవాళ్లే కాదు, ఈ మధ్య ఫ్యాషన్ ప్రపంచంలోకి వచ్చిన మగవాళ్ళ గురించి కూడా వెయ్యాలి. వాళ్ళు వేసుకుంటున్న బిగుతు జీన్స్ వాడుతున్న హెయిర్ జెల్స్ శరీరంపై ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తాయి?

ఈ వ్యవస్థీకృత సౌందర్య నమూనా మనుషులకి తమతో, ఇతరులతో ఏర్పడే సంబంధాలని ప్రభావితం చేసి, జీవితంలో వచ్చే ఒత్తిళ్లకి తోడయినప్పుడు దాని గురించి లోతుగా ఆలోచించాలి. మా ఆవిడ ఎప్పుడూ దుప్పటి లాంటి నైటీ వేసుకు తిరుగుతుంది అంటూ ఇంట్లో పని చేసేటప్పుడు కూడా అందంగా ఉండాలని ఆశించే భర్తలు, నేను అందంగా లేను కాబట్టే నాకు స్నేహితులు లేరు అని ఆత్మవిశ్వాసం దెబ్బతిన్న టీనేజీ పిల్లల కుంగుబాటు, ఉద్యోగినులు 'స్మార్ట్'గా తయారైతేనే ప్రమోషన్లు ఇచ్చే బాసులు, అమ్మాయిలు వ్యాక్సింగ్ చేసుకోకుంటే డేటింగ్ కష్టం అని నమ్మే యువతీ యువకులు – ఈ పరిణామాలన్నీ అందం ఒక సామాజిక సమస్యగా తయారయిందని తెలియచేస్తున్నాయి. వ్యక్తిగతంగా సంతోషం కలిగించే స్థాయి నుంచి మనల్ని నియంత్రించే పనిముట్టుగా తయారయిన సౌందర్య పిపాసని మళ్ళా మన నియంత్రణలోకి ఎలా తెచ్చుకోవా లన్నది ఇప్పుడు మన ముందున్న సవాలు!

◆ ఎ. సునీత

సంక్షేమ పథకాలతోనే సంక్షోభం!

“రాష్ట్రం ఆర్థికంగా బాగాలేదు.. అప్పు పుడుతలేదు.. ఎవడూ అణాపైసా ఇస్తలేడు. తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులను బ్యాంకర్లు దొంగలను చూసినట్టు చూస్తున్నరు. ఢిల్లీకి పోతే వీడు వస్తే చెప్పులు కూడా ఎత్తుకపోయేటట్టున్నడని ఎవడూ కూడా అపాయింట్‌మెంట్ ఇస్తలేరు. అప్పు పుడితే నేను కూడా ఏదో ఒకటి చేసి తెచ్చి ఇచ్చేటోన్ని. 18,500 కోట్ల రూపాయల కంటే ఎక్కువ ఆదాయం లేదు. ఉద్యోగ సంఘాల నాయకులను అడుగుతున్న ఏంజేస్తరు నన్ను? కోసుకొని తింటరా? ఏం జేస్తరు?” అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

"నేను ప్రభుత్వంలో ఉండి చెప్పకూడదు కానీ.. ఉచితాలు తగ్గించాలి. నిరు పేదలైన అర్హులకే ఉచితాలు అందాలి. రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డులు అందరి దగ్గర ఉండటం వల్ల ఉచితాలు అనర్హులకు అందుతున్నాయి. తినడానికి తిండి లేని వారికి బియ్యం ఇవ్వాలి.. అమ్ముకునే వారికి ఇవ్వొద్దు. కిలో బియ్యం రూ.3 ఉన్నప్పుడు 2 రూపాయలకే అందించిన ఎన్టీ రామారావును దేవుడన్నారు. కానీ ఇప్పుడు కిలో బియ్యం రూ.60గా ఉన్నా ఉచితంగా ఇస్తారా? తెలంగాణలో కోటి పది లక్షల కుటుంబాలు ఉంటే.. కోటి పాతిక లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. అంటే పక్క రాష్ట్రాల వారికి కూడా ఇక్కడ కార్డులు ఉన్నాయనేది స్పష్టమవుతోంది." అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి వ్యాఖ్యలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిన పెట్టడం, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందున్న పెద్ద సవాల్. సంక్షేమ పథకాలే సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయన్న విషయం ప్రభుత్వం గుర్తెరగాలి. ఆర్థికంగా రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి అనేక మార్గాలున్నాయి. వాటిలో కొన్నిటినైనా అమలు చేస్తే కొంత వెసులుబాటు కలుగుతుంది. అవసరమైన పథకాలను మాత్రమే కొనసాగిస్తూ, ప్రభుత్వానికి అధికంగా ఆదాయం ఇచ్చే వనరులను సమకూర్చుకోవడం ఎంతైనా అవసరం.

ఉచిత పథకాలు ప్రజలకు అలవాటు చేసి వాటిని ఎలాగోలా బీఆర్ఎస్ అమలు చేసింది. కాని, వీటితో రాష్ట్రం అధోగతి పాలవుతుందని మేధావులు ముందే హెచ్చరించినా వారు పట్టించుకోలేదు. వాస్తవంగా సంక్షేమ పథకాలు అర్హుల కంటే అనర్హులకే అధికంగా అందుతున్నాయి. ఇప్పటికిప్పుడు ఇంటింటికి వెళ్ళి సర్వే చేస్తే సంక్షేమ పథకాలైన రేషన్‌కార్డులు, వృద్ధాప్య పెన్షన్లు పొందుతున్న వారిలో 90శాతం మందికి పైగా అనర్హులే ఉంటారు. రాజకీయ ఒత్తిళ్ళు, అధికారుల లంచగొండితనంతో అనేక పథకాలు అనర్హులకు అందుతున్నాయి.

ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులకు మాత్రమే సంక్షేమ పథకాలు అమలు చేయాలి. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పోషించని కొడుకులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా కఠినమైన చట్టాలు తీసుకురావాలి. వృద్ధాప్య పెన్షన్లు పూర్తిగా దిక్కుమొక్కూ లేని అనాథలకు మాత్రమే అమలు చేయాలి. రేషన్‌కార్డులకు కూడా పరిమితి విధించాలి. ఎప్పుడో 15 సంవత్సరాల క్రితం రేషన్‌కార్డు ఇచ్చి నప్పుడు వారి పరిస్థితి ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉంది. ఇలాంటివి ఇంటింటికీ వెళ్ళి సర్వే చేసి ఆ రేషన్ కార్డులు తొలగించాలి. చాలా వరకు సంక్షేమ పథకాలను అర్హులకు మాత్రమే అందజేస్తే ఆర్థిక భారం తగ్గుతుంది.

– మహ్మద్ మక్సూద్ షరీఫ్

చదువు‘కొంటున్న’ విద్యార్థులు !

‘ప్రభుత్వ బడి పటిష్ఠత అంటే పిల్లలకు విద్య నందించడమే కాదు వారిని పేదరికం నుంచి దూరం చేయడం’ అని అమర్త్యసేన్ ఉవాచ. ప్రభుత్వ విద్యపై ప్రభుత్వాలు పెద్దగా శ్రద్ధ వహించడం లేదనేది వాస్తవం. ఇటీవల ముఖ్యమంత్రి హాజరైన ఓ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవ సభలో ఓ పోలీసు ఉన్నతాధికారి మాట్లాడుతూ, ‘ఈ స్కూల్ ఏదో తెలుగు మీడియం ప్రభుత్వ పాఠశాలల లాగా కాదు...’ అని ప్రభుత్వ పాఠశాలలను తృణీకరించేలా మాట్లాడారు. పైగా ఆ పాఠశాలలో ప్రారంభ ఫీజు రూ. లక్షా అరవై వేలుగా తెలిపారు. ఇదంతా సీఎం సమక్షంలోనే జరుగుతున్నా ఆయన వారించలేదు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రిగా కూడా వ్యవహరిస్తున్న సీఎంకు ఫీజులను నియంత్రించే ఆలోచన లేదా?

ఈ కారణంగానే రాష్ట్రంలో ప్రభుత్వ విద్య పట్ల విశ్వాసం కోల్పోయి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు విద్య వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ మధ్య ‘లోకల్ సర్కిల్స్’ అనే సంస్థ దేశవ్యాప్తంగా ఓ సర్వే నిర్వహించింది. 2022–25 మధ్య ప్రైవేట్ స్కూళ్లు ఫీజులను దాదాపుగా రెట్టింపు చేశాయని ఈ సర్వేలో విద్యార్థుల తల్లిదండ్రులు వెల్లడించారు. ఫీజుల నియంత్రణ విషయంలో ప్రభుత్వాలు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని 93 శాతం మంది అభిప్రాయపడ్డారు.

తెలంగాణలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. సమాజంలోని అసమానతలకు తగినట్లుగానే రాష్ట్రంలో వేల సంఖ్యలో ప్రైవేటు పాఠశాలలు పుట్టుకొచ్చాయి. రాష్ట్రంలోని దాదాపు 36 లక్షల మంది విద్యార్థులు ఈ పాఠశాల్లో చదువు‘కొంటున్నారు’. తల్లిదండ్రులకు ఫీజుల భారం వర్ణనాతీతం. జూన్‌లో స్కూళ్లు తెరుస్తు న్నారంటే వారిలో గుబులు. గత సంవత్సరం కట్టని ఫీజులు, కొత్త విద్యా సంవత్సరంలో కట్టాల్సిన ఫీజుల గురించి తలచుకుని వారు ఎంతో మానసిక వేదనకు గురవుతుంటారు. తల్లిదండ్రులు తమ ఫీజుల కోసం పడుతున్న కష్టాలను తెలుసుకుని బడి మానేస్తామని తెలిపే పిల్లలు కూడా ఉన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను అనుసరించకుండా ఏటా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, నోట్‌బుక్స్, టై, బ్యాడ్జిలు, స్పోర్ట్స్ డ్రస్ అన్నీ తమ వద్దే కొనాలని నిర్బంధం చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వం పటిష్ఠమైన నియంత్రణా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయకపోవడం విచారకరం. ఆర్థిక వనరులు లేని కారణంగా తమ పిల్లలను మరో స్కూల్లో వేస్తామంటే ఆయా స్కూళ్ల యాజమాన్యాలు ఒప్పుకోవు. ఫీజులు మొత్తం కట్టలేదని టీసీలు ఇవ్వక పోవడం, పరీక్షల సమయంలో హాల్ టికెట్లు ఇవ్వక పోవడం, ఫీజులు కట్టని పిల్లలను ఇంటికి పంపించడం, ఎండలో నిలబెట్టడం, తోటి పిల్లల ముందు అవమాన పరచడం వంటివి రోజూ వింటున్న విషయాలే.

ప్రభుత్వ విద్యను పటిష్ఠం చేయడమే ఈ సమస్యలన్నీటికి పరిష్కారం. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొంత కాలానికి ప్రభుత్వ బడులు చరిత్ర పుటల్లోనే మిగిలిపోయే ప్రమాదం ఉంది. విద్యా హక్కు చట్టం స్ఫూర్తితో ప్రభుత్వ విద్య పటిష్ఠం చేసేందుకు, ఫీజుల నియంత్రణ చట్టం అమలుకు ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ప్రైవేటు స్కూళ్ల ఆగడాలను తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారి పిల్లలను వేధింపులకు గురి చేయడమూ మామూలే. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తోచని పరిస్థితి. ఒక అంచనా ప్రకారం రాష్ట్రంలో ఏటా దాదాపు రూ.18 వేల నుంచి 20వేల కోట్ల వరకూ విద్యా వ్యాపారం నడుస్తోంది.

ప్రైవేట్ పాఠశాలల ఏర్పాటు, ఉపాధ్యాయుల నియామకం, ఇతర విషయాలను గురించి విద్యా హక్కు చట్టం చాలా స్పష్టంగా పేర్కొన్నది. షెడ్యూల్లో పేర్కొన్న నిబంధనలు అమలు చేయకపోతే ఆ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని, క్యాపిటేషన్ రుసుం, డొనేషన్లు వసూలు చేస్తే అంతకు పదిరెట్ల వరకు ఆయా స్కూళ్లకు జరిమానా విధించాలని, పిల్లలకు ప్రవేశ పరీక్ష పెడితే రూ.25 వేల నుంచి 50 వేల వరకు జరిమానాలు విధించవచ్చని చెబుతోంది. అలాగే ప్రతి పాఠశాలలో ప్రారంభ తరగతి నుంచి 25 శాతం సీట్లు వెనుకబడిన వర్గాల పిల్లలకు ఇవ్వాలని ఈ చట్టం తెలుపుతోంది.

తెలంగాణ విద్యా కమిషన్ నివేదికలో ప్రైవేటు విద్యాసంస్థల ఫీజు నియంత్రణ చట్టాన్ని రూపొందిం చాలనే సిఫార్సు కూడా ఉంది. గత బడ్జెట్ సమావేశా లలో ఈ చట్టం ప్రవేశపెడుతున్నట్లు కూడా ప్రచారం జరిగింది. ఏమైందో ఏమో కానీ ఈ బిల్లు చర్చకు రాలేదు. ప్రైవేటు విద్యా సంస్థలు పెట్టి రాజకీయాలలోకి వచ్చిన ప్రజాప్రతినిధులు, ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ప్రైవేటు విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకుంటున్న ఘనులు ఉన్న రాష్ట్రం మనది. అందుకే ఈ ఫీజులను



నియంత్రించే సాహసం చేయరనే అభిప్రాయం కూడా ఉంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వాలను శాసించే స్థాయికి వెళ్లాయి!

ప్రభుత్వ విద్యను పటిష్ఠం చేయడమే ఈ సమస్య లన్నీటికి పరిష్కారం. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొంత కాలానికి ప్రభుత్వ బడులు చరిత్ర పుటల్లోనే మిగిలిపోయే ప్రమాదం ఉంది. విద్యా హక్కు చట్టం స్ఫూర్తితో ప్రభుత్వ విద్య పటిష్ఠం చేసేందుకు, ఫీజుల నియంత్రణ చట్టం అమలుకు ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

■ ఆర్. వెంకట్‌రెడ్డి
జాతీయ కన్వీనర్, ఎం.వి. ఫౌండేషన్

కాంట్రాక్టు అధ్యాపకుల డిమాండ్ సక్రమమే!

ఆంధ్రజ్యోతి దినపత్రికలో మే 10న ప్రచురితమైన 'కాంట్రాక్టు అధ్యాపకుల డిమాండ్ అక్రమం' అనే (అల్లూరి విజయ్) వ్యాసానికి ప్రతిస్పందన ఇది. తెలంగాణలోని పన్నెండు యూనివర్సిటీల్లో దాదాపు పన్నెండు వందల మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారు. వారి డిమాండ్ అశాస్త్రీయమని, అప్రజాస్వామికమని, రాజ్యాంగ విరుద్ధమని విజయ్ అర్థం లేని ఆరోపణలు చేశారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కావాలనే న్యాయమైన డిమాండ్ అప్రజా స్వామికం ఎలా అవుతుంది? ఉద్యమాలు, ఆందోళనలు, నిరసనల ద్వారానే ప్రజాసమూహాలు తమ హక్కులను సాధించుకోగలవనే మౌలిక సూత్రం మార్క్సిస్టు భావజాలం ఆధారంగా ఏర్పడిన PDSU (విజృంభణ) నాయకునికి తెలియకపోవడం విడ్డూరం. నిపుణుల కమిటీ మార్గదర్శకాల ద్వారా మాత్రమే వర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకుల నియామక ప్రక్రియ జరుగుతుంది. ప్రస్తుత కాంట్రాక్టు అధ్యాపకులందరికీ పీహెచ్‌డీ, నెట్, సెట్ వంటి విద్యార్హత లున్నాయి. అంతేకానీ రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా వారు దొడ్డిదారిన వచ్చినవారు కాదు. ‘దీర్ఘకాలంగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయవచ్చు’నని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో తీర్పునిచ్చింది. దేశంలోని పలు రాష్ట్రాల యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించిన సందర్భాలు గతంలో కోకొల్లలు. కోఠి మహిళా విశ్వవిద్యాలయం, మంథనిలో విద్యార్థులను ఒప్పంద అధ్యాపకులు తమ ఆందోళనలో భాగస్వామ్యం చేసి వాడుకున్నారనేది కేవలం అపవాదు. తమ హక్కుల సాధన కోసం విద్యార్థులను వాడుకునే స్థితికి ఒప్పంద అధ్యాపకులు దిగజారలేదనే విషయాన్ని కొందరు తెలుసు కోవాలి. రెగ్యులరైజేషన్ డిమాండ్ న్యాయబద్ధమైన హక్కు కాబట్టే హరగోపాల్, కోదండరాం, రమా మేల్కొటే, పి.ఎల్. విశ్వేశ్వర్‌రావు, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి లాంటి ఎందరో మా ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. ఇప్పుడు పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఇరవై ఏళ్ల క్రితం ఏర్పడిన ఖాళీల్లో పనిచేస్తున్నారు. కాబట్టి వారిని ఆ ఖాళీల్లోనే కొనసాగిస్తూ, పది సంవత్సరాల క్రితం ఏర్పడిన ఖాళీల్లో కొత్తగా నియామకాలు చేపట్టడం సమంజసం. అప్పుడు అందరికీ న్యాయం చేకూరుతుంది.

– డా. వంగర భూమయ్య
పాలమూరు విశ్వవిద్యాలయం



త్రివేణి సంగమం.. పుష్కర శోభితం..

నేటి నుంచి కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలు


- ఉదయం 5.44 గంటలకు ముహూర్తం
- ప్రారంభించనున్న మాధవానంద సరస్వతి
- భక్తులకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాల కల్పన
- ప్రధానఘాట్ వద్ద సరస్వతీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం
- నదీ హారతి, ముక్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలకు హాజరు
- పటిష్ఠ ఏర్పాట్లు చేసిన అధికారులు

6


రామప్ప ఆలయంలోని శిల్పకళను తిలకిస్తున్న సుందరీమణులు


భారత సంప్రదాయ చీరకట్టులో.. వేయిస్తంభాల ఆలయ ఆవరణలో ముద్దుగుమ్మలు

హనుమకొండ కాకతీయ హరిత హోటల్ వద్ద బతుకమ్మలతో సందడి


రామప్పలో లేజర్ షో.. ఆలయ శిఖరంపై శివతాండవం..

శిల్పవనంలో.. అందాల సోయగం

7

చారిత్రక ఓరుగల్లులో అందగత్తెల సందడి

- వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్ప క్షేత్రాల సందర్శన
- రెండు బృందాలుగా పర్యటించిన మిస్‌వరల్డ్ కంటెస్టెంట్లు
- భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో అందాలభామల హెరిటేజ్ వాక్
- రుద్రేశ్వరుడు, రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు
- అద్భుత శిల్పకళను చూసి ఆశ్చర్యచకితులైన మిస్సమ్మలు
- కాకతీయుల చరిత్ర ఆసక్తిగా ఆలకింపు
- ఆకట్టుకున్న పేరిణీ నృత్యం.. రాణిరుద్రమ నాటక రూపం, లేజర్ షో

సంప్రదాయ చీరకట్టు.. చేతులకు గాజులు.. నుదుటిన తిలకం.. తలలో పూలు.. ఇలా తెలుగుదనం ఉట్టి పడేలా.. అందాల భామలు అద్భుతాల శిల్పవనంలో సందడి చేశారు. చారిత్రక ఉమ్మడి ఓరుగల్లులోని వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్ప ఆలయాలను సందర్శించారు. వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన శిల్పకళావైభవాన్ని చూసి ఆశ్చర్యచకితులయ్యారు. హైదరాబాద్ వేదికగా మిస్‌వరల్డ్ పోటీలు జరుగుతున్న నేపథ్యంలో వివిధ దేశాల అందాలభామలకు రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాల విశిష్టతను తెలిపేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా బుధవారం 57మంది సుందరీమణులు.. రెండు బృందాలుగా వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట, రామప్ప ఆలయాలను సందర్శించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఫొటోలు దిగారు. ఆలయాలతో పాటు కోట నిర్మాణ విశిష్టతలు, చరిత్ర తెలుసుకుంటూ ముందుకు సాగారు.

– హనుమకొండ / హనుమకొండ సిటీ/ ములుగు (ఆంధ్రజ్యోతి)


వరంగల్ కోటలోని కీర్తి తోరణం వద్ద అందాల భామల హెరిటేజ్ వాక్

జగ్గారెడ్డి వ్యాఖ్యలు అహంకారపూరితం

- ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలి..
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కొలను సంతోష్‌రెడ్డి

రాంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హంటర్‌రోడ్డులోని బీజేపీ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత నాయకులపై చేసిన దూషణల వలనే అసెంబ్లీ ఎన్నికల్లో జగ్గారెడ్డి ఓటమి చెందాడన్న విషయం మరువొద్దన్నారు. ఎమ్మెల్యే కాకముందే సీఎం అని ప్రచారం చేసుకున్న జగ్గారెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ పదవి కోసం సీఎం మెప్పు పొందేందుకే ఈటలపై జగ్గారెడ్డి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడన్నారు. ఆయనకు సరైన సమయంలో బీజేపీ శ్రేణులు బుద్ధిచెబుతారని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు కాశీప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేయాలంటే ఎత్తు, లావు అవసరం లేదని, మంచి బుద్ధి ఉంటే చాలన్నారు. ఇంకోసారి ఆకారాన్ని చులకన చేసి మాట్లాడితే బీజేపీ శ్రేణుల ఆవేశానికి గురికాక తప్పదని హెచ్చరించారు. వెంటనే ఈటలపై చేసిన వ్యాఖ్యలను జగ్గారెడ్డి వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మున్సిపల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేగా చేసిన సమయంలో అవినీతికి పాల్పడ్డ జగ్గారెడ్డి.. క్లీన్‌చీట్ ఉన్న ఈటలపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌ఛైర్మన్ శ్రీరాములు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు న్యాయం చేయాలి

- రోడ్ల వెంబడి దుకాణాలు పునర్నిర్మించాలి
- మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

మట్టెవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని, వారికి దుకాణాలు పునర్నిర్మించేంత వరకు పోరాడుతామని మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు. నగరంలోని చిరు వ్యాపారుల సముదాయాలను మునిసిపల్ సిబ్బంది కూల్చినందుకు నిరసనగా బుధవారం మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎంజీఎం సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. అందెగత్తెల రాక కోసం చిరు వ్యాపారుల జీవితాలను ఆగం చేయొద్దని, చట్టం ప్రకారం వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్‌జోన్లు ఏర్పాటు చేశామని, సముదాయాలను ఏర్పాటు చేసి వసతులు కల్పించడంతోపాటు రుణాలు అందించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి అన్యాయం చేస్తోందని, మునిసిపల్ అధికారులు, పోలీసుల దౌర్జన్యంగా దుకాణాలను తొలగించడం అన్యాయమని, వారి పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఓరుగల్లు చరిత్రను విశ్వవ్యాప్తం చేయడానికి తాము వ్యతిరేకం కాదని, అదే సమయంలో చిరు వ్యాపారులను ఆగం చేయొద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, కార్పొరేటర్లు మరుపల్ల రవి, సిద్దం రాజు, చెన్నం మధు, సంకు నర్సింగ్, సోదా కిరణ్, ఇమ్మడి లోహిత రాజు, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేశ్, మేకల బాబురావు, తండమల్ల వేణు, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ మసూద్, చిలువేరు పవన్, టి.రమేశ్‌బాబు, నయీమొద్దీన్, పుల్ల రమేశ్, కొడకండ్ల సదాంత్, రమేశ్, జానకిరాములు, రాంమూర్తి, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.


కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు

WANTED TEACHERS
We are recruting Experienced/Fresher Teachers to teach for the Classes Nursery to 10 (EM) for All Subjects and Non-Teaching Staff
Qualification
Good Spoken English and Passion for Teaching
Interviews @ 15-05-2025 from 9:00 to 5:00pm
ABHYASA THE SCHOOL
Ganesh Nagar, Shambunipet, Warangal
Cell: 9989398399, 8885398399

SINCE 1990
ROSARY HIGH SCHOOL
(Affiliation No. 3630326) Affiliated to Central Board of Secondary Education, New Delhi
Address: Near Yadav Nagar, Bharath Petrol Pump, Reddy Colony, Hanamkonda.
Ph: 9885813336, 8331031234
CBSE SSC- 2025 ఫలితాలలో ROSARY విజయకేతనం... 100% RESULTS
Hearty Congratulations to our Students, Parents & Teachers
B. VISHNU VED GOUD 467/500 HT.No. 28141385
U. SRAVANI 465/500 HT.No. 28141388
Y. VARSHITH 442/500 HT.No. 28141377
A. PRANAVI PRIYA 424/500 HT.No. 28141376
M. DIVYA 417/500 HT.No. 28141378
B. NAGACHARAN TEJ 413/500 HT.No. 28141380
T. RESHEEKA 413/500 HT.No. 28141379
A. VEDHA SRI 406/500 HT.No. 28141374
P. HASINI 402/500 HT.No. 28141387
A. SUMANA 401/500 HT.No. 28141375
R. KETHAN 401/500 HT.No. 28141383
ADMISSION OPEN

DELHI PUBLIC SCHOOL WARANGAL
(Under the Aegis of the Delhi Public School Society, New Delhi-Affiliation No - 130376)
CBSE GRADE X & XII
P.MOAKSHA
Congratulations
DISTRICT TOPPER CLASS XII-97%
8th CONSECUTIVE YEAR 100% RESULTS
V. AKASH 96%
K. AMRUTHA 96%
T. SATHVIK 95%
G. VARSHITHA 95%
The management extends heartfelt appreciation to our wonderful parent community and dedicated staff.
TOP RANKED DAY & RESIDENTIAL CBSE SCHOOL
ADMISSIONS OPEN
96763 00411 /22/33 contact@dpswarangal.in www.dpswarangal.in



ఇంటర్ ఫలితాలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని మోక్షను అభినందిస్తున్న, చైర్మన్ రవికిరణ్ రెడ్డి

సీబీఎస్ఈ ఫలితాల్లో డీపీఎస్ విద్యార్థుల ప్రభంజనం

ధర్మసాగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ఇంటర్, పదో తరగతి పరీక్ష ఫలితాలలో ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించిన్నట్టు పాఠశాల చైర్మన్ వి. రవికిరణ్ రెడ్డి బుధవారం తెలిపారు. 8ఏళ్లుగా విజయపరంపర కొనసాగుతున్నట్టు ఆయన తెలిపారు. ఇంటర్ ఫలితాలలో పోలు మోక్ష 97 శాతం ఉత్తీర్ణతను సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. అలాగే మిగతా విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడమే డీపీఎస్ పాఠశాల ప్రత్యేకత అని కొనియాడారు. అనంతరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను చైర్మన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రాజిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఇన్నారెడ్డి, ఉపాధ్యాయులు

సీబీఎస్ఈలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మోషన్‌లో ఉచిత విద్య


రాంనగర్, మే 14(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నయీంనగర్‌లోని కోటా రాజస్థాన్ మోషన్ కళాశాలలో ఉచిత విద్య అందించనున్నట్లు కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఫీజుల్లో రాయితీలు ఇస్తామన్నారు. 570 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు 100% రాయితీ, 550పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు 50% రాయితీ, 500పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు 25% రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐఐటీ, మెడికల్ సీట్లను సాధించడమే లక్ష్యంగా నిష్ణాతులైన అధ్యాపక బృందంతో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మిగతా వివరాలకు 9963417910 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

పీజీ అడ్మిషన్ల కోసం పోర్టల్స్ ప్రారంభం

హనుమకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) పీజీ అడ్మిషన్లు, కౌన్సెలింగ్ కోసం సీసీఎంటీ-2025, సీసీఎంఎన్-2025 పోర్టల్స్ ప్రారంభించినట్లు నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. సీసీఎంటీ-2025లో మొత్తం 76 ప్రముఖ విద్యాసంస్థలు, సీసీఎంఎన్-2025లో 32 సంస్థలు పాల్గొంటున్నట్లు తెలిపారు. వీటిలో 31 జాతీయ సాంకేతిక విద్యాసంస్థ లు, జాతీయ ఎలక్ట్రానిక్, సమాచార సాంకేతిక విద్యాసంస్థ, కొన్ని ఐఐఐటీలు, కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చిన సాంకేతిక విద్యాసంస్థలు, ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లు ఉన్నాయన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు రెండు కౌన్సెలింగ్‌ల కోసం అధికారిక పోర్టల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి సాంకేతిక సంస్థలలో పీజీ కోర్సులలో ప్రవేశం పొందాలనుకునే అర్హత గల అభ్యర్థులు జూన్ 4వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. సందేహాల నివృత్తి కోసం నిట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు షురూ..

కేయూ క్యాంపస్ మే 14, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బుధవారం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో సెమిస్టర్ పరీక్షలు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో 118 పరీక్షల కేంద్రాల్లో పరీక్షలు జరి గాయి. కాగా, బుధవారం హనుమకొండ ప్రాంతంలోని పలు కళాశాల పరీక్ష ల కేంద్రాలను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ ఎం.తిరుమలదేవిలు పరిశీలించారు. విగతా పరీక్షలన్నీ షెడ్యూల్ మేరకు జరుగుతాయని వెల్లడించారు.



WANTED
★ పెట్రోల్ పంపు మరియు రైల్వేలో సివిల్ కన్‌స్ట్రక్షన్ నందు పనిచేయుటకు ఇంజనీర్స్, సూపర్ వైజర్స్, డ్రైవర్స్ కావలెను. వర్క్ Place TG+AP సం॥ప్ర॥ 9989606333, 9491474143
AJW-14792

WANTED
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు టెలికాలర్స్ రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటింగ్ అర్జెంట్‌గా కావలెను. జీతం : 8000/- నుండి 10,000/- సం॥ప్ర॥ 6300959432
AJW-237362

సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్ వైజర్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను జీతం : 12000 - 14000 సం॥ప్ర॥ 8309693457
AJW-237361

స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ కేర్ సర్వీస్
★ స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ / హోమ్‌కేర్ సర్వీస్ 24గం॥ 12గం॥ వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పు॥లను పంపించగలము. సం॥ప్ర॥ 8977263124 , 9100116067
AJW-6619

PLOT FOR SALE
★ వరంగల్ వర్ధన్నపేట రోడ్‌కి 8KM దూరంలో లక్ష్మీపురం గ్రామంలో కాదిరిఖాన్ ఫామ్‌లో 120 గజాల 6,00,000/- కే ఇస్తూ ప్రతి నెల ఆదాయం కొన్న వారికీ 6000 చొప్పున 100 నెలలు ఇవ్వబడును. 2,00,000/- డౌన్‌పేమెంట్ తో సులభవాయిదాల పద్ధతిలో ఫ్లాట్ సొంతం చేసుకొనే అవకాశం. సం॥ప్ర॥ 9160127942
AJW-7655

కమర్షియల్ ఫ్లాట్లు అమ్మబడును
★ Wgl మండిబజార్, జెండాల చెట్టు దగ్గర, H.No : 14-4-177, 178 గల 300 చ॥గ॥ కమర్షియల్ ఫ్లాటు అమ్మబడును. సంప్రదించండి సెల్.నెం. 9849140315
AJW-511

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
9985411676
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.



త్రివేణీ సంగమానికి ముస్తాబైన కాళేశ్వర ఆలయం

త్రివేణీ సంగమం.. పుష్కర శోభితం..

- నేటి నుంచి కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలు
- ప్రారంభించనున్న మాధవానంద సరస్వతి
- ప్రధానఘాట్ వద్ద సరస్వతీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- పటిష్ఠ ఏర్పాట్లు చేసిన అధికారులు



సీఎం ఆవిష్కరించనున్న సరస్వతీ విగ్రహం



మాధవానంద సరస్వతి

మహదేవపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళేశ్వర-ముక్తీశ్వరాలయం సన్నిధిలోని త్రివేణి సంగమంలో నేటి నుంచి 'అంతర్వాహిని' సరస్వతీ పుష్కర సంరంభం ఆరంభం కానుంది. గురువారం అరుణోదయ వేళ అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తొలిసారి అధికారికంగా 12రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్న సరస్వతి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ పుష్కరాలను అంగరంగ వైభవంగా జరపాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.40కోట్ల నిధులు మంజూరు చేయడంతో పలు పనులు చేపట్టారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పలుమార్లు సమీక్షలు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించడంతో కాళేశ్వరాలయానికి, త్రివేణి సంగమానికి పుష్కర శోభ సంతరించుకుంది. ప్రధాన పుష్కరఘాట్‌లో నదిలోకి వెళ్లి పుణ్య స్నానాలు ఆచరించడానికి ఇబ్బందులు పడే భక్తుల కోసం జల్లు స్నానాలు చేసేలా షవర్లు ఏర్పాటు చేశారు. ప్రధాన ఘాట్‌పై సరస్వతిమాత విగ్రహం, జ్ఞానజ్యోతి తీర్థం ఏర్పాటు చేయడంతో ఆధ్యాత్మికత సంతరించుకుంది. ఎండల నుంచి భక్తులు సేదతీరేందుకు చలువపందిళ్ల ఏర్పాటు చేయగా భక్తుల వసతి కోసం టెంట్‌సిటీ నిర్మాణం చేశారు. శ్రీకాళేశ్వర-ముక్తీశ్వర ఆలయం ఆవరణలో పుష్కర శోభ సంతరించుకుంది. విద్యుత్ కాంతుల వెలుగులు నేత్రానందం గావిస్తున్నాయి. కాళేశ్వరంలో పుష్కరాల వేడుకలకు సంబంధించి, సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతం కోసం ఏర్పాటు చేసిన పలు భారీ ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. పుష్కరాలు జరిగే 12రోజుల పాటు హోమాలు నిర్వహించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. సరస్వతి పుష్కరాలను సమర్థవంతంగా, వైభవంగా జరిపే క్రమంలో రోజుకు సుమారు 50వేల మంది భక్తులు వస్తారన్న అంచనాల మధ్య 19శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఉదయం 5.44గంటలకు ప్రారంభం

కాళేశ్వర త్రివేణి సంగమంలో 26 వతేదీ వరకు పన్నెండు రోజులపాటు సాగే సరస్వతి పుష్కరాలు గురువారం ఉదయం 5.44గంటలకు ప్రారంభం కానున్నాయి. బృహస్పతి మిధున రాశిలో ప్రవేశించిన అనంతరం ఉదయాన్నే ప్రధాన పుష్కర ఘాట్‌లో శ్రీ గురుమదనానంద సరస్వతీ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతిస్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. తెల్లవారుజామున కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయం నుంచి దేవాదాయశాఖ అధికారులు, వేదపండితులు, ఆలయ అర్చకులు, స్వామీజీ, భక్తులు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య త్రివేణిసంగమానికి వెళ్లి ప్రత్యేకపూజల అనంతరం పుష్కరాలను ప్రారంభిస్తారు.

అద్భుత ఘట్టంలో పాల్గొననున్న సీఎం



సరస్వతీ పుష్కరాల సంరంభం ఆరంభమవుతున్న రోజున ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కాళేశ్వరానికి రానున్నారు. త్రివేణి సంగమం వద్ద సాయంత్రం ఆయన పలువురు మంత్రులతో కలిసి వేడుకల్లో పాల్గొని పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. దీంతో జిల్లా యంత్రాంగం హెలీప్యాడ్ నిర్మాణం సహా పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. గురువారం సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో కాళేశ్వరం చేరుకోనున్న సీఎం ప్రధాన పుష్కర ఘాట్‌కు చేరుకుంటారు. గతంలో త్రివేణిసంగమం వద్ద వీఐపీ ఘాట్‌గా పిలుచుకునే ప్రస్తుత పుష్కరాల ప్రధానఘాట్‌కు సరస్వతి ఘాట్‌గా నామకరణం చేస్తారు. అక్కడ తమిళనాడు నుంచి తెచ్చిన 17అడుగుల ఏకశిల సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. త్రివేణి సంగమంలో పుష్కర స్నానం అనంతరం కాళేశ్వర- ముక్తీశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం 5.30గంటలకు పుష్కర ఘాట్‌లో వేదపండితులు వైభవంగా సమర్పించే సరస్వతీ నది హారతిలో పాల్గొంటారు. సీఎం రాక నేపథ్యంలో ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో పలువురు ఐపీఎస్‌లు, 3,500మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.



హోమాలకు సిద్ధంగా ఉన్న యాగశాల



పుష్కర ఘాట్‌లో జల్లు స్నానం కోసం ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్



బందోబస్తుపై చర్చిస్తున్న సీఎం భద్రతాధికారి, కలెక్టర్, ఎస్పీ

కాళేశ్వరానికి పుష్కర కళ

పెయింటింగ్స్, ఏర్పాట్లతో త్రివేణి సంగమ తీరానికి కొత్తరూపు

మహదేవపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరానికి పుష్కర కళ సంతరించుకుంది. గోడలపై వేసిన వివిధ ఆకృతుల పెయింటింగ్స్ భక్తులను ఆకర్శిస్తున్నాయి. దేవాలయం చుట్టూ ఉన్న ప్రహరీలపై మహాదేవుడు, పలు ఆకర్షణీయమైన చిత్రాలు భక్తులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. చిత్ర కళాకారుల కళా నైపుణ్యాన్ని పలువురు కొనియాడుతున్నారు. అంతేకాకుండా దర్శనానికి వచ్చే ప్రజలు ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక కాళేశ్వరానికి సీఎం రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మిగతా రాజకీయ పార్టీల నాయకులు కూడా భక్తులకు ఆహ్వానం పలుకుతూ ఫ్లెక్సీలు కట్టారు. ఇదిలా ఉంటే మంగళవారం సాయంత్రం వీచిన గాలి దుమారాలకు కొన్ని చోట్ల ఫ్లెక్సీలు చెదిరిపోయాయి. దీంతో నాయకులు వాటిని సరిచేసేపనిలో నిమగ్నమయ్యారు.





కాళేశ్వరంలో వెలసిన ఫ్లెక్సీలు

ఉత్సవ కమిటీ ఎన్నిక

సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో 18 మందితో నూతన ఉత్సవ కమిటీ బుధవారం ఏర్పాటైంది. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో దేవాదాయ ధార్మాదాయ శాఖ అధికారులు ఆ కమిటీ సభ్యులకు ఆలయ శేష వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. గురువారం నుంచి పుష్కరాలు పూర్తయ్యే వరకు ఉత్సవ కమిటీ సభ్యులు సేవలందిస్తారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో ఈ కమిటీనేఇ నియవించగా.. ఇందులో మెహన్‌శర్మ, దుర్గయ్య, సీతారాం, సత్యనారాయణ, పద్మ, నర్సయ్య, నర్సింగరావు, రాజమల్లు, ఓదెలు, రాజయ్య, ప్రశాంత్‌రెడ్డి, శ్రీధర్‌రావు, కుమారస్వామి తదితరులున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా హ్యాండ్లూమ్ స్టాళ్లు

పుష్కరాల సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్స్ స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బుధవారం ఈ స్టాళ్లను కలెక్టర్ రాహుల్ శర్మ ప్రారంభించారు. మహిళా సంఘాలు తమ కృషిని ప్రతిబింబించేలా నాణ్యమైన హస్తకళా ఉత్పత్తులు, సేంద్రియ ఆహార పదార్థాలు, పచ్చడులు ప్రతీ ఒక్కరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఆర్డీవో నరేష్, పరిశ్రమల అధికారి సిద్దార్థ, డీపీఎం భీమారపు రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేసిన నూతన పుష్కర కమిటీ



మహిళా సంఘాల స్టాళ్లు ఏర్పాటు చేసిన అధికారులు

పుష్కరాలకు ఏర్పాట్లు పూర్తి

● దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజా రామయ్యర్ ● కాళేశ్వరంలో సరస్వతీ ఘాట్ వద్ద పనుల పరిశీలన

మహదేవపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో గురువారం నుంచి జరిగే సరస్వతీ పుష్కరాలకు ఏర్పాట్లు పూర్తయినట్లు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజా రామయ్యర్ అన్నారు. బుధవారం సరస్వతీ ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్రివేణి సంగమంలో మొట్టమొదటి సారిగా కాశీ పండితులతో నిర్వహించే నదీ హారతిలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా యంత్రాంగం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, భక్తుల పట్ల గౌరవంగా వ్యవహరించాలన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

సరస్వతీ పుష్కరాల్లో పాల్గొనే సిబ్బంది ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని భూపాపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఆలయంలోని కల్యాణ మండపంలో విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతీ పుష్కరాలను వైభవంగా జరుపుతున్నామని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేశామన్నారు. రోజూ వేలాది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ అధికారికి క్షేత్రస్థాయిలో ఉండి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. గురువారం ఉదయం ప్రారంభమయ్యే సరస్వతీ పుష్కరాలకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరవుతారని, సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి సరస్వతి మాత విగ్రహాన్ని ఆవిష్కరించి.. పుష్కర స్నానం, గోదావరి హారతి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ప్రభుత్వం ఈ పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, కుంభమేళాకు వెళ్లలేని వారు ఈ పుష్కరాలకు వచ్చే అవకాశం ఉందని, అంకితభావంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందుల కలగకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్లు అశోక్, విజయలక్ష్మీ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న శైలజా రామయ్యర్, కలెక్టర్ తదితరులు

చర్చనీయాంశమైన పోలీసుల రీల్స్

మహదేవపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సోషల్ మీడియా రీల్స్ అనేవి సర్వసాధారణమైపోయాయి. ఎలాంటి వారైనా... వృత్తి, వయసుతో సంబంధం లేకుండా రీల్స్ చేయడం మాత్రం పరిపాటైంది. ఈ క్రమంలో కొందరు చిక్కుల్లో పడుతుండగా.. మరికొందరు వైరల్ అవుతున్నారు. అయితే త్రివేణి సంగమం వద్ద పుష్కర విధుల్లో ఉన్న ఓ మహిళా కానిస్టేబుల్, మరో ముగ్గురు ఎస్సైలు పడవలో ప్రయాణించే సమయంలో తీసుకున్న ఓ రీల్స్ వీడియో వైరల్ అవుతోంది. యూనిఫామ్ ధరించి విధులను మరిచి రీల్స్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాల్సిన పోలీసులే ఇలా రీల్స్ చేయడమేంటని పలువురు ఆరోపిస్తున్నారు.

కాటారంలో వేగంగా పనులు

పుష్కరాల నేపథ్యంలో సెంట్రల్ డివైడర్ స్తంభాలకు రోప్‌లైట్లు ఏర్పాటు



కాటారం, మే 14 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్ర మైన కాటారం మండల కేంద్రంలో సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. కాళేశ్వరం సరస్వతీ పుష్క రాలు-2025 నేపథ్యంలో జిల్లాలోని 353(సీ) జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ డివైడర్లపై నెలకొల్పిన స్తంభాలకు రోప్‌లైట్లు అమరుస్తున్నారు. జాతీయ పతాకంలోని మూడు రంగుల రోప్ లైట్లను అధికారులు అమర్చడానికి చర్యలు చేపట్టారు. దీంతో మండలంలోని గారెపల్లి, ధన్వాడ, మేడిపల్లి, కొత్తపల్లి గ్రామాల పరిధిలోని సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు రంగురంగుల రోప్ లైట్లు అమర్చే కార్యక్రమం చేప ట్టారు. ఈ కార్యక్రమాలను ఎంపీడీవో బాబు, ఎంపీ వో వీరస్వామి పర్యవేక్షించగా, పంచాయతీ కార్యద ర్శులు సమీర్‌ఖాన్, ఉమాదేవి, రాకేష్, జ్యోత్స్న తదిత రులు పనులు చేయిస్తున్నారు.

సరస్వతీ పుష్కరస్నానంతో పునీతులు కావాలి

శాయంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం త్రివేణి సంగమంలో గురువారం నుంచి 26 వరకు జరిగే సరస్వతీ పుష్కరాలలో స్నానం ఆచరించి పునీతులు కావాలని పెద్దకోడెపాక రాజరాజేశ్వరస్వామి దేవాలయ ప్రధానార్చకుడు డాక్టర్ అనుదీప్ శర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. స్వస్తిశ్రీ విశ్వనామ సంవత్సరం వైశాఖమాసం గురువారం తెల్లవారుజామునుంచి పుష్కరాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. సరస్వతీ పుష్కరాలు 12 సంవత్సరాలకు ఒకసారి వస్తాయని, సరస్వతీ అంతర్వాహిని త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించి, పితృదేవతలకు తర్పణాలు, నదీ పూజలు, ప్రాయశ్చితాలు, పిండప్రదానాలు చేయడం వల్ల అత్యంత పుణ్య ఫలం సిద్ధిస్తుందన్నారు. అలాగే పుణ్యస్నానాల అనంతరం జంటలింగాలైన కాళేశ్వరం ముక్తీశ్వరస్వామిని దర్శించుకుని, స్వామివారి అనుగ్రహం పొందాలని సూచించారు.

శిల్పవనంలో..

వేయిస్తంభాల గుడిలో రుద్రేశ్వరుడికి పూజలు చేస్తున్న అందాలభామలు





హనుమకొండ హరిత హోటల్ వద్ద బతుకమ్మలతో సందడి చేసిన మిస్సమ్మలు

అందాల సోయగం



రామప్ప ఆలయ నిర్మాణంలో వాడిన తేలియాడే ఇటుక, సాండ్‌బాక్స్ విధానాన్ని సుందరీమణులకు వివరిస్తున్న నిట్ మాజీ ప్రొఫెసర్ పాండురంగారావు

చారిత్రక ఓరుగల్లులో అందగత్తెల సందడి

- వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్ప సందర్శన
- రెండు బృందాలుగా పర్యటించిన మిస్‌వరల్డ్ కంటెస్టెంట్లు
- భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో హెరిటేజ్ వాక్



హనుమకొండ / హనుమకొండ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి) తెలుగుదనం ఉట్టి పడేలా.. నుదుటిపై తిలకం దిద్ది.. సంప్రదాయ చీరల్లో ప్రపంచ అందగత్తెల ఓరుగల్లు పర్యటన ఉత్సాహంగా సాగింది. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు వచ్చిన 57మందితో కూడిన రెండు బృందాలు చారిత్రక వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్ప ఆలయాలను సందర్శించాయి. ఈ క్రమం లో సాయంత్రం 4.35గంటలకు హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌కు చేరుకున్న 22మంది మిస్ వరల్డ్‌పోటీదారుల్లో అర్జెంటీనా, బ్రెజిల్, బొలివియా, ఈక్వెడార్, ఎల్ సాల్వేడార్, గ్వాటిమాల, హైతి, హోండూరస్, మెక్సికో, నికరాగ్వా, పరాగ్వే, పనమా, పెరూ, అమెరికా, సూరినామ్, వెనుజుల, బెలిజ్ దేశాలకు చెందిన సుందరీమణుల కు బతుకమ్మలతో స్వాగతం పలికారు. తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు సంప్రదాయ డోలు, వాయిద్యాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. మహిళలతో కలిసి అందగత్తెలు బతుకమ్మ ఆట, పాటలతో నృత్యాలు చేస్తూ హుషారెత్తించారు.

అందాల భామలకు ఘన స్వాగతం..

ఓరుగల్లు పర్యటనలో భాగంగా తొలుత హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌కు చేరుకున్న వివిధ దేశాలకు చెందిన 24 మంది ప్రపంచ సుందరీమణులకు బుధవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారద, సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి టూరిజం శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో సాయంత్రం 4:42 నిమిషాలకు హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌కు వారు చేరుకున్నారు. బస్సు దిగిన సుందరీమణులకు పుష్పగుచ్ఛాలు అందజేసి పూలుచల్లుతూ స్వాగతం పలికారు. మహిళలు బతుకమ్మలతో స్వాగతం పలికారు. సుందరీమణులు బతుకమ్మలను చేతబట్టుకుని నృత్యాలు చేశారు. అక్కడ ఉన్న మహిళలతో సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. అనంతరం హోటల్లో ఏర్పాటుచేసిన రూములకు చేరుకుని సంప్రదాయ చీరలను ధరించారు. కాకతీయ హోటల్ ముందు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఎదుట ఫొటోలకు ఫోజులు ఇచారు. అనంతరం 6గంటలకు అక్కడి నుంచి వేయిస్తంభాల అలయానికి బస్సులో వెళ్లారు. వేయిస్తంభాల ఆలయం వద్ద వరంగల్ ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తదితరులు పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో సుందరీమణులకు స్వాగతం పలికారు. రెడ్‌కార్పెట్ స్వాగతంతో పోటీదారులు ఆలయంలోకి ఒక్కో ప్రదేశాన్ని సందర్శిస్తూ తమ భావాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఇక్కడ మొత్తం 42 నిమిషాల పాటు పర్యటన సాగింది.



వేయిస్తంభాల ఆలయంలో అనందంగా..

తెలుగుదనం ఉట్టి పడేలా, సంప్రదాయబద్ధంగా చీరలను ధరించి, నుదుట తిలకం దిద్ది చారిత్రత్మక వెయ్యి స్తంభాల ఆలయానికి చేరుకున్నా వీరికి అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. తొలుత సుందరీమణులు ఆలయం ఆవరణలో ఉన్న కోనేరును పరిశీలించారు. శిలా శాసనంలో ఉన్న ఆలయ చరిత్రను గైడ్ వివరించారు. సుందరీమణుల కోసం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తాంబాళాల్లో చెంబులోని నీటితో కాళ్లను కడుక్కున్నారు. ఆలయంలోని నందిని చూసి ఆశ్చర్యపోయారు. నంది విగ్రహం ఇక్కడ ఎందుకు ఉందని గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆలయ విశిష్టత, నిర్మాణ శైలిని గైడ్ వివరించారు. వెయ్యి స్తంభాలతో ఆలయాన్ని నిర్మించారని, ఇసుకతో పునాదులను ఏర్పాటు చేశారని తెలిపారు. వేయి ఏళ్ల అవుతున్న చెక్కు చెదరకుండా ఆలయం ఉండటానికి కారణం సాండ్ టెక్నాలజీ అని వివరించారు. శివుడు, విష్ణువుతో పాటు సూర్యుడు కొలువైన పుణ్యక్షేత్రంగా సుందరీమణులకు వివరించారు. అనంతరం నంది విగ్రహం వద్ద మిస్సమ్మలు పోటీపడి ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. బ్యూటీఫుల్ అంటూ నంది విగ్రహం వద్ద సందడి చేశారు. కొందరు అతివలు నంది చెవులో తమ కోర్కెలు చెప్పారు. అనంతరం దక్షిణం వైపు పునరుద్ధరించిన కల్యాణ మండపం వద్దకు వెళ్లి విద్యుత్ కాంతులు జిగేల్ జిగేల్ అంటుండగా.. ఫొటోలకు ఫోజులిచ్చారు. అధికారులకు, మీడియా, అక్కడి వచ్చిన వారికి నమస్కార్ అంటూ చేతులు ఊపుతూ ఉత్సాహన్ని చూపించారు. అనంతరం గర్భగుడిలో శివలింగం వద్ద రుద్రేశ్వరస్వామికి ముద్దుగుమ్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్‌శర్మ ప్రపంచ అందగత్తెలకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి, పూర్ణకుంభ స్వాగతంతో పాటు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. రుద్రేశ్వరస్వామికి అభిషేకాలు చేయించారు. ముద్దుగుమ్మలకు తీర్థప్రసాదాలను అందించి జరంచుకండువాలతో సత్కరించారు. సుమారు గంట సేపు వెయ్యి స్తంభాల ఆలయంలో గడిపారు. హిస్టారికల్ టెంపుల్.. థౌసండ్ ఇయర్ టెంపుల్.. ఓం నమోశ్శివాయ అని సుందరీమణులతో అర్చకులు అనిపించారు. మంగళ వాయిద్యాలతో ఆలయంలోని తీసుకెళ్లారు. ఉత్తిష్ఠి గణపతి దర్శనం కల్పించి రుద్రేశ్వరస్వామికి జలాభిషేకం నిర్వరింపచేశారు. పూజల నిర్వహణ అనంతరం సుందరీమణులు ప్రసాదం అందుకున్నారు.

కోటలో సుందరీమణులు కోలాహలం

కాకతీయ సామ్రాజ్య కళా వైభవానికి, శిల్పకళానైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిన వరంగల్ కోటను సుందరీమణులు తిలకించారు. సంప్రదాయబద్ధంగా చీర కట్టులోనే వరంగల్ కోటను సందర్శించారు. తమ పాలనలో కాకతీయ రాజులు వరంగల్ కోటను అద్భుత నిర్మాణాలతో తీర్చిదిద్దిన తీరును, కోటలోని మూడు వృత్తాకార పొరలు, భారీ రాతి ద్వారాల (కాకతీయుల కీర్తి తోరణాల)ను పరిశీలించి ముద్దుగుమ్మలు ముగ్ధులయ్యారు. ఈ కీర్తి తోరణాలే రాష్ట్ర చిహ్నంగా ఏర్పాటు చేసినట్లు తెలుసుకుని సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. కీర్తితోరణం వద్ద పోటాపోటీగా మిస్సమ్మలు ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. కోట నిర్మాణం, చరిత్రతో పాటు స్వయంభూ శివాలయం లాంటి కాకతీయుల నిర్మాణాలు, ప్రాముఖ్యతలను సౌండ్ అండ్ లైట్ ద్వారా ప్రదర్శిస్తూ మిస్ వరల్డ్ పోటీదారులకు వివరించారు. కోటలోని శిల్పవనంలో ఒయ్యారాలు ఒలకపోస్తూ.. శిలలను పరిశీలించారు. అద్భుత శిలా నైపుణ్యానికి ముగ్ధులయ్యారు. ఫొటోలకు ఫోజులిస్తూనే.. సెల్ఫీలు దిగుతూ సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ తమ ఆనందాన్ని తమ దేశంలోని వారితో పంచుకున్నారు. చేతులు ఊపుతూ.. జోరుగా.. హుషారుగా కోటలో మిస్సమ్మలు సందడి చేశారు. చారిత్రక వరంగల్ కోట ముద్దుగుమ్మల రాకతో సందడిగా మారింది.

అకట్టుకున్న పేరణీ తాండవం.. చపాట.. ద్రరీస్‌లు..

ఓరుగల్లు అంటనే గుర్తుకు వచ్చే అనేక అంశాల్లో ఒకటి పేరణీ నృత్యం. కాకతీయుల కాలంలోనే పురుడు పోసుకున్న పేరణి నృత్యాన్ని వరంగల్ కోటలో ప్రదర్శించి మిస్సమ్మలను ఆశ్చర్య పరిచారు. యుద్ధ సమయంలో కాకతీయులు నిర్వహించే పేరిణి శివతాండవ నృత్య రూపకాన్ని ఆసక్తిగా తిలకించారు. రాణిరుద్రమ నృత్య రూపకం సుందరీమణులను మంత్రముగ్ధులను చేసిం ది. కోటలో ఏర్పాటు చేసిన ఫ్లియా మార్కెట్‌ను సుందరీ మణులు సందర్శించారు. వీరికి ఇటీవలే జీఐ ట్యాగ్ పొందిన చపాట మిర్చిని చూపించారు. మిర్చి ప్రత్యేకతలను వివరిం చారు. అలాగే వరంగల్ పసుపును పరిచయం చేస్తూ, దాని ప్రత్యేకతలను తెలిపారు. అలాగే అంతర్జాతీయ గుర్తింపు పొందిన వరంగల్ దర్రీస్ (జంపకానాలు) గురించి వివరించా రు. ఈ దర్రీస్ ప్రత్యేకతలను వివరించారు. దర్రీస్‌లను పరిశీలించటంతో పాటు చపాట మిర్చి రుచికి గల కారణా లను తెలుసుకునేందుకు విస్సమ్మలు ఆసక్తి చూపారు. కాగా, మిస్‌వరల్డ్ పోటీదారుల పర్యటనకు పోలీసులు మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. సుమారు వెయ్యిమందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలుతీసుకున్నారు.

వరంగల్ వచ్చిన మిస్సమ్మలకు జ్ఞాపికలు

వరంగల్ కోటలో శిల్ప సౌందర్యానికి ముగ్దులైన అందాలభామలకు వరంగల్ కళాకారులు అరుదైన జ్ఞాపికలను అందించారు. వరంగల్‌నగరంలోని రంగశాయిపేటకు చెందిన కళాకారులు ఆరు నెలలుగా శ్రమించి తయారు చేసిన షీల్డులను ప్రపంచ అందగత్తెలకు అందించారు. ఈ షీల్డులపై కాకతీయ కీర్తితోరణం, రాణీరుద్రమ ప్రతిమలను చెక్కారు. అలాగే నూలుతో తయారు చేసిన బ్యాగ్‌లను అందిచారు. వీటితో పాటు వరంగల్‌కు ప్రత్యేకమైన దర్రీస్‌ను కూడా సుందరీమణులకు బహుమతులుగా అందించారు. కాగా, తెలంగాణ సంస్కృతి అద్భుతమని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలు అద్భుతమని మిస్ అర్జెంటీనా, మిస్ కెనడా తదితర అందాలభామలు పేర్కొన్నారు. ఇక్కడికి రావడం చాల అనందంగా ఉందని పేర్కొన్నారు.



వేయిస్తంభాల గుడి ఆవరణలో అందాలభామలతో ఓరుగల్లు ప్రజాప్రతినిధులు







వేయిస్తంభాల గుడి ఆవరణలో అందాలభామలు, రామప్పలో తాంబాళాల్లో కాళ్లు కడుక్కొంటున్న సుందరీమణులు, రామప్ప అందాలను ఫోన్‌లో బంధిస్తూ..



రామప్ప ఆలయ ఆవరణలో సుందరీమణులతో మంత్రి సీతక్క, జిల్లా అధికారులు



రామప్ప ఆవరణలో పేరిణీ నృత్య ప్రదర్శన



వరంగల్ కోటలో..



వరంగల్ కోట వద్ద చపాట మిర్చిని చూస్తున్న ఓ అందాలభామ

అందాల పోటీలపై పసలేని విమర్శలు

- రాష్ట్ర పర్యాటకానికి విస్తృత ప్రచారం
- పర్యాటకాభివృద్ధే లక్ష్యంగా పోటీలు
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



వరంగల్ కోటలో అందాలభామలతో మంత్రి సురేఖ

హనుమకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): హైదరా బాద్‌లో జరుగుతున్న ప్రపంచసుందరి పోటీల నిర్వహణపై కొందరు పసలేని విమర్శలు చేస్తున్నా రని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధాని కి, ఆందాల పోటీలకు ముడిపెట్టి విమర్శలు చేయడంలో అర్థం లేదన్నారు. బుధవారం వరంగ ల్ కోట ప్రాంగణంలో ప్రపంచ సుందరీమణుల హెరిటేజ్ వాక్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడారు. యుద్ధం ప్రారంభం కావడానికి ఏడాదికి ముందే ఆందాల పోటీల నిర్వహణ కసరత్తు మొదలైందని గుర్తు చేశారు. పైగాఅందాలపోటీలను కించపరిచి మాట్లాడడం సరికాదని కొట్టిపారేశారు. పోటీల సందర్భం గా అనేక ప్రశ్నలను అడగడం ద్వారా మహిళల అంతర సౌందర్యాన్ని ఆవిష్క రింపచేస్తారన్నారు. ఓరుగల్లు అంటే నే తెలంగాణ సంస్కృ తి, సంప్రదాయాలు, చరిత్రకుకు నిలువెత్తు నిదర్శనమన్నా రు. మిస్‌వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం తెలంగాణకు గర్వకారణమని, వరంగల్ భవ్య, దివ్య, నవ్య నగరంగా పేరుగాంచిందన్నారు. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు వారసత్వ సంపద చారిత్రక ప్రదేశాలు గొప్ప అనుభూతిని కలిగిస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సార థ్యంలో రాష్ట్రంలో వరంగల్ నగరాన్ని రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తున్నట్టు మంత్రి సురేఖ చెప్పారు. త్వరలో మామునూరుకు ఎయిర్‌పోర్టు రానున్నదని అన్నారు. విస్‌వరల్డ్ గ్లోబల్ ఈవెంట్ అని, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటేందుకు ఇది ఒక అవకాశమని అన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణను ప్రపంచ దృష్టిలో నిలిపి, దాని బ్రాండ్ విలువను, ఆకర్శణను పెంచుతుందన్నారు.

కోట అందాలు అద్భుతమన్న సుందరీమణులు

కాగా, కోటను సందర్శించిన కొందరు సుందరీమణులు వరంగల్ కోట అద్భుతాలను ప్రశంసించారు. అర్జెంటీనా, కెనడా, పనామా, యునైటెడ్ స్టేట్స్, పరాగ్వే తదితర దేశాల సుందరీమణులు వరంగల్ కోటలో పర్యటన తమకు దివ్యానుభూతిని మిగిల్చిందన్నారు. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు అద్భుతమని వర్ణించారు. భాతరదేశ రాజ్యం, ఇక్కడ ప్రజాస్వామ్యం ఎంతో బలమైనవని, సుస్థిరమైనవన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు తమను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంఎల్‌ఏ కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, జీడబ్ల్యుఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాంకడే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుడా రూపొందించిన సావనీర్‌ను సుందరీమణులకు అందచేశారు.

రామప్పలో సుందరీమణుల సందడి

అబ్బురపరిచే ఏర్పాట్ల మధ్య అందగత్తెల హెరిటేజ్ వాక్

ములుగు/ వెంకటాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరీమణులు రామప్పలో బుధవారం సందడి చేశారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 33మంది ముద్దుగుమ్మలు అబ్బురపరిచే ఏర్పాట్ల మధ్య హెరిటేజ్ వాక్ చేశారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న అతిథులకు ఎర్రని తివాచీ పరిచి కొమ్ముకోయ బృందంతో స్వాగతం పలికారు. ఆలయ సమీపంలోని రాతి గోడ వద్ద అతిథుల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక తాంబాళాల్లో కాళ్లు కడుక్కొని ఆలయంలోకి ప్రవేశించి ముద్దుగుమ్మలు యునెస్కో గుర్తింపు పొందిన చారిత్రక రామప్ప ఆలయాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. కాకతీయుల కాలంలో చెక్కిన శిల్పాలను చూసి ఆశ్చర్యానికి లోనయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు హరీష్‌శర్మ, ఉమాశంకర్ రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి ముద్దుగుమ్మలకు శఠగోపం పెట్టి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎన్ఐటీ మాజీ ప్రొఫెసర్ పాండురంగారావు రామప్ప ఆలయ విశిష్టతను సుందరీ మణులకు వివరించారు. నీటిలో తేలియాడే ఇటుకను, సాండ్‌బాక్స్ టెక్నాలజీ వాడి దేవాలయాన్ని నిర్మించిన విధానం గురించి వివరించారు. ఆలయ గైడ్స్ విజయ్‌కుమార్, వెంకటేష్ మదనిక శిల్పాల మనోహరాలను వివరించారు. అనంతరం సుందరీ మణులు ఆలయ నుంచి బయటకు వస్తూ 'తెలంగాణ... జరూర్ ఆనా' అంటూ నినదించారు. వారి వేషధారణ భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా చీరలు, పరికిణీలు, జడకొప్పు, కొప్పులో మల్లెపూలతో ఔరా అనేలా అందాల భామలు చూపరులను ఆకట్టుకున్నారు. కాకతీయ శిల్పులు చెక్కిన శిల్పాలతో కదిలే జవరాళ్లు పోటీ పడుతూ నువ్వా.. నేనా.. అన్నట్లు మరీ సెల్ఫీలు దిగారు.



ఫొటో గ్రాఫర్లకు ఫొజులిస్తూ సంబరపడ్డారు. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర, జిల్లా ఎస్పీ శబరీష్‌లతో కలిసి ముద్దుగుమ్మలు గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అందాల అతిథులకు అటవీశాఖ ఆధ్వర్యంలో వెదురు కర్రతో తయారు చేసిన అందమైన బహుమతులను మంత్రి సీతక్క, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్ చేతుల మీదుగా అందజేశారు. జిల్లా ఎస్పీ శబరీష్ మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. బందోబస్త్‌లో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, వెంకటాపూర్ ఎస్సై జక్కుల సతీష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాకతీయ రాజుల పరిపాలన, చరిత్రాత్మక అంశాలను నృత్య రూపంలో కళాకారులు చూపించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ అలేఖ్య పూజారి రాణిరుద్రమదేవి వేషధారణలో మెప్పించారు. అనంతరం పేరణి రంజిత్‌కుమార్ 65 మంది కళాకారులచే శివతాండవం అందరినీ ఆకట్టుకున్నాయి. రాణి రుద్రమదేవి చరిత్ర, ఆమె వివాహ వేడుకలను కనులకు కట్టినట్టుగా ప్రదర్శించడం పట్ల ప్రపంచ సుందరీమణులు హర్షం వ్యక్తం చేశారు. లేజర్‌షో ద్వారా ఆలయ శిఖరంపై ప్రదర్శించిన శివతాండవం తదితర చిత్రాలు ఆకట్టుకున్నాయి.

చారిత్రక కట్టడాల నిలయం : మంత్రి సీతక్క

ములుగు జిల్లా కేవలం తెలంగాణ చిత్రపటంలో ఒక భాగం మాత్రమే కాదని, చారిత్రక కట్టడాలకు నిలయమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. కాకతీయులు ఏలిన గడ్డ, సమ్మక్క-సారలమ్మలు కొలువైన నిలయమన్నారు. ములుగు జిల్లా చరిత్రకు సజీవ సాక్ష్యమని కొనియాడారు. నేను మంత్రిగానే కాకుండా ఈ ప్రాంత బిడ్డగా ఈ వేడుకకు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ శబరీష్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రవీందర్, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులకు ఆమోదం

హసన్‌పర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ అనుబంధమైన పనుల నిర్వహణకు ప్రభుత్వ నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీవో విజయలక్ష్మి తెలిపారు. ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకం కింద మామిడి, నిమ్మ, బత్తాయి, జీడీ మామిడి, జామ, సీతాఫలం, సపోట, ఆయిల్‌పామ్, అల్లనేరడి, కొబ్బరి, సీతాఫల్, జామ, కరోడా వంటి పండ్ల మొక్కలు పెంచుకొనేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యుత్, నీటి సౌకర్యం ఉన్న సన్న, చిన్నకారు రైతులు పంచాయతీ కార్యాలయంలో కానీ, మండల పరిషత్ కార్యాలయంలో గానీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కూలీలతో గుంతలు తీయించడం, ప్రభుత్వ నిబంధన ప్రకారం మొక్కల ఖర్చు చెల్లించడం, నిర్వాహణ ఖర్చులు, ఎరువుల ఖర్చులు, ప్రతీనెల నీటి నిర్వహణ ఖర్చులు కూడా చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోపు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కానీ, మండల పరిషత్ కార్యాలయంలో కానీ సమర్పించాలని తెలిపారు.



ఎన్సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్ తదితరులు

లీడర్‌షిప్ క్యాంపునకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ఎంపిక

వరంగల్ ఎడ్యుకేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : హుజూరాబాద్ సింగాపురం కిట్స్ కళాశాలలో అడ్వాన్స్ లీడర్‌షిప్ క్యాంపునకు ఎంపికైన ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లను కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రెహమాన్ అభినందించారు. బుధవారం కళాశాలలో క్యాడెట్లను ఎన్సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ స్వామి తదితరులతో కలిసి అభినందించారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా రాకేష్



రాకేష్

మడికొండ, మే 14(ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట నియోజకవర్గంలో సంఘటన సంరచనా పర్వ్‌లో భాగంగా బీజేపీ కాజీపేట మండల ప్రధాన కార్యదర్శిగా మడికొండకు చెందిన కుక్కల రాకేష్ ముదిరాజ్‌ను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం రాకేష్‌కు నియామక పత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పది, ఇంటర్ ఫలితాల్లో కేవీ విద్యార్థుల ఉత్తీర్ణత

మడికొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): కడిపికొండలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ, వరంగల్ విద్యార్థులు 10, ఇంటర్మీడియేట్ సీబీఎస్ఈ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని బుధవారం విద్యాలయ ప్రిన్సిపాల్ సుభాషిణి తెలిపారు. పదవ తరగతిలో 500 మార్కులకుగాను గొండు సమీర 477, గట్టు మనస్విని రెడ్డి 449, బండి స్నేహితరెడ్డి 448 మార్కులు, అలాగే ఇంటర్‌లో 500 మార్కులకు గాను అరితోట ప్రహర్ష జష్టస్ జోషవ 400, పాలడుగు శ్రీజ 395, కొక్కొండ అనంతశ్రీ 390 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ అభినందించారు.

అనితారెడ్డికి వరల్డ్ బెస్ట్ మదర్ అవార్డు



అనితారెడ్డి

బాలసముద్రం, మే 14 (ఆంధ్రజ్యోతి): అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఛైర్మన్, కేయూ పాలన మండలి సభ్యులు డాక్టర్ అనితారెడ్డికి వరల్డ్ బెస్ట్ మదర్ అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మనం ఫౌండేషన్ సంస్థ మదర్స్‌డే వేడుకలను పురస్కరించుకొని అనితారెడ్డిని అవార్డుకు ఎంపికచేసింది. 30ఏళ్లుగా అనాథ పిల్లలకు అందిస్తున్న సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు మనం ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ చక్రవర్తి తెలిపారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర




మడికొండలో హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న మాలధారులు

మడికొండ, మే 14 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మడికొండలో హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో బుధవారం హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరి గింది. హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై మెట్టుగుట్టపై నుంచి వేణుగోపాలస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈసందర్భంగా హనుమాన్ మాలధారులు భక్తి శ్రద్ధలతో స్వామివారిని స్తుతిస్తూ సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేశారు. జై హనుమాన్ నినాదాలతో హోరెత్తించారు.

అరుంధతి మాదిగ సంఘం నూతన కమిటీ

కాజీపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): కాజీపేట అరుంధతి మాదిగ కుల సంక్షేమ సంఘానికి ఇంతకు ముందు ఉన్న అధ్యక్షుడు శిలువేరు విజయ భాస్కర్‌ను సంఘం నుంచి బహిష్కరిస్తున్నామని ఛైర్మన్ బొడ్డు దేవయ్య, కన్వీనర్ మేకల మల్లికార్జున్ తెలిపారు. కాజీపేట మీడియా పాయింట్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 2012 ఏర్పాటైన అరుందతి మాదిగ సంక్షేమ సంఘాన్ని పూర్తిగా రద్దుచేస్తున్నామన్నారు. ఇంతకుముందు ఉన్న విజయ్ భాస్కర్ సంఘం లెక్కలు చూపకుండా, జనరల్ బాడీ సమావేశం నిర్వహించకుండా సంఘాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. అందుకుగాను బొడ్డు దేవయ్య అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఛైర్మన్‌గా బొడ్డు దేవయ్య, కన్వీనర్లుగా మేకల మల్లికార్జున్, రేణిగుంట్ల ఉమా మహేశ్, కో-కన్వీనర్లుగా రామగిరి శ్రీనివాస్, నద్దునూరి కుమారస్వామి, కోశాధికారులు కొండ్రుతిరుపతి, కాంపెల్లి లక్ష్మన్‌లు ఎన్నుకున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న సంఘం నాయకులు

ప్రజల పక్షాన నిలిచిన నిఖార్సైన గొంతు బుర్రా రాములు

- బార్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు తీగల జీవన్
- కేయూలో ఘనంగా బుర్రా రాములు 14వ వర్ధంతి

కేయూ క్యాంపస్,మే 14(ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన నిలబడిన నిఖార్సైన గొంతుక బుర్రారాములు అని బార్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు తీగల జీవన్ అన్నారు. బుధవారం కేయూ మొదటి గేటు వద్ద ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా కమిటీ నేతృత్వంలో బుర్రా రాములు 14వ వర్ధంతిని పురస్కరించుకుని యాది సభను నిర్వహించారు. బుర్రా రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా జీవన్ పాల్గొని మాట్లాడారు. బుర్రా రాములు తన జీవితాన్ని మానవ, పౌర హక్కుల కోసం త్యాగం చేశారని అన్నారు. రాజ్యాంగ హక్కుల మేరకు ప్రజల జీవితాలను మార్చేందుకు ప్రయత్నించారని అన్నారు. టీపీటీఎఫ్ నేత భైరి స్వామి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో రాములు కీలకంగా పని చేశారని అన్నారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేత నున్నా అప్పారావు మాట్లాడుతూ.. బుర్రారాములు ఆశయాల సాధనకు ఈ తరం యువత ముందుకు రావాలని అన్నారు. విద్యార్థుల పక్షాన పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆదివాసీలపైన దాడులను అపాలని డిమాండ్ చేశారు. శాంతి చర్చలు జరపాలని అన్నారు. రాములు స్ఫూర్తితో యువత ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు, రాష్ట్ర కార్యదర్శి ఎర్ర అఖిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్‌కుమార్, బండి రజనీకుమార్, కేయూ స్కాలర్ మదాసి రమేశ్, జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, జిల్లా నేతలు ముషారఫ్, గణేశ్, నాని, శంకర్, శేఖర్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు .



బుర్రా రాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నేతలు



ఎస్డీఎల్‌సీఈ వద్ద నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నేతలు

బుర్రా రాములును స్ఫూర్తిగా తీసుకోవాలి

హక్కుల నేత బుర్రా రాములు ఆశయాలను అందిపుచ్చుకుని అదే స్ఫూరితో ముందుకు సాగాలని భారత్ బచావో జిల్లా ఛైర్మన్ రాంబ్రహ్మం కోరారు.బుధవారం కేయూ దూరవిద్య కేంద్రంలో పీడీఎస్‌యూ నేతృత్వంలో బుర్రా రాములు 14వ వర్ధంతిని నిర్వహించారు. పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మర్రి మహేశ్ నేతృత్వంలో బుర్రా రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంబ్రహ్మం ప్రజల పక్షాన హక్కుల కోసం నిలబడిన బుర్రా రాములు గొప్పతనాన్ని గుర్తు చేశారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పోరేట్లకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరో సామాజిక హక్కుల నేత శోభరమేశ్ మాట్లాడుతూ.. హక్కుల పోరాడిన బుర్రా రాములును గుర్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, జగన్, మల్లేశ్వర్, డీఎస్‌పీ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రవణ్, ఏబీఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాదర్శి సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు స్టాలిన్, భారత బచావో నేతలు వెంగల్‌రెడ్డి, ఓం బ్రహ్మం, అహ్మద్, శివ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా రవాణాదారుల అరెస్టు

కాజీపేట, మే 14 (ఆంధ్రజ్యోతి) - గుడుంబా రవాణా చేస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాజీపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నారావుపేట, ఇండ్యా తండాకు చెందిన గుగులోతు బాలి, మరో ఇద్దరు వ్యక్తులు కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి ఆటోలో బుధవారం గుడుంబా తరలిస్తుండగా పక్కా సమాచారంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆటోతో పాటు గుడుంబా తరలిస్తున్న గుగులోతు వాలి, పల్లెపు సాంబరాజు, పల్లెపు మహేశ్‌లను అదుపులోకి తీసకుని 12 లీటర్ల గుడుంబా, ఆటో, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఆ దాడుల్లో ఎస్సై తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ ఖలీల్, కోటిలింగం, అయూబ్, పృథ్వీ, శివాని పాల్గొన్నారు.



నిందితులను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు



డీఈవో కార్యాలయెదుట ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు ఇవ్వొద్దు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు ఇవ్వొద్దని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ డీఈవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆందోళన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. అక్షయ పాత్రకు ఇచ్చే ప్రయత్నాలను జిల్లా విద్యాశాఖ మానుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పని భద్ర కల్పించాలన్నారు. అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు ఇచ్చిన జిల్లాలో పర్యవేక్షణ కొరవడి నాణ్యత లేని భోజనం అందిస్తున్నారని, అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో అక్షయ పాత్ర అందిస్తున్న ఆహారం అభాసుపాలవుతున్న విషయాన్ని డీఈవో వాసంతి గుర్తించాలని హితవు పలికారు.ఇప్పటికైనా డీఈవో వాసంతి విద్యార్థులకు, వంట కార్మికులకు నష్టం చేకూర్చే ప్రయత్నాలను మానుకోవాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, శాంతి, సరిత, సక్కుబాయి, పర్వీన్, సంధ్య, భాగ్యలత, సునిత, పద్మ పాల్గొన్నారు.



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు

హసన్‌పర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసినవారిలో మాజీ ఎమ్మెల్యేలు ఒడితెల సతీష్‌బాబు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌ఛైర్మన్ పాడి మల్లారెడ్డి, డైరెక్టర్ మ్యాక భగవాన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, నద్దునూరి నాగరాజు బండ సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న మహిళా సంఘాలు

- సుందరీమణుల పర్యటనను అడ్డుకునే యత్నం
- వేయిస్తంభాల గుడి ఎదుట ప్లకార్డులతో నినాదాలు
- అరెస్టు చేసి హనుమకొండ ఠాణాకు తరలించిన పోలీసులు

వరంగల్ క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో ప్రపంచ సుందరీమణుల పర్యటనపై మహిళా సంఘాలు భగ్గుమన్నాయి. వేయి స్తంభాల ఆలయానికి అందాల భామలు మరో పది నిమిషాల్లో రాబోతున్న సమయంలో సుమారు సాయంత్రం 6గంటల ప్రాంతంలో (ఎన్ఎఫ్ఐడబ్ల్యు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్), చైతన్య మహిళా సమాఖ్య, పౌరహక్కుల సంఘం, డెమోక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు, యువకులు రోడ్డుపైకి వచ్చి ప్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో విద్య, వైద్యం సరిగ్గా అందక ప్రజలు అల్లాడుతుంటే ప్రభుత్వం అందాల భామల పేరుతో ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేస్తోందని నినాదాలు చేశారు. హనుమకొండ సీఐ నేతృత్వంలో సిబ్బంది వారందరినీ ఆదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. కాగా, నిరసన కార్యక్రమం ఉంటుందని ముందుగానే పసిగట్టిన నిఘా వర్గాలు.. స్థానిక పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు అప్రమత్తమవుతున్న తరుణంలో ప్లకార్డులతో మహిళలు రోడ్డెక్కారు. దీంతో కంగుతున్న పోలీసులు.. వారిని వాహనాల్లో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ఆదుపులోకి తీసుకున్న వారిలో చైతన్య మహిళా సమాఖ్య నాయకులు అనిత, కళ, రమ, ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర నాయకురాలు సదాలక్ష్మీ, జ్యోతి, పౌర సంఘాల నాయకులు జయంత్, మంచాల, డీఎస్‌పీ నాయకుడు శివ ఉన్నారు.



ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న మహిళలు

సీపీఐ మహాసభను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్



రాంపూర్‌లో సీపీఐ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

మడికొండ, మే 14(ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండల కేంద్రంలో ఈనెల 26, 27 తేదీలలో జరగనున్న సీపీఐ జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం రాంపూర్‌లో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మునిగాల బిక్షపతితో కలిసి మహాసభల ప్రచార వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి ఎల్లేష్ మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శంకర్‌నాయక్, గ్రామశాఖ కార్యదర్శి మునిగాల స్వామి, మంద సుమన్, బొట్టు బిక్షపతి, మునిగాల ఐలయ్య, బండి వెంకన్న, గుండె నాగరాజు, గన్నారపు కుమార్, యాదగిరి, పద్ద పాల్గొన్నారు.



విద్యార్థి నేతల శ్రీకాంత్, ఇతర స్టూడెంట్స్‌ను అరెస్టు చేస్తున్న కేయూ సీఐ రవికుమార్, ఎస్సైలు

అందాల పోటీలతో రాష్ట్రానికి ప్రయోజనం లేదు

- ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్
- కేయూలో పోలీసుల ముందస్తు అరెస్టులు

కేయూ క్యాంపస్, మే 14 (ఆంధ్రజ్యోతి): అందాల పోటీలతో వృథా ఖర్చులు తప్ప రాష్ట్రానికి ఏమీ ప్రయోజనం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ప్రపంచ సుందరీమణుల వరం గల్ పర్యటన సందర్భంగా అడ్డుకుంటారనే ఉద్దేశంతో కేయూ సీఐ రవికుమార్ నేతృత్వంలో పోలీసులు కేయూలో విద్యార్థి సంఘాల నేతలను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించని సీఎం రేవంత్ రెడ్డి.. విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. అందాల పోటీలకు సుమారు రు.200కోట్ల మేరకు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థి వ్యతిరేక విధానాలను మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు, ఇతర విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

పోలీసుల తీరుపై అధికారుల అసంతృప్తి



హరితహోటల్‌నుంచి వెళ్లిపోతున్న మహిళ అధికారులు

హనుమకొండ టౌన్, మే14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరీమణులు బుధవారం హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌కు వచ్చిన సమయంలో కొంత మంది పోలీసులు వ్యవహరించిన తీరుపై రెవెన్యూ శాఖ, సమాచార శాఖలోని మహిళా అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న తమపై కొంతమంది పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటల్ నుంచి బయటకు వెళ్లగొట్టారని అక్కడ ఉన్న పాత్రికేయులకు చెప్పారు. పోలీసుల వ్యవహారంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోనున్నట్లు తెలిపారు.

హరితహోటల్‌లో సుందరీమణులకు పసందైన విందు

రాత్రి 11గంటలకు హైదరాబాద్‌కు తిరుగుప్రయాణం

హనుమకొండ టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): 20 దేశాల నుంచి వచ్చిన ప్రపంచ సుందరీమణుల కోసం బుధవారం హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో పసందైన విందును పర్యాటక శాఖ ఏర్పాటు చేసింది. సుందరీమణులు హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం, ఖిలా వరంగల్ పర్యటన ముగించుకుని రాత్రి 9.30 గంటలకు హరితకాకతీయ హోటల్‌కు చేరుకున్నారు. హోటల్‌లో ఏర్పాటుచేసిన వివిధ దేశాలకు చెందిన పసందైన విందుతో పర్యాటక శాఖ అధికారులు ఆతిథ్యం ఇచ్చారు. ఒక్క ప్లేట్ భోజనం ఖర్చు సుమారు రూ.5వేలకు పైగా ఉంటుందని అధికారులు చెప్పారు. డిన్నర్ చేసిన అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సుల్లో హైదరాబాద్‌కు రాత్రి 11గంటలకు బయలుదేరారు. కాగా, సుందరీమణుల పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజయవంతం కావడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.



ప్రపంచ సుందరీమణుల కోసం ఏర్పాటు చేసిన విందు భోజనం

వేయిస్తంభాల గుడిలో ఏర్పాట్లపై పెల్లుబికిన అసంతృప్తులు

హనుమకొండ సిటీ : మిస్‌వరల్డ్ పోటీదారులు వేయిస్తంభాల ఆలయ సందర్శన వేళ ఏర్పాట్లపై అసంతృప్తులు పెల్లుబికాయి. ఆలయ విద్యుత్ ఆలంకరణ ఆకట్టుకునేలా ఉండకపోవడం లోటుగా కనిపించింది. ఆలయంలోని సుందరీమణులతో ప్రవేశించిన ఉన్నతాధికారులు ఇతరులకు కూడా కనీసం కూర్చునే ఏర్పాటు జరగలేదు. సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టలేదు. అందాల భామలు సందర్శన, వారికి అనువైన పరిస్థితుల కల్పనపైనే అధికారగణం దృష్టిచేసిందే తప్ప.. మిగతా అంశాలపై దృష్టి సారించలేదనే అసంతృప్తులు వ్యక్తమయ్యాయి. మరోవైపు మీడియాపై అంక్షలు విధించారు. కవరేజీ చేసుకునే కనీస అవకాశాలు కూడా కల్పించకుండా వ్యవహరించారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు : వరంగల్

Warangal ACO - 9985410955, Wardhannapet SR - 9030847926

Warangal -2 SR- 9154400953, Narsampet SR -7702378153

ACM - 9985411664

కౌన్సెలింగ్

మా బాబుకు కంటి సమస్య ఎందుకు?

డాక్టర్! మా అబ్బాయికి ఎనిమిదేళ్లు. చదువులో వెనకబడుతున్నాడు. బోర్డు మీద రాసినవి చదవలే కపోతున్నాడు. పుస్తకాలను కూడా కళ్లకు దగ్గరగా పెట్టుకుని చదువుతున్నాడు. మా బాబుకు ఉన్న కంటి సమస్య గురించి వివరిస్తారా?

- ఓ సోదరి, హైదరాబాద్



పెద్దల్లో లాగే పిల్లల్లో కూడా దృష్టి దోషాలు సహజం. 'పిల్లలు పెరిగేకొద్దీ అన్నీ సర్దుకుంటాయిలే!' అని నిర్లక్ష్యం చేస్తే, శాశ్వతంగా కంటి చూపే పోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి పిల్లల కంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పిల్లల్లో పుట్టుకతో లేదా పెరిగే క్రమంలో కంటి సమస్యలు తలెత్తుతాయి. వీటిని తేలికగానే కనిపెట్టవచ్చు. కొన్ని సమస్యలు కనుగుడ్లలో స్పష్టంగా కనిపిస్తే, ఇంకొన్ని పిల్లలు ప్రవర్తన ద్వారా బయల్పడుతూ ఉంటాయి. దూరం లేదా దగ్గరి వస్తువులు కనిపించని సమస్య 'రిఫ్రాక్టివ్ ఎర్రర్స్'. ఈ సమస్య వల్ల పిల్లలు పుస్తకాన్ని కళ్లకు దగ్గరగా పెట్టుకోనిదే చదవలేకపోతూ ఉంటారు. టివి లేదా బ్లాక్‌బోర్డు దగ్గరకు వెళ్లి చూడడం చేస్తూ ఉంటారు. కంటిచూపు తక్కువగా ఉండడం మూలంగా ఆటలకు కూడా పిల్లలు దూరంగా ఉంటూ ఉంటారు. ఎక్కువ సమయాల పాటు తోటి పిల్లలతో కలవకుండా, అంతర్ముఖులుగా ఇళ్లకు, తమ గదులకే పరిమితమైపోతూ ఉంటారు. చదువులో కూడా వెనకపడిపోతూ ఉంటారు. పిల్లల్లో ఈ లక్షణాలను గమనించినప్పుడు ఆలస్యం చేయకుండా కంటి వైద్యుల చేత పరీక్ష చేయించాలి. కళ్లలో సమస్య ఉందని తేలినప్పుడు, కళ్లజోడు వాడుకోవలసి ఉంటుంది. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే, పిల్లల కంటిచూపు బాగా దెబ్బతిని, అంధత్వం వచ్చే అవకాశం ఉంటుంది. కంటి నంచి మెదడుకు సిగ్నల్స్ అందక కన్ను లేజీ ఐగా మారి, 'అంబ్లియోపియా' అనే పరిస్థితి తలెత్తుతుంది. ఈ సమస్యను చికిత్సతో చక్కదిద్ది, కంటిచూపును మెరుగు పరచడం కష్టం. కాబట్టి సమస్యను ఎంత త్వరగా గుర్తించి, చికిత్స ఇప్పిస్తే, అంతగా మెరుగ్గా కంటిచూపును కాపాడుకోగలిగిన వాళ్లం అవుతాం.

- డాక్టర్ మాధవి ఘంటా,
కంటి వైద్యులు, ఖమ్మం

మిస్ వరల్డ్

ఇది ఒక జీవితానుభవం

'ప్రపంచ సుందరి పోటీలంటే అందమే కాదు... సామాజిక కోణం కూడా ఉంటుంది' అంటున్న ప్రిన్సెస్ ఇస్సీ... గడచిన ఐదేళ్లుగా మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తున్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న 'మిస్ వరల్డ్' మెగా ఈవెంట్‌లో కామెరూన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె... 'నవ్య'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.



"మధ్య ఆఫ్రికా దేశమైన కామెరూన్ మాది. 'మిస్ వరల్డ్' పోటీలు నాకు ఒక జీవిత అనుభవం. కేవలం కిరీటం దక్కించుకొనే ఉద్దేశంతోనే ఇక్కడకు రాలేదు. అందంతో పాటు ప్రతిభను ప్రదర్శించడానికి ఇది ఒక చక్కని వేదిక. అంతేకాదు... ఇందులో సామాజిక కోణం ఉంటుంది. ప్రస్తుత పోటీల 'బ్యూటీ విత్ ఏ పర్పస్' చాలెంజ్‌లో భాగంగా మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం, అవసరంలో ఉన్నవారికి, చిన్నారుల విద్యకు సాయం అందించడం లాంటి అంశాలు ఉంటాయి. అంటే పోటీలో పాల్గొనే యువతుల్లోని సామాజిక కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం ఇది. ఐదేళ్లుగా నేను ఇదే మార్గంలో పయనిస్తున్నా. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. దీనికి ప్రధాన కారణం... ఈ మహమ్మారి నా ప్రాణ స్నేహితురాలిని బలిగొంది. అప్పటినుంచి ఏ స్త్రీ కూడా దీని బారిన పడకూడదనే సంకల్పంతో పని చేస్తున్నాను. ఈ వేదిక ద్వారా నా గళాన్ని ప్రపంచానికి వినిపించే అవకాశం లభించింది. అంతేకాదు... మహిళలకు ఆర్థికంగా సహాయం చేయడానికి కృషి చేస్తున్నాను. వారిలో మానసిక ఆందోళనలు, ఒత్తిడులను దూరం చేసేందుకు నా వంతు ప్రయత్నం సాగిస్తున్నాను. గత ఏడాది వంద మందికి పైగా బ్రెస్ట్ క్యాన్సర్ బాధిత మహిళల పిల్లలకు స్కూలు ఫీజులు చెల్లించాను. నా సామాజిక సేవ ప్రయాణంలో మరింత అవగాహన పెంచుకోవడానికి 'మిస్ వరల్డ్' దోహదపడుతుంది.

భారతీయత నచ్చింది...

అద్భుత చారిత్రక నగరం హైదరాబాద్. దీంతో పాటు తెలంగాణ, భారత్‌లోని ఇతర నగరాలు, అక్కడి సంప్రదాయాల గురించి మరింతగా తెలుసుకోవాలని అనుకుంటున్నా. చిన్నప్పటి నుంచి టెలివిజన్‌లో భారతీయ చిత్రాలు, డ్యాన్సులను చూసేవాళ్లం. ఇక్కడి మహిళలు పెట్టుకునే బొట్టు నాకు బాగా నచ్చింది. అది అద్భుతంగా, ఆకర్షణీయంగా ఉంది. విమానాశ్రయంలో దిగగానే బొట్టు పెట్టి స్వాగతం పలికారు. అది నన్ను ఎంతో ఆకట్టుకుంది. అలాగే ఇక్కడి ఆలయాలు కూడా సందర్శించాలనేది నా కోరిక. దేవాలయాలు పవిత్ర ప్రదేశాలు. అక్కడ మన మనసులో ఏదున్నా భగవంతుడితో చెప్పుకోవచ్చు. ప్రతిచోటా దేవుడు ఉంటాడు. అయితే దేశం, ప్రాంతం, తెగను బట్టి ప్రార్థించే విధానం మాత్రమే మారుతుందనేది నా నమ్మకం.

మహిళకకు చదువే అందం...

ఈ వేదికను నేను శారీరక సౌందర్యం ప్రదర్శించడానికే కాదు... మహిళా సాధికారతకు లభించిన ఒక చక్కని అవకాశంగా కూడా భావిస్తున్నాను. మహిళా సాధికారత అంటే పురుషులను విమర్శించడం కాదని స్త్రీలు అర్థం చేసుకోవాలి. ప్రతిభాపాటవాలను ప్రదర్శించడం ద్వారా మహిళలు సాధికారత సాధించాలి. దృఢ సంకల్పం, పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్నయినా సాధించగల శక్తిసామర్థ్యాలు తమలో ఉన్నాయని గుర్తించాలి. సమాజంలో మనల్ని మనం ఉన్నతంగా నిలుపుకోవాలి. అది జరగాలంటే ప్రతి అమ్మాయీ విద్యావంతురాలు అవ్వాలి. చదువుకున్న మహిళ మరింత అందంగా ఉంటుందనేది నా నమ్మకం. అందుకే నేను మహిళలను విద్యావంతులను చేయడానికి కృషి చేస్తున్నాను. స్త్రీకి చదువు చెప్పడమంటే... ప్రపంచ మానవాళిని విద్యావంతులను చేయడమే.



> **ఒక్కొక్కటీ ఆస్వాదిస్తున్నా...**
>
> ఇక్కడ హోటల్‌లో దిగినప్పటి నుంచీ అందరూ ఒకటే చెబుతున్నారు... హైదరాబాద్ బిర్యానీ గురించి. త్వరలోనే తింటా. ప్రస్తుతానికి రోజుకో వంటకాన్ని రుచి చూస్తున్నా. వంటలు చాలా కారంగా ఉన్నాయి. అయినా బాగున్నాయి. చీజ్‌తో వండిన వంటలు నాకు చాలా ఇష్టం.

సమస్యలను అధిగమించాలంటే...

జీవితం అన్నాక ఎన్నో సవాళ్లు, సమస్యలు ఎదురవుతాయి. వాటిని అధిగమించాలంటే ముఖ్యంగా కావల్సింది మనపై మనకు నమ్మకం. ఆత్మవిశ్వాసమే విజయ తీరాలకు నడిపించే సాధనం. కెరీర్ ప్రారంభంలో నేను ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. ఎంతో కష్టంగా అనిపించింది. కానీ ఆత్మవిశ్వాసంతో అన్నిటినీ అధిగవించాను. ఏదైనా కొత్తగా ప్రారంభించినప్పుడు సమస్యలు ఎదురవుతాయి. వాటికి భయపడి వెనకడుగు వేయకూడదు. మనల్ని మనం అర్థం చేసుకోవడానికి, ఇబ్బందులను దాటి అనుకున్న రంగంలో రాణించడానికి కొంత సమయం పడుతుంది.

ఇదే మొదటిసారి...

నేను భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. 'మిస్ వరల్డ్' ఇక్కడ జరుగుతాయని తెలిసినప్పుడు ఎంతో ఆనందపడ్డాను. వచ్చేముందు కామెరూన్‌లోని భారత కాన్సులేట్‌కు వెళ్లి, భారత రాయబారితో మాట్లాడాను. నేను పోటీలకు వస్తున్నప్పుడు హైదరాబాద్‌లో ఒక క్యాన్సర్ సెంటర్ గురించి తెలుసుకున్నాను. ఆ కేంద్రాన్ని సందర్శించాలని, బ్రెస్ట్ క్యాన్సర్ కోసం వినియోగించే రేడియో థెరపీ, కీమోథెరపీలో కొత్త టెక్నాలజీ గురించి తెలుసుకోవాలని అనుకొంటున్నాను.

మా వీధులు ఎంతో శుభ్రం...

జీవితమనే పరుగులో మనం ఎంత బిజీగా ఉన్నా... పర్యావరణం, పరిసరాల గురించి కూడా ప్రతిఒక్కరూ పట్టించుకోవాలి. ముఖ్యంగా పర్యావరణం గురించి మనం నిత్యం ఏదో ఒక వేదికపై మాట్లాడుతూనే ఉంటాం. కానీ అదొక్కటే సరిపోదు. పర్యావరణ పరిరక్షణకు ఏంచేయాలనేది ప్రజలకు నేర్పించాలి. మన వాతావరణాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఎలా ఉంచుకోవాలో అవగాహన కల్పించాలి. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలి. పరిశుభ్రమైన వాతావరణం ఉంటే ఎన్నో వ్యాధులను నివారించవచ్చు. నేను నివసించే పెసో నగరంలో వీధులన్నీ ఎంతో శుభ్రంగా ఉంటాయి.

నన్ను నేను మెరుగుపరుచుకొని...

మొదటిసారి 2017లో 'మిస్ వరల్డ్' పోటీల్లో పాల్గొన్నాను. అప్పుడు చాలా కష్టపడాల్సి వచ్చింది. ఆ తర్వాత నన్ను నేను తీర్చిదిద్దుకున్నాను. మాట్లాడటం, నడవటం, నిలబడటంతో పాటు బయటకు వెళ్లినప్పుడు ఎలా ఉండాలి, దేశానికి ప్రాతినిధ్యం వహించేటప్పుడు ఎలా వ్యవహరించాలి... ఇలా అన్ని విషయాల్లో నన్ను నేను మెరుగుపరుచుకున్నాను. తర్వాత 2020లో 'మిస్ కామెరూన్' పోటీల్లో విజయం సాధించాను. అదే నా మొదటి కిరీటం. మిస్ వరల్డ్ అనేది అందం, తెలివితేటల సమ్మేళనం. నా ఈ ప్రయాణంలో కుటుంబ సభ్యులు, కోచ్ ఎంతో సహకరించారు. నా విజయాలను చూసి స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు గర్వపడుతున్నారు."

• దండా రామకృష్ణ

విభిన్నం

ఈ 'సాయిల్ డాక్టర్' సామాన్యురాలు కాదు

భూసార పరీక్షలను సులభతరం చేసి, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తెస్తోంది, న్యూఢిల్లీకి చెందిన, యువ ఆవిష్కర్త సౌమ్య రావత్. 'సాయిల్ డాక్టర్' పరికరాన్ని ఆవిష్కరించి, గ్రామీణ మహిళల సాధికరతకు పాటుపడుతున్న సౌమ్య గురించిన ఆసక్తికరమైన విశేషాలు...

భూమిలో సారం ఉంటేనే పంటలు బాగా పండుతాయి. అధిక దిగుబడి వస్తుంది. సాధారణంగా చాలామంది రైతులకు సారవంతమైన భూమికి ఎలాంటి పోషకాలు అవసరమనే విషయం తెలియదు. నిజానికి భూసార పరీక్ష చేయగలిగితే, భూమికి అవసరమైన పోషకాల మోతాదులు తెలుస్తాయి. దాంతో పంట దిగుబడి పెంచుకోవడంతో పాటు ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చు. అయితే తన రిసెర్చ్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించిన సమయంలో సౌమ్య రావత్, రైతులు భూసార పరీక్షకు దూరంగా ఉంటున్నారనే విషయాన్ని గ్రహించింది. ప్రజలకు శాస్త్రీయతపై నమ్మకం లేదనీ, భూసార పరీక్షలు రైతులకు అందుబాటు ధరల్లో ఉండడం లేదని కూడా తెలుసుకుంది. ఈ ఇబ్బందులతో పాటు, భూసార పరీక్షా కేంద్రాలు అందుబాటులో లేక, ఫలితాలు కూడా సకాలంలో అందడం లేదని ఆమె గుర్తించింది.

సాయిల్ డాక్టర్ పరికరంతో...

ఈ సమస్యలకు పరిష్కారం కోసం ఆలోచించిన సౌమ్య, ఎకోసైట్ టెక్నాలజీస్ అనే అగ్రిటెక్ కంపెనీని స్థాపించడంతో పాటు, తక్కువ ఖర్చుతో భూసార పరీక్షలు అందుబాటులోకి తెచ్చేందుకు అరచేతి పరిమాణంలో ఉండే సాయిల్ డాక్టర్ పరికరాన్ని కూడా రూపొందించింది. ఈ పరికరంతో అప్పటికప్పుడే భూసార పరీక్ష చేపట్టవచ్చు. నిమిషాల్లోనే నేల స్వభావం, నేలలోని నత్రజని, భాస్వరం, పొటాషియం, పీహెచ్, తేమ వంటి వాటిని గుర్తించి వివరాలు సేకరించవచ్చు. రైతుల ప్రయోజనం కోసం సాయిల్ డాక్టర్‌ను రూపొందించినా దానికి రైతుల ఆమోదం పెద్ద సవాలుగా మారింది. సౌమ్య మాటలను రైతులు విశ్వసించకపోగా, ఆమె స్వలాభం కోసం తన ఉత్పత్తిని అమ్ముకునే ప్రయత్నాలు చేస్తోందని అనుమానించారు. ఆమె సలహాలు తీసుకునేందుకు కూడా ఏమాత్రం సుముఖత చూపలేదు.

> **దేశంలో 80 శాతం కంటే ఎక్కువ మంది రైతులకు 2 హెక్టార్ల(దాదాపు 5 ఎకరాలు) కంటే తక్కువ భూమి ఉంది. రైతులు తమ భూమికి అవసరమైన పోషకాల గురించి తెలియక గుడ్డిగా అధికంగా ఎరువులు వాడుతున్నారు. దీని వల్ల రైతులకు పెట్టుబడి బరమవుతుంది. అలాగే వనరులు వృధా అవడంతో పాటు ఉత్పాదకత తగ్గుతుంది.**



రైతులు మనసు గెలిచిన సాయిల్ దీదీలు

తెలిసిన వారు చెబితేనే రైతులు అర్థం చేసుకుంటారని, నమ్ముతారనే నిర్ణయానికొచ్చిన సౌమ్య, సాయిల్ దీదీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, గ్రామీణ మహిళలకు సాయిల్ డాక్టర్ గురించి వివరించి, వారికి దానిపై శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టింది. అలా శిక్షణ పొందిన ఆ 'సాయిల్ దీదీ'లు భూసార పరీక్షలు చేసి రైతులకు సలహాలు ఇవ్వడం మొదలుపెట్టారు. కేవలం సాయిల్ దీదీలతో పరీక్షలు చేయడం ద్వారానే సౌమ్య రైతుల నమ్మకం గెలుచుకోలేదు. ఈ సాయిల్ దీదీలు, నేలకు పరీక్షలు చేపట్టి, కావాల్సిన పోషకాలను సూచించడమే కాకుండా, ఆ తర్వాత ఆ పంటకాలం మొత్తం పంటలను పర్యవేక్షించేవారు. రైతులు తాము సూచించిన ఎరువులు వాడుతున్నారో, లేదో తెలుసుకుంటూ, వాటి ఫలితం ఎలా ఉందని ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ ఉంటారు. ఆ విధంగా రైతుల్లో నమ్మకం చూరగొన్నారు. ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో ఎన్‌జీవోలు, ఎఫ్‌పీవోల ద్వారా సాయిల్ డాక్టర్ వినియోగం ఎంతో బాగా పెరిగింది.

మహిళా సాధికారతతో...

సాయిల్ దీదీ కార్యక్రమం మహిళా సాధికారతకు దోహదపడింది. మహిళలు ఇంటి పనులకే పరిమితం కాకుండా సాయిల్ డాక్టర్ పరికరాలతో పొలాల్లో పరీక్షలు చేస్తూ ఆదాయంతో పాటు, గుర్తింపు పొందుతున్నారు. సాయిల్ దీదీలు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సొంత వ్యాపారులు చేసుకోవడానికి సౌమ్య రావత్ అవకాశం కల్పించారు. ఇలా సౌమ్య రైతులతో పాటు, మహిళల ఎదుగుదలకు కూడా తోడ్పడింది.

ప్రజలు సాధారణంగా రక్తపోటు, మధుమేహ పరీక్షలు ఎలా తరచూ చేయించుకుంటారో, రైతులు కూడా భూసార పరీక్షలు చేయించాలని, రైతుల్లో అలాంటి మార్పు తీసుకురావడమే తన లక్ష్యమని ఒక సందర్భంలో సౌమ్య రావత్ అన్నారు. దీని వల్ల రైతులకు పెట్టుబడి తగ్గడంతోపాటు ఉత్పాదకత పెరుగుతుందని, భవిష్యత్ తరాలకు సారవంతమైన నేల అందించవచ్చని ఆమె నమ్మకం.

సీలింగ్ ఫ్యాన్ స్పీడ్‌గా తిరగట్లేదా..?

ఎండాకాలంలో ఒక్కోసారి... సీలింగ్ ఫ్యాన్‌కి ఎంత స్పీడ్ పెట్టినా గాలి ఆడదు. చెమటతో చికాకుగా అనిపిస్తూ ఉంటుంది. ఇలా ఇబ్బంది పడకుండా కొన్ని చిట్కాలు పాటించి ఫ్యాన్ వేగాన్ని పెంచుకోవచ్చు.

- ఫ్యాన్ రెక్కల మీద దుమ్ము, ధూళి పేరుకుంటే ఫ్యాన్ వేగంగా తిరగలేదు. వారానికి ఒకసారి ఫ్యాన్ రెక్కలను రెండువైపులా తడి గుడ్డతో శుభ్రంగా తుడవాలి. అలాగే మోటార్ దగ్గర ఉండే బేరింగ్‌లను కూడా తుడవాలి. ఫ్యాన్ శుభ్రంగా ఉంటే గాలి వేగంగా గది అంతటా వ్యాపిస్తుంది.
- ఫ్యాన్ వేగాన్ని కెపాసిటర్ నియంత్రిస్తుంది. మోటార్‌కు కావాల్సిన శక్తిని అందిస్తుంది. కెపాసిటర్ సరిగా పని చేయని పక్షంలో ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతుంది. ఒక్కోసారి ఆగిపోవచ్చు కూడా. అంతేకాదు ఫ్యాన్ నుంచి శబ్దాలు కూడా వస్తుంటాయి. కాబట్టి కెపాసిటర్‌ను తరచూ పరీక్షిస్తూ ఉండాలి.. అవసరమైతే సమాన ఓల్టేజ్ ఉన్న కొత్త కెపాసిటర్‌ను అమరిస్తే సమస్య తీరుతుంది.
- మోటార్‌లోని బేరింగ్‌లు... ఫ్యాన్ సజావుగా తిరగడానికి తోడ్పడతాయి. వీటి మధ్య రాపిడీ పెరిగినప్పుడు ఫ్యాన్ వేగం తగ్గుతుంది. శబ్దం కూడా వస్తుంటుంది. బేరింగ్‌లకు ఎప్పటికప్పుడు లూబ్రికెంట్ ఆయిల్ వేస్తే ప్రయోజనం కనిపిస్తుంది. అవసరమైతే బేరింగ్‌లను వెంటనే మార్చుకోవాలి.
- ఇంట్లో ఓల్టేజ్ తక్కువగా ఉన్నా కూడా ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతుంది. ఇంటి వైరింగ్‌ను పరీక్షించి అవసరమైతే ఓల్టేజ్ స్టెబిలైజర్‌ను వాడడం మంచిది. సరైన ఓల్టేజ్ అందితేనే ఫ్యాన్ వేగంగా తిరుగుతుంది.
- ఫ్యాన్ రెక్కలు సమతుల స్థితిలో లేకపోయినా, అవి వంగిపోయినా, వాటిని సరిగా బిగించకపోయినా ఫ్యాన్ వేగం తగ్గుతుంది. అలాగే తిరిగేటప్పుడు ఫ్యాన్ ఎక్కువగా ఊగుతుంది. అలాంటప్పుడు వెంటనే బాగు చేయించండి.
- గది విస్తీర్ణాన్ని అనుసరించి రెక్కల పరిమాణం, మోటార్ సామర్థ్యం ఉండే ఫ్యాన్‌ని ఎంచుకుంటే గాలి చక్కగా అన్ని వైపులా ప్రసరిస్తుంది.





ఇంటికి దూరంగా ఉంటున్నారా..?

ఒక్కోసారి పై చదువుల కోసం లేదా ఉద్యోగాల నిమిత్తం వేరే ఊళ్లకి వెళ్లి అక్కడ వసతి గృహాల్లో లేదా అద్దె ఇళ్లల్లో ఉండాల్సి వస్తుంది. ఒంటరిగా ఉండడం బాధగా భయంగా అనిపిస్తుంది కూడా. ఇలా కొత్త ప్రదేశాల్లో ఉండాల్సివచ్చినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు పరిశుభ్రమైన ఆహారం ఎక్కడ దొరుకుతుందో అడిగి తెలుసుకోవాలి. తాగు నీటి నాణ్యతను పరిశీలించాలి. హాస్టల్‌లో ఉంటున్నట్లయితే అక్కడ ఆహారం వండే విధానాన్ని పరీక్షించాలి. వంటగదిలో పరిశుభ్రత పాటిస్తున్నారో లేదో తెలుసుకోవాలి.
- అత్యవసరమైన మందులను దగ్గర ఉంచుకోవాలి.
- హాస్టల్ లేదా అద్దె ఇంటి చిరునామాను కుటుంబ సభ్యులకు, దగ్గరి స్నేహితులకు తెలియజేయాలి.
- ఉంటున్న ప్రదేశానికి దగ్గరలోని ఆసుపత్రి, పోలీస్ స్టేషన్, రెస్టారెంట్, ట్రాన్స్‌పోర్ట్‌లకు సంబంధించిన ఫోన్ నెంబర్లను మొబైల్లో సేవ్ చేసి పెట్టుకోవాలి.
- వ్యక్తిగత సమాచారాన్ని తెలిపే ఆధార్ కార్డ్, ఓటర్ కార్డ్, పాన్ కార్డ్, కాలేజీ లేదా ఉద్యోగానికి సంబంధించిన ఐడెంటిటీ కార్డ్‌లను దగ్గర ఉంచుకోవాలి.
- అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవాలి. ప్రతి నెలా కొంత మొత్తాన్ని పొదుపు చేయడం అలవరచుకోవాలి.
- కొత్త ప్రదేశం అలవాటు కావడానికి సమయం పడుతుంది కాబట్టి వీలైనప్పుడల్లా పరిసరాల్లో తిరుగుతూ ఆ కాలనీ లేదా వీధి గురించి అవగాహన ఏర్పరచుకోవాలి.
- ఒంటరిగా అనిపించినప్పుడు కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు ఫోన్ లేదా వీడియో కాల్ చేసి మాట్లాడుతూ ఉండాలి.
- రూమ్‌మేట్స్ ఉన్నట్లయితే వారి గురించి పూర్తి సమాచారం తెలుసుకోవాలి. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు వాళ్లని సంప్రదించి సలహా తీసుకోవడం మంచిది.
- రాత్రి సమయాల్లో బయట ఎక్కువగా తిరగవద్దు. మొబైల్లో లొకేషన్ సెట్ చేసి పెట్టుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులకు దూరంగా ఉండాలి.

హెచ్‌సీయూ ఉన్న భూమీ సర్కారుదే!

కంచ గచ్చిబౌలి భూమి అటవీ భూమి కాదు.. 125 చెట్లను నరికిన మాట వాస్తవమే

- ఒక చెట్టుకు బదులు 5 మొక్కలు నాటుతాం
- వన్య ప్రాణుల భద్రతకు కట్టుబడి ఉన్నాం
- అభివృద్ధితో రూ.16 వేల కోట్ల పెట్టుబడులు
- 84,450 మందికి ప్రత్యక్షంగా ఉపాధి
- సుప్రీంకోర్టులో సర్కారు తుది అఫిడవిట్
- నేడు సీజేఐ ధర్మాసనం ఎదుట విచారణ

న్యూఢిల్లీ, మే 14 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూమి అటవీ భూమి కానేకాదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉన్న స్థలం కూడా ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే కంచ గచ్చిబౌలి భూమిని అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వం తుది అఫిడవిట్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, పర్యావరణ సమతుల్యం ఏమాత్రం దెబ్బతినకుండా చర్యలు తీసుకున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. గురువారం ఈ కేసు సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తన అఫిడవిట్‌లో ఆరు ప్రధాన అంశాలను స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీఐఐసీకి మాత్రమే ఈ భూమిపై సర్వ హక్కులు ఉన్నాయని తేల్చిచెప్పారు. కంచ గచ్చిబౌలి భూమిని అభివృద్ధి చేయాలనే నిర్ణయం 2024లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత, నిబంధనలకు అనుగుణంగానే తీసుకున్నామని తెలిపారు. ఈ భూమి అటవీ భూమి కానేకాదన్నారు. భూమిని అభివృద్ధి చేయడంలో ఎలాంటి చట్టాలనూ ఉల్లంఘించలేదని పేర్కొన్నారు. కంచ గచ్చిబౌలి భూమిపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని ఆయన కోరారు. ఈ భూమి మొదటి నుంచీ రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోనే ఉందన్నారు. 1954, 1955 కాస్రా పహాణీ ప్రకారం అది పూర్తిగా పోరంబోకు సర్కారీ భూమి అని స్పష్టం చేశారు. 1975లో ఈ భూమిలో హెచ్‌సీయూ ఏర్పాటుకు షరతులతో కూడిన అనుమతులు ఇచ్చిందన్నారు. యూనివర్సిటీకి ఎలాంటి హక్కులనూ బదలాయించలేదని, లీజు కూడా కుదుర్చుకోలేదని తెలిపారు. కంచ గచ్చిబౌలిలోని ప్రస్తుత భూమిలో 2003లోనే క్రీడల కోసం మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. క్రీడల మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం ఐఎంజీ భారత్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం ఎప్పుడో రద్దు చేసిందన్నారు. రద్దును సవాలు చేస్తూ ఐఎంజీ భారత్ హైకోర్టులో, సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా.. ప్రభుత్వానికే అనుకూలంగా తీర్పులు వచ్చాయని తెలిపారు. 2024 మే 23న ఐఎంజీ ప్రాజెక్టు నుంచి వైదొలగాలంటూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలను, ఆ భూమికున్న విలువను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా, చట్టప్రకారం అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ టీజీఐఐసీకి పారిశ్రామిక, ఐటీ, మౌలిక సదుపాయాల కల్పన, ప్రపంచ స్థాయి టెక్నాలజీ హబ్‌ల అభివృద్ధిలో అపారమైన అనుభవం ఉందని వివరించారు. ఈ భూమిని అభివృద్ధి చేసే ముందు అవసరమైన అనుమతులన్నీ టీజీఐఐసీ పొందిందన్నారు. ఐవీఎస్(వ్యాస్) అనే సంస్థ ద్వారా అధ్యయనం చేయించి, ఆ భూముల విలువ రూ.20,653 కోట్లుగా పేర్కొందని, దశల వారీగా భూమిని వేలం వేయాలని సూచించిందని తెలిపారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధుల సమీకరణ కోసం టీజీఐఐసీ రూ.10వేలకోట్ల లోపు బాండ్లను విడుదల చేసిన విషయం కూడా వెల్లడించారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వానికి టీజీఐఐసీ రూ.8,476 కోట్లు డిపాజిట్ చేసిన విషయాన్నీ ప్రస్తావించారు.

అటవీ భూమి కాదు.. ఆధారాలివిగో..

కంచ గచ్చిబౌలి భూమి అటవీ భూమి కానేకాదంటూ సంబంధిత ఆధారాలను తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఈ భూమి అటవీ భూమి అయి ఉంటే హెచ్‌సీయూ చేపట్టిన నిర్మాణాలన్నీ పర్యావరణ చట్టాలకు వ్యతిరేకంగానే జరిగినట్లు భావించాల్సి ఉంటుందని తెలిపింది. రెండు దశాబ్దాలుగా ఇదే భూమిని ప్రజల కోసం, అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ఉపయోగిస్తున్న విషయాన్ని వివరించింది. మినహాయింపు లేని 125చెట్లను నరికివేసిన మాట వాస్తవమేనని పేర్కొంది. వాల్టా నిబంధనల ప్రకారం తొలగించిన ప్రతి చెట్టుకు బదులుగా ఐదు మొక్కలను నాటేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. వన్యప్రాణుల భద్రత, పలు సహజ రాతి నిర్మాణాలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకున్నామని స్పష్టం చేసింది. సమీప భవిష్యత్తులో రూ.16వేలకోట్ల పెట్టుబడులు వస్తాయని, 84,450మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని వివరించింది.

ఎవరైనా.. దేశంలో ఎక్కడి నుంచైనా!

బార్లకు దరఖాస్తు చేసుకునేలా ఎక్సైజ్‌శాఖ వెసులుబాటు

జీహెచ్‌ఎంసీ పరిధిలోనే 24.. మిగతా చోట్ల 4 బార్లకు ప్రకటన

నేటి నుంచి జూన్ 6దాకా దరఖాస్తులు.. వీటి ద్వారే 100కోట్ల రాబడి

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 28బార్లు (2బీ) ఏర్పాటు చేయడానికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇటీవలే రాష్ట్రవ్యాప్తంగా 25 బార్లు ఏర్పాటు ప్రక్రియ పూర్తిచేయగా ఇప్పుడు జీహెచ్‌ఎంసీ పరిధిలోనూ 24 బార్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్, బోధన్, జల్‌పల్లి (సరూర్‌నగర్) మునిసిపాలిటీల పరిధిలో ఒక్కొక్క 2బీ బార్లకు బుధవారం ప్రకటన జారీ చేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. గతానికి భిన్నంగా ఈసారి కొత్తగా దేశంలోని ఎవరైనా దరఖాస్తు చేసేందుకు, అలాగే ఒకరు ఎన్నైనా దరఖాస్తులు చేసుకునేందుకు అధికారులు వెసులుబాటు కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా పురపాలక సంఘం, పురపాలక కార్పొరేషన్లతో పాటు గుర్తించిన పర్యటక కేంద్రాల్లో 1176 లైసెన్స్ పొందిన బార్లున్నాయి. వీటిలో దాదాపు సగం వరకు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. ఇటీవల రాష్ట్రంలో కొత్తగా 25 బార్లు ఏర్పాటుచేయగా తాజా నోటిఫికేషన్ ద్వారా మరో 28 బార్లు ఏర్పాటుకానున్నాయి. గతంలో 2బీ బార్లకు పిలిచిన దరఖాస్తులతో బార్ లైసెన్స్ పొంది ఫీజు చెల్లించకపోవడం, ఇతర కారణాలతో రద్దు చేసిన 16బార్లకు, లైసెన్స్ పొంది 90 రోజుల్లో అవసరమైన డాక్యుమెంటేషన్, ఫీజులు చెల్లించని కారణంగా రద్దయిన 12బార్ల పునరుద్ధరణకు ఎక్సైజ్‌శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. కాగా దరఖాస్తుఫారం రుసుం రూ.లక్ష ఉండగా, దాన్ని తిరిగిచ్చేది లేదని ఆ శాఖ అధికారులు స్పష్టంచేశారు. ఎక్కడి నుంచైనా.. ఎవరైనా ఒక్కరు ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చునని నోటిఫికేషన్‌లో పేర్కొనడంతో ఈసారి దరఖాస్తు ఫీజు రూపంలో రూ.100కోట్లు రావచ్చని ఆ శాఖ అధికారులు అంచనా వస్తున్నారు.








చిత్రజ్యోతి

SINCE 1965

కొత్త తేదీన కింగ్‌డమ్



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన చిత్రం 'కింగ్‌డమ్'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాయి. తొలుత ప్రకటించిన విధంగా ఈ నెల 30న ఈ చిత్రం విడుదల వ్వాల్సి ఉంది. అయితే ఇప్పుడు తేదీ మారింది. జూలై 4న కింగ్‌డమ్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ బుధవారం ప్రకటించారు. ఇటీవల దేశంలో జరిగిన ఊహించని సంఘటనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ఈ చిత్రంలో విజయ్‌కు జోడీగా భాగ్యశ్రీ బోర్సే నటించారు. సంగీతం: అనిరుధ్ రవిచందర్, ఎడిటర్: నవీన్ నూలీ, సినిమాటోగ్రఫీ: జోమోన్ టీ జాన్, గిరీశ్ గంగాధరన్.

ఆ ప్రశ్నను రేకెత్తించే చిత్రమే 23



"ఒకే తరహా నేరం చేసిన వ్యక్తుల్లో ఒకరికి తక్కువ శిక్ష ఎందుకు పడుతుంది? మరొకరికి ఎక్కువ శిక్ష ఎందుకు పడుతుంది? వారిలో ఒకరికి 24 గంటల్లో బెయిల్ వస్తుంది? అదే తప్పు చేసిన మరొకరికి రెండేళ్లయినా బెయిల్ దొరకదు. ఇలా ఎందుకు జరుగుతుంది? చట్టం అందరికీ సమానం అన్నప్పుడు అందరికీ ఒకేలా వర్తించాలి కదా. కానీ అలా జరగడం లేదు. దీన్ని ఎవరో ఒకరు ప్రశ్నించాలి. జనాల్లో అలాంటి ఒక ప్రశ్నను రేకెత్తించే చిత్రమే "23" అని దర్శకుడు రాజ్ ఆర్ అన్నారు. 'మల్లేశం', 8 ఏఎం మెట్రో చిత్రాలతో ఆయన ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా రాజ్ ఆర్ తెరకెక్కించిన తాజా చిత్రం '23'. వెంకట్ సిద్ధారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా స్టూడియో 99 నిర్మించింది. తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. ఈ నెల 16న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాజ్ ఆర్ మీడియాతో మాట్లాడారు. 'కొన్ని దశాబ్దాల క్రితం చిలకలూరిపేట, చుండూరు, జూబ్లీహిల్స్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా అల్లుకున్న కథతో '23' చిత్రాన్ని తెరకెక్కించాను. తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పే. ఆ ఘటనల వల్ల ఎన్నో జీవితాలు నాశనం అయ్యాయి. చాలా కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ఆ మూడు సంఘటనలకూ ఓ ప్రేమజంటకూ ఉన్న సంబంధం ఏమిటి అనేది కథలో ఆసక్తికరంగా ఉంటుంది. కథాపరంగా ఇది కొంచెం టఫ్ సబ్జెక్ట్. ఏకాగ్రతతో చూడాల్సిన సినిమా ఇది. ఇందులో నటీనటులంతా అద్భుతంగా నటించారు. ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని రాజ్ ఆర్ అన్నారు.


కథ నుంచి వచ్చిన టైటిల్



"లెవన్' కథ నాకు బాగా నచ్చింది. కథ విని ఉద్వేగానికి లోనయ్యా. ఇందులో పోలీసులు హంతకుణ్ణి పట్టుకునేందుకు సాగించే అన్వేషణ నవ్య పంథాలో ఉంటుంది. ప్రేక్షకులు ఆశించే అంశాలతో సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది' అని నవీన్‌చంద్ర అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'లెవన్'. లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో అజ్మల్‌ఖాన్, రేయా హరి నిర్మించారు. ఈ నెల 16న విడుదలవుతున్న సందర్భంగా నవీన్‌చంద్ర సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- ఒక సైకో కిల్లర్ చేసే హత్యల నేపథ్యంలో అల్లుకున్న ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కింది. 'లెవన్' అనేది కథ నుంచి వచ్చిన టైటిల్. దానికి కథలో ఉన్న ప్రాముఖ్యం ఏవిటో సినిమా చూస్తే తెలుస్తుంది. ప్రీమియర్స్ చూసిన ప్రేక్షకులు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. కథలో మలుపులు, ప్రేక్షకులను ఎగ్జైట్ చేశాయి. ఇప్పటివరకూ ఏ థ్రిల్లర్‌లోనూ రాని ఒక డిఫరెంట్ ఎమోషనల్ కాన్సెప్ట్ ఈ సినిమాలో ఉంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. నిర్మాతలు ఖర్చుకు వెనుకాడలేదు. విజువల్స్ పరంగా ఓ కమర్షియల్ సినిమా చూస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. ఈ సినిమా తమిళ వెర్షన్‌లోనూ నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. నటుడిగా అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువవ్వాలనేది నా ప్రయత్నం. అందుకే విభిన్న పాత్రలు చేస్తున్నాను. ప్రస్తుతం 'హనీ', 'కాళీ' చిత్రాలతో పాటు రవితేజ చిత్రంలో విలన్ పాత్ర చేస్తున్నాను.

తెలుగులో 'కేసరి: ఛాప్టర్ 2'



అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా నటించిన బాలీవుడ్ చిత్రం 'కేసరి: ఛాప్టర్ 2'. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం హిందీ బెల్ట్‌లో చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. కరణ్ సింగ్ త్యాగి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఆర్. మాధవన్, అనన్యపాండే కీలక పాత్రలు పోషించారు. ఇప్పుడు ఈ చిత్రం తెలుగు వెర్షన్ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ చిత్రం తెలుగు హక్కులు దక్కించుకుంది. ఈ నెల 23న ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నట్లు సురేశ్ ప్రొడక్షన్స్ తెలిపింది. జలియన్ వాలాబాగ్ హత్యాకాండ తర్వాత బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన న్యాయవాది సి. శంకరన్ నాయర్ జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది.

సినిమా టికెట్ రేట్ల ఖరారుపై కమిటీ



ఏపీలో సినిమా టికెట్ల ధరలను పునః పరిశీలించి ఖరారు చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. సినీ నిర్మాత వివేక్ కూచిభొట్ల చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో హోం, ఫైనాన్స్, సమాచార, ప్రసార శాఖ ముఖ్య కార్యదర్శులు, లా సెక్రటరీ సభ్యులుగా ఉంటారు. వారితో పాటు చిత్ర నిర్మాత వివేక్ కూచిభొట్లకు కూడా ఈ కమిటీలో సభ్యుడిగా అవకాశం దక్కింది. గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన టికెట్ ధరల జీవో 35తోపాటు జీవో 13పైనా ఎగ్జిబిటర్లు, సినీ నిర్మాతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించారు. వైసీపీ ప్రభుత్వ వివాదాస్పద జీవోలు, కోర్టులో పిటిషన్లు, ప్రేక్షకుల అభిప్రాయాలు, ఎగ్జిబిటర్ల వినతులు, సినీ పరిశ్రమ పెద్దల సూచనలు పరిగణలోకి తీసుకుని సమగ్ర నివేదిక సమర్పించాలని ప్రభుత్వం కమిటీకి బాధ్యత అప్పగించింది. ఈ నివేదిక ఆధారంగా రాష్ట్రంలో సినిమా టికెట్ల ధరలపై ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకోనుంది.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్



విజయ్ ఆంటోని కథానాయకుడిగా స్వీయ నిర్మాణంలో రూపొందిస్తున్న చిత్రం 'మార్గన్'. ఆయన సతీమణి మీరావిజయ్ ఆంటోని సమర్పిస్తున్నారు. ఈ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్‌ను లియోజాన్ పాల్ తెరకెక్కిస్తున్నారు. విజయ్ ఆంటోని మేనల్లుడు అజయ్ ధీషన్ ఈ సినిమాతో పరిచయమౌతున్నారు. సముద్రఖని, మహానటి శంకర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి ఆదరణ లభించింది. తాజాగా. ఈ సినిమాను జూన్ 27న విడుదల చేస్తున్నట్లు ప్రకటిస్తూ ఓ నూతన పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సినిమా అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటుందని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: యువ.ఎన్.ఎస్, సంగీతం: విజయ్ ఆంటోని.

కేన్స్‌లో మెరిసిన ఊర్వశి.. డ్రెస్‌పై విమర్శలు



కేన్స్ 78వ చిత్రోత్సవం ఇటీవలె అట్టహాసంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ వేడుకల్లో మొదటిరోజున ప్రధానాకర్షణగా నిలిచారు ఊర్వశీ రౌతేలా. రంగురంగుల గౌనును ధరించడంతో పాటు చిలుక ఆకారంలో ఉండే ఓ ఆకర్షణీయమైన బ్యాగుతో రెడ్ కార్పెట్‌పై సందడి చేశారామె. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. లుక్ బాగుందంటూ కొందరు ఊర్వశిని ఆకాశానికెత్తేస్తుండగా, మరి కొందరు ఆమెను కాపీ క్యాట్ అంటూ విమర్శిస్తున్నారు. దీనికి కారణం, 2018లో ఐశ్వర్యా రాయ్ ధరించిన గౌనూ.. ఊర్వశి ధరించిన డ్రెస్ ఒకేలా కనిపించడమే. ఈ ఏడాది జరిగే కేన్స్ వేడుకల్లో భారత్ నుంచి ఐశ్వర్యారాయ్, జాన్వీ కపూర్, షర్మిలా ఠాగూర్ తదితరులు రెడ్ కార్పెట్‌పై హొయలొలికించనున్నారు. కాగా, ఈ నెల 24న విజేతలను ప్రకటిస్తారు.

యూపీలో హెచ్‌సీఎల్- ఫాక్స్‌కాన్ సెమీకండక్టర్ ప్లాంట్

న్యూఢిల్లీ: హెచ్‌సీఎల్ గ్రూప్ సెమీకండక్టర్ల రంగంలోకి ప్రవేశిస్తోంది. తైవాన్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్‌తో కలిసి రూ.3,706 కోట్ల పెట్టుబడితో ఇందుకోసం ఉత్తరప్రదేశ్‌లోని జేవార్ వద్ద ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతోంది. ఇందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపినట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 2027 కల్లా ఉత్పత్తి ప్రారంభించే ఈ ప్లాంట్ ద్వారా 2,000 మందికి ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయన్నారు. ఈ ప్లాంటులో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఆటోమొబైల్స్‌లో వినియోగించే డిస్‌ప్లే డ్రైవర్ చిప్స్ తయారవుతాయని చెప్పారు.

జెన్‌సోల్‌పై ఇరెడా దివాలా పిటిషన్

న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు రుణాలిచ్చే ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఇరెడా).. జెన్‌సోల్ ఇంజనీరింగ్‌పై దివాలా కేసు వేసింది. రూ.510 కోట్ల రుణాల తిరిగి చెల్లింపుల్లో విఫలమైనందుకు గాను జెన్‌సోల్‌పై దివాలా పరిష్కార చర్యలు చేపట్టాలంటూ జాతీయ కంపెనీల చట్టం ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కు పిటిషన్ సమర్పించినట్లు ఇరెడా వెల్లడించింది. ఒకవేళ ఎన్‌సీఎల్‌టీ ఈ పిటిషన్‌ను ఆమోదిస్తే, జెన్‌సోల్ రుణదాతలంతా తమ బకాయిలను క్లెయిమ్ చేసుకునేందుకు కోర్టు నియమిత దివాలా పరిష్కార నిపుణుడికి వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. ప్రమోటర్లు పెద్దఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడటంతో జెన్‌సోల్ ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలోకి జారుకుంది.

13 నెలల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ:టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) దిగొస్తోంది. ఏప్రిల్‌లో డబ్ల్యూపీఐ 13 నెలల కనిష్ఠ స్థాయి 0.85 శాతానికి పడిపోయింది. ఆహార, ఇంధనం, తయారీ వస్తువుల ధరలు తగ్గడమే ఇందుకు ప్రధాన కారణంగా ఉంది.

హైదరాబాద్ 'రక్షణ' కంపెనీల హవా

» ఆపరేషన్ సిందూర్‌తో ఆర్డర్ల వెల్లువ

» వారం వారం సరఫరాలు షురూ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): 'ఆపరేషన్ సిందూర్'తో హైదరాబాద్‌లో ఉన్న రక్షణ రంగంలోని కంపెనీలకు ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ రంగంలోని డీఆర్‌డీఓ, బీడీఎల్, బీఈఎల్‌తో పాటు ప్రైవేట్ రంగంలోని ఎంటార్ టెక్నాలజీస్, అదానీ ఎల్బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, అస్ట్రా మైక్రోవేవ్, కల్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, అనంత్ టెక్నాలజీస్, రఘవంశీ, జెన్ టెక్నాలజీస్ వంటి కంపెనీలకు సైనిక దళాల నుంచి పెద్దఎత్తున ఆర్డర్లు వస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో ఈ కంపెనీలు తయారు చేసిన ఆయుధాలు, ఆయుధ విడిభాగాలు తమ సత్తా చాటాయి. దీంతో రక్షణ మంత్రిత్వ శాఖ ఈ కంపెనీల నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి కొనుగోలు చేసి నిల్వ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం పాక్‌తో కాల్పుల విరమణ కుదిరినా, అది తాత్కాలికమేనని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ముందు జాగ్రత్తగా పెద్దఎత్తున బ్రహ్మోస్, ఆకాశ్ వంటి క్షిపణులు, డ్రోన్లను పెద్దఎత్తున కొనుగోలు చేసి నిల్వ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

శరవేగంగా సరఫరాలు

గతంలో సైనిక దళాల నుంచి వచ్చిన ఆర్డర్లను కంపెనీలు ఆరు నెలల నుంచి ఏడాదిలోపు పూర్తి చేసేందుకు గడువు ఇచ్చేవారు. ఇప్పుడు కొద్ది నెలల్లోనే సరఫరాలు పూర్తి చేయాలని సైనిక దళాలు కోరుతున్నాయి. దీంతో వారాంతాల్లో కూడా పని చేస్తూ, ఏ వారానికి ఆ వారం సరఫరాలు చేయాల్సి వస్తోందని బ్రహ్మోస్, ఆకాశ్ మిస్సైల్స్, డ్రోన్లకు అవసరమైన కీలక విడిభాగాలు సరఫరా చేసే ఒక కంపెనీ అధినేత చెప్పారు.

మరిన్ని ఆర్డర్లు

ఇక భారత్‌లో ఎక్కడ ఉగ్ర దాడి జరిగినా దాన్ని పాక్ ప్రభుత్వ దాడిగానే పరిగణిస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. ఇదే సమయంలో కీలక రక్షణ స్థావరాలు, మౌలిక సదుపాయాల రక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందుకు అవసరమైన డ్రోన్లు, యాంటీ డ్రోన్ వ్యవస్థల కొనుగోళ్లపై ఉన్నత సైనికాధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. దీంతో వచ్చే రెండు మూడు నెలల్లో మరిన్ని ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందని యాంటీ డ్రోన్ల వ్యవస్థలను తయారు చేసే ఒక కంపెనీ అధినేత చెప్పారు. పాక్ సైన్యం నుంచి గతంలోలా భూతలం నుంచి నుంచి కాకుండా ఇక గగనతలం నుంచే అసలు ముప్పు ఉంటుందని నిపుణులు హెచ్చరించడం ఇందుకు కారణంగా కనిపిస్తోంది.

ఎంటార్‌కు రూ.34 కోట్ల ఆర్డర్

ఎంటార్ టెక్నాలజీస్ సంస్థ కొత్తగా రూ.34 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకుంది. ఈ ఆర్డర్ కింద ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా ఏరోస్పేస్, కాలుష్య రహిత ఇంధన రంగాలకు కీలకమైన ఇంజనీరింగ్ ఉత్పత్తులు సరఫరా చేయబోతున్నట్టు కంపెనీ తెలిపింది.



బీమా వ్యాపారంలోకి అపోలో 24/7

త్వరలో కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డు విడుదల

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ కంపెనీ అనుబంధ సంస్థ, డిజిటల్ హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్ అపోలో 24/7.. బీమా డిస్ట్రిబ్యూషన్ వ్యాపారం, క్రెడిట్ కార్డ్ విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా త్వరలోనే ఆరోగ్య, జీవిత, సాధారణ బీమా ఉత్పత్తుల విక్రయం, డిస్ట్రిబ్యూషన్ కార్యకలాపాలను ప్రారంభించనున్నట్లు అపోలో హెల్త్ కంపెనీ సీఈఓ మాధివానన్ బాలకృష్ణన్ వెల్లడించారు. బుధవారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. బీమా ఉత్పత్తులకు సంబంధించి అపోలో 24/7 కార్పొరేట్ ఏజెంట్‌గా వ్యవహరించేందుకు ఇప్పటికే అవసరమైన రెగ్యులేటరీ అనుమతులు అందుకుందని ఆయన వివరించారు. ఇప్పటికే 8 బీమా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నామని, ఇందులో 4 ఆరోగ్య బీమా సంస్థలని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లో మరో 4 కంపెనీలతో జట్టు కట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బీమా వ్యాపారం ప్రారంభించిన ఏడాది కాలంలో లక్ష పాలసీల విక్రయం, రూ.80-రూ.100 కోట్ల ప్రీమియం ఆదాయం ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బాలకృష్ణన్ వెల్లడించారు. అపోలో 24/7 12 కోట్ల మందితో పటిష్ఠమైన యూజర్ బేస్ కలిగి ఉందని, బీమా డిస్ట్రిబ్యూషన్ వ్యాపార విస్తరణకు ఇది ఎంతగానో తోడ్పడనుందని ఆయన చెప్పారు.

క్రెడిట్ కార్డ్ విభాగంలోకి అడుగు

అపోలో 24/7 క్రెడిట్ కార్డ్ విభాగంలోకి అడుగు పెడుతోందని బాలకృష్ణన్ వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రముఖ క్రెడిట్ కార్డ్ కంపెనీతో కలిసి కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్‌ను వచ్చే పదిహేను రోజుల్లో విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఔషధాలు, డయాగ్నోస్టిక్స్ సేవలు, డాక్టర్ కన్సల్టేషన్, వెల్‌నెస్ సర్వీసులపై ప్రత్యేక బెనిఫిట్స్‌ను ఈ కార్డు ద్వారా అందించనున్నట్లు ఆయన తెలిపారు. కాగా అపోలో 24/7 ప్లాట్‌ఫామ్ ద్వారా ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేకంగా అల్టిమేట్ హెల్త్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు బాలకృష్ణన్ వెల్లడించారు.

అంతర్జాతీయ లైఫ్ సైన్సెస్ కంపెనీల హబ్‌గా హైదరాబాద్

సీబీఆర్ఈ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీవ శాస్త్రాలు (లైఫ్ సైన్సెస్), ఆ రంగాలకు చెందిన తయారీ కంపెనీల కేంద్రంగా హైదరాబాద్ ఎదుగుతోంది. హైదరాబాద్ సమీపంలోని జీనోమ్ వ్యాలీలో ఇప్పటికే 18 దేశాలకు చెందిన 200కుపైగా బయోటెక్, ఫార్మా కంపెనీలు కొలువుతీరాయి. బయోటెక్ రంగానికి చెందిన టాప్-10 పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కంపెనీల్లో ఆరు కంపెనీలు ఇప్పటికే జీనోమ్ వ్యాలీలో తమ యూనిట్లు ఏర్పాటు చేశాయి. రియల్ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ సీబీఆర్ఈ 'గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్' పేరుతో విడుదల చేసిన నివేదికలో ఈ విషయం తెలిపింది. అంతేకాకుండా 20కి పైగా లైఫ్ సైన్సెస్, మెడికల్ టెక్నాలజీ ఇంక్యుబేటర్స్ ఇక్కడ ఉన్నాయని పేర్కొంది. కాగా గత ఏడాది భారత్‌లో లైఫ్ సైన్సెస్ సంస్థలు లీజుకు తీసుకున్న స్థూల కార్యాలయ స్థలం 56 శాతం వృద్ధితో 58 లక్షల చదరపు అడుగులకు చేరుకుందని సీబీఆర్ఈ తెలిపింది. ఇందులో హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ 200కు పైగా గ్లోబల్ బయోటెక్, ఫార్మా కంపెనీలతో కీలకంగా ఉందని పేర్కొంది. అంతేకాకుండా ఆసియా పసిఫిక్ రీజియన్‌లో లైఫ్ సైన్సెస్ ఆర్ అండ్ డీ కేంద్రాల్లో హైదరాబాద్, బీజింగ్, షాంఘై, గ్రేటర్ టోక్యో కీలకంగా ఉన్నాయని సీబీఆర్ఈ నివేదిక వెల్లడించింది. కాగా ప్రతిపాదిత ఫార్మా సిటీ, మెడికల్ డివైజెస్ పార్కులతో ఈ రంగంలో హైదరాబాద్ మరింత దూసుకుపోతుందని తెలిపింది.

ఏజీఐ గ్రూప్‌తో స్టాండర్డ్ గ్లాస్ ఒప్పందం

గ్లాస్-లైన్డ్ షెల్, ట్యూబ్ హీట్ ఎక్స్ఛేంజర్స్ తయారీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్‌జీఎల్‌టీఎల్).. జపాన్‌కు చెందిన ఏజీఐ గ్రూప్, దాని అనుబంధ సంస్థ జీఎల్ హక్కోతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. ఈ ఒప్పంద కాలపరిమితి 20 సంవత్సరాలని తెలిపింది. ఒప్పందంలో భాగంగా జీఎల్ హక్కోకు చెందిన గ్లాస్-లైన్డ్ షెల్, ట్యూబ్ హీట్ ఎక్స్ఛేంజర్స్‌ను భారత్‌లో తయారు చేయటంతో పాటు మార్కెట్ చేయనున్నట్లు స్టాండర్డ్ గ్లాస్ తెలిపింది. ఇప్పటి వరకు ఈ స్పెషలైజ్డ్ పరికరాలను పూర్తిగా దిగుమతి చేసుకుంటూ వస్తున్నామని, భారత్‌లో తొలిసారిగా స్టాండర్డ్ గ్లాస్ వీటి తయారీ, విక్రయాలను చేపడుతోందని సంస్థ ఎండీ నాగేశ్వర రావు తెలిపారు. ఏజీఐ, జీఎల్ హక్కోతో కుదుర్చుకున్న ఒప్పందం తమకే కాకుండా భారత ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు ఎంతో మేలు చేకూర్చనుందన్నారు. గ్లాస్-లైన్డ్ షెల్, హీట్ ఎక్స్ఛేంజర్స్‌కు అంతర్జాతీయంగా 200 కోట్ల డాలర్ల మార్కెట్ ఉండగా.. ఒక్క భారత్‌లోనే రూ.2,000 కోట్ల మార్కెట్ ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం నాటికి హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త ప్లాంట్‌లో ప్రతి నెల 200 యూనిట్ల సామర్థ్యంతో ఈ ఉత్పత్తుల తయారీని చేపట్టాలని చూస్తున్నట్లు నాగేశ్వర రావు తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	515
వరంగల్	507	గోదావరి	505
చిత్తూరు	593	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	119
వరంగల్	115	గుంటూరు	122
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	105
కర్నూలు	115	నెల్లూరు	110
విశాఖపట్నం	116	అనంతపురం	110
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	96,060 ▲	88,050 ▲	1,09,000 ▼
విజయవాడ	96,250 ▼	90,000 ▼	99,400 ▼
విశాఖపట్నం	96,600 ▼	88,050 ▼	1,09,000 ▼
రాజమండ్రి	96,050 ▼	88,050 ▼	99,400 ▲
ప్రొద్దుటూరు	95,800 ▲	88,140 ▲	98,500 ▼
ముంబై	93,859 ▼	85,975 ▼	96,400 ▼

ఒడుదుడుకుల్లోనూ లాభాలొచ్చాయ్..

» 182 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

» రూ.4 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: దేశీయ మార్కెట్ సూచీలు బుధవారం తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ లాభాలు నమోదు చేశాయి. గత నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 6 ఏళ్ల కనిష్ఠ స్థాయి 3.16 శాతానికి తగ్గడం, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడులు కొనసాగడంతో పాటు మెటల్, ఇండస్ట్రియల్ రంగ షేర్లలో భారీగా కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్ 182.34 పాయింట్ల వృద్ధితో 81,330.56 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 88.55 పాయింట్ల లాభంతో 24,666.90 వద్ద ముగిసింది. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.79 లక్షల కోట్లు పెరిగి రూ.434.89 లక్షల కోట్లకు (5.10 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

ఆసియా మార్కెట్లలో భారత్ భేష్

భారత్ జపాన్‌ను వెనక్కి నెట్టి ఆసియాలో అత్యంత ప్రాధాన్య ఈక్విటీ మార్కెట్‌గా నిలిచింది. బ్యాంక్ ఆఫ్ అమెరికా తాజాగా నిర్వహించిన ఆసియా ఫండ్ మేనేజర్ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. సర్వేలో పాల్గొన్న ఫండ్ మేనేజర్లలో 42 శాతం భారత ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులకు మొగ్గుచూపారు. ఈ విషయంలో జపాన్ రెండో స్థానానికి జారుకోగా.. గత నెల అట్టడుగు స్థాయిలో నిలిచిన చైనా మళ్లీ మూడో స్థానానికి ఎగబాకింది.

రక్షణ షేర్లలో కొనసాగిన ర్యాలీ

భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ జరిగినప్పటికీ రక్షణ రంగ షేర్లలో బుల్ ర్యాలీ కొనసాగుతోంది. బుధవారం ట్రేడింగ్‌లో మిశ్ర ధాతు నిగమ్ (మిధానీ) స్టాక్ ఏకంగా 15.12 శాతం ఎగబాకింది. యాక్సిస్‌కేడ్స్ టెక్నాలజీస్ 5 శాతం, పారస్ డిఫెన్స్ 4 శాతం లాభపడ్డాయి. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ 3.47 శాతం, డేటా ప్యాటర్న్స్ 2.93 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 2.56 శాతం, అస్ట్రా మైక్రోవేవ్ ప్రొడక్ట్స్ 2.26 శాతం, భారత్ డైనమిక్స్ 1.16 శాతం పుంజుకున్నాయి. డ్రోన్ తయారీదారుల్లో ద్రోణాచార్య ఏరియల్ ఇన్నోవేషన్స్ 2 శాతం, ఐడియాఫోర్జ్ టెక్నాలజీ 0.86 శాతం పెరిగాయి.



శాట్.. ఏదీ జోష్?

● చరిత్రాత్మక బడ్జెట్ ఇచ్చినా కనిపించని ఉత్సాహం
● ఐదేళ్లుగా తయారీలోనే స్పోర్ట్స్ పాలసీ
● విదేశీ పర్యటనలు, అధ్యయనాలతోనే సరి
● సరిపడా కోచ్‌లు లేక కుంటుపడిన శిక్షణ

స్వతహాగా క్రీడాకారుడైన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక క్రీడారంగానికి కొంత ఊపు వచ్చింది. గచ్చిబౌలిలోని ఫుట్‌బాల్ స్టేడియం ఆధునికీకరణతో పాటు ఫిఫా ఇంటర్ కాంటినెంటల్ కప్, హాకీ, కరాటే జాతీయ స్థాయి పోటీలను కూడా నిర్వహించారు. చరిత్రలో కూడా ఎన్నడూ లేని విధంగా రూ.465 కోట్ల బడ్జెట్ ఇచ్చిన తర్వాత రాష్ట్ర క్రీడారంగాన్ని పరుగులు పెట్టించాల్సిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) మాత్రం సీఎం ఆశయాలకు తగ్గట్టుగా పనిచేయడంలో విఫలమవుతోంది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, స్పోర్ట్స్ పాలసీ రూపకల్పన, క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రణాళికబద్ధంగా 'శాట్' ముందుకు వెళ్లలేకపోతోంది.

తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తయారు చేస్తామన్న గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం కొత్త స్పోర్ట్స్ పాలసీని కూడా తయారు చేయకుండా ప్రకటనలతోనే కాలం గడిపేసింది. ఇక ఇప్పుడు క్రీడాశాఖ కూడా సీఎం రేవంత్ వద్దే ఉండడంతో కిందటి ఏడాది సుమారు రూ.330 కోట్లు, ఈసారి తెలంగాణ చరిత్రలోనే ఎన్నడు లేని విధంగా రూ.465 కోట్ల చరిత్రాత్మక బడ్జెట్‌ను కేటాయించారు. అయినా క్రీడారంగాన్ని గాడిన పెట్టేందుకు అవసరమైన విధానపరమైన నిర్ణయాలను తీసుకోవడంలో 'శాట్' మీనమేషాలను లెక్కిస్తోంది.

కొత్త స్పోర్ట్స్ పాలసీకి ఇంకెన్నేళ్లు?: గత ప్రభుత్వం 2021లో ఒడిశాకు చెందిన ఒక స్పోర్ట్స్ కన్సల్టెన్సీకి కొత్త క్రీడా పాలసీని రూపొందించే బాధ్యతను రూ.1.30 కోట్లకు అప్పగించింది. నాలుగేళ్లు గడుస్తున్నా స్పోర్ట్స్ పాలసీ వ్యవహారం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే తీరున ఉంది. బీఆర్ఎస్ సర్కార్ ఈ పాలసీ రూపకల్పనకు కేబినెట్ సబ్‌కమిటీ వేసినా కూడా వారి పాలనలో ఈ వ్యవహారం కొలిక్కి రాలేదు. కాంగ్రెస్ సర్కార్ వచ్చాక రాష్ట్రంలోని క్రీడా నిపుణులు, దిగ్గజ క్రీడాకారులు, ప్రముఖ కోచ్‌లు, క్రీడా సంఘాలతో పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, పాలసీ రూపకల్పనకు ప్రభుత్వ క్రీడా సలహాదారుడు ఏపీ జితేందర్ రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి విదేశీ పర్యటనలు కూడా చేశారు. భువనేశ్వర్, బళ్లారితో పాటు ఆస్ట్రేలియాలోని ప్రఖ్యాత క్రీడా సముదాయాలను, విశ్వవిద్యాలయాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు కూడా సమర్పించారు. అయినా ఇప్పటికీ స్పోర్ట్స్ పాలసీ రూపకల్పనను పూర్తి చేయలేకపోవడంపై క్రీడాకారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

ముసాయిదాలో కనిపించని కొత్తదనం..: కొన్ని నెలల కిందట క్రీడా ప్రముఖుల ముందు శాట్ ఉంచిన ముసాయిదా స్పోర్ట్స్ పాలసీలో కొత్తదనమేమీ కనిపించలేదనే అభిప్రాయాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టార్గెట్ ఒలింపిక్స్ పోడియం స్కీమ్ (టాప్స్) వల్ల ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు నెలవారి ఉపకార వేతనంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ తీసుకోగలుగుతున్నారు. అలాంటి పథకం రాష్ట్రంలోనూ అమలు చేయాలనే వాదన బలంగా వినిపిస్తోంది. ప్రధానంగా ఒలింపిక్స్ సన్నద్ధతలో టాప్-10లో ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి ఉపకార వేతనంతో పాటు మెరుగైన శిక్షణకయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించాలని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

జాతీయ క్రీడల్లో 26వ స్థానంలో తెలంగాణ..: తెలంగాణ కంటే క్రీడారంగంలో వెనుకబడి ఉన్న రాష్ట్రాలు కూడా ఈ ఏడాది ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబర్చాయి. తెలంగాణ మాత్రం 18 మెడల్స్‌తో 26వ స్థానంలో పతకాల పట్టికలో వెనుకంజ వేసింది. ఇందుకు ప్రధాన కారణం క్రీడాకారులను సన్నద్ధం చేయడంలో శాట్ వద్ద సరైన ప్రణాళిక లేకపోవడమే. కోచ్‌లు, ప్రభుత్వ స్పోర్ట్స్ అకాడమీల పనితీరును పరిశీలించే వారు లేకపోవడం, స్పోర్ట్స్ స్కూళ్ల నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో ఇతర రాష్ట్రాలతో తెలంగాణ పోటీ పడలేకపోతుంది.

నామమాత్రంగా సీఎం కప్ నిర్వహణ..: తమిళనాడుతో సహా పలు రాష్ట్రాలు భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి ఏటా సీఎం కప్‌ను నిర్వహిస్తుంటే రాష్ట్రంలో మాత్రం నామ మాత్రంగా మమ అనిపించారు. రాష్ట్రంలో కిందటి ఏడాది నిర్వహించిన సీఎం కప్‌లో విజేతలుగా నిలిచిన ప్లేయర్లకు ఇప్పటికీ నగదు ప్రోత్సాహకాలు అందలేదు. సీఎం కప్‌లో సత్తా చాటిన క్రీడాకారుల సర్టిఫికెట్లు, పతకాలను విద్యా, ఉద్యోగ ప్రవేశాల్లో పట్టించుకోవడం లేదు. ఇతర రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోని పతకాలకు, సర్టిఫికెట్లకు ఉద్యోగ, విద్యా ప్రవేశాల్లో స్పోర్ట్స్ మెరిట్ పాయింట్లు కేటాయించినట్టే సీఎం కప్‌ను కూడా ఆ జాబితాలో చేర్చాలని క్రీడాకారులు కోరుతున్నారు. శాట్‌కు పాలక మండలి లేకపోవడం వల్ల విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. దిగ్గజ క్రీడాకారులతో పాటు ప్రముఖ కోచ్‌లు, క్రీడా రంగ నిపుణులకు చోటు కల్పించి వారి సూచనలు, సలహాలను, అనుభవాన్ని ఉపయోగించుకుంటే రాష్ట్ర క్రీడారంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించవచ్చునని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సరిపడా కోచ్‌లేరి?

స్పోర్ట్స్ అథారిటీ ఉనికికి, మనుగడకు మూల స్తంభమైన కోచ్‌లకు మాత్రం శాట్‌లో ప్రాధాన్యత లేకుండా పోయింది. కనీస యంత్రాంగం లేక శాట్ కొట్టుమిట్టాడుతోంది. ప్రస్తుతమున్న ఆరుగురు రెగ్యులర్ కోచ్‌ల్లో ఐదుగురు మరో రెండేళ్లలో పదవీ విరమణ చేయనున్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న మరో 130 మంది కోచ్‌లతోనే శాట్ నెట్టుకొస్తోంది. ఇందులో జంట నగరాల్లోనే సుమారు 60 మంది కోచ్‌లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ లెక్కన కనీసం నియోజకవర్గానికి ఒక్క కోచ్ కూడా లేని దుస్థితిలో శాట్ ఉంది. 33 జిల్లాలకు శాట్ నుంచి జిల్లా క్రీడాధికారులను కూడా నియమించుకోలేక ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులకు అదనపు బాధ్యతలను ఇస్తూ తూతూ మంత్రంగా నడిపిస్తోంది. నిష్ణాతులైన ఎన్ఐఎస్ కోచ్‌లు లేక రాష్ట్రంలో క్రీడాకారులకు సరైన శిక్షణ అందడం లేదు. శాట్‌లో మూడు దశాబ్దాలకు పైగా సేవలందిస్తున్న కాంట్రాక్టు కోచ్‌ల క్రమబద్ధీకరణతో పాటు కనీసం 500ల మంది కొత్త కోచ్‌లను విధుల్లోకి తీసుకుంటే తప్ప శాట్ గాడిన పడదని తెలుస్తోంది.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

నీరజ్.. ఇక లెఫ్టినెంట్ కల్నల్



న్యూఢిల్లీ: దేశ ప్రాదేశిక సైన్యంలో సుబేదార్ మేజర్‌గా పని చేస్తున్న స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు భారత ఆర్మీ.. గెజిట్‌ను విడుదల చేసింది. శుక్రవారం నుంచి దోహాలో డైమండ్ లీగ్ ప్రారంభమవనున్న తరుణంలో ఈ ఉత్తర్వులు రావడం నీరజ్‌లో మరింత స్ఫూర్తి నింపనుంది. టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడంతో పాటు క్రీడా రంగంలో నీరజ్ చోప్రా కనబరిచిన విశిష్ట ప్రతిభను గుర్తించి పదోన్నతి కల్పించినట్టు మిలటరీ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి, మేజర్ జనరల్ జీఎస్ చౌధురి తెలిపారు. 2016లో నయిబ్ సుబేదార్‌గా సైన్యంలో చేరిన నీరజ్, 2021లో విశిష్ట సేవా పతకంతో పాటు సుబేదార్‌గా పదోన్నతి పొందాడు. 2022లో పరమ విశిష్ట సేవా పతకాన్ని అందుకోగా.. గత ఏడాది సుబేదార్ మేజర్‌గా నీరజ్‌కు పదోన్నతి లభించడం తెలిసిందే.

ఓర్లెన్ బరిలో చోప్రా

ఓర్లెన్ జానస్ కుసొసిన్స్కీ స్మారక పోటీల్లో నీరజ్ చోప్రా బరిలోకి దిగుతున్నాడు. ఈనెల 23 నుంచి జరిగే ఈ పోటీలకు పోలెండ్‌లోని చోర్జోవ్ ఆతిథ్యమివ్వనుంది. వాస్తవానికి ఈనెల 24 నుంచి బెంగళూరులో జరిగే ఎన్‌సీ క్లాసిక్ టోర్నమెంట్‌లో నీరజ్ పాల్గొనాల్సి ఉంది. అయితే, భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఈ పోటీలు వాయిదా పడ్డాయి.

'ఏ ప్లస్'లోనే రోహిత్, విరాట్

బీసీసీఐ కార్యదర్శి సైకియా



న్యూఢిల్లీ : రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించారు. అయితే వీరిద్దరూ వన్డేలలో కొనసాగనున్నారు. సుదీర్ఘ ఫార్మాట్‌కు ఇటీవల వీడ్కోలు పలికిన వీరిద్దరు..గత జూన్‌లో టీ20లకు గుడ్‌బై చెప్పిన విషయం విదితమే. ఈనేపథ్యంలో రోహిత్, విరాట్ బీసీసీఐ వార్షిక కేంద్ర కాంట్రాక్టులలో ఎ+కేటగిరీలోనే కొనసాగిస్తారా..లేదా..అనే చర్చ మొదలైంది. గత నెలలో ప్రకటించిన 2024-25 కాంట్రాక్టుల జాబితాలో రోహిత్, కోహ్లీలను ఎ+గ్రేడ్‌లో బీసీసీఐ కొనసాగించింది. వారితోపాటు పేసర్ బుమ్రా, ఆల్‌రౌండర్ జడేజా ఆ జాబితాలో ఉన్నారు. ఈ విభాగం క్రికెటర్లకు వార్షిక వేతనం రూ. ఏడు కోట్లు లభిస్తుంది. టెస్టుల నుంచి తప్పుకోవడంతో రోహిత్, విరాట్‌లను ఆ కేటగిరీలో కొనసాగిస్తారా..అన్న ప్రశ్నలు ఉదయించాయి. కానీ వీరిద్దరూ ఎ+విభాగంలోనే కొనసాగుతారని బీసీసీఐ కార్యదర్శి దేవజీత్ సైకియా బుధవారం స్పష్టంజేశాడు. 'టెస్టులు, టీ20లనుంచి వైదొలగినా రోహిత్, కోహ్లీ ఎ+కేటగిరీలోనే కొనసాగుతారు. భారత జట్టులో వారిద్దరు ఇప్పటికే భాగమే. ఎ+ఆటగాళ్లకు లభించే అన్ని సౌకర్యాలు వారికి వర్తిస్తాయి' అని వివరించాడు.

జడేజా..1151 రోజులు

నెం.1 ఆల్‌రౌండర్‌గా చరిత్ర



న్యూఢిల్లీ: వెటరన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు. వరుసగా 1151 రోజులు టెస్టుల్లో నెం.1 ఆల్‌రౌండర్‌గా నిలవడం ద్వారా రికార్డు పుటలకెక్కాడు. దిగ్గజ ఆల్‌రౌండర్లు కపిల్ దేవ్, కలిస్ వంటివారికి కూడా సాధ్యంకాని ఘనతను అతడు దక్కించుకున్నాడు. వెస్టిండీస్‌కు చెందిన జాసన్ హోల్డర్‌ను వెనక్కు నెట్టి మార్చి 9, 2022న టెస్ట్ ఆల్‌రౌండర్ నెం.1 ర్యాంకును అతడు సొంతం చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆ ర్యాంక్‌ను నిలబెట్టుకుంటూ వస్తున్నాడు.

ఢిల్లీ జట్టులో ముస్తాఫిజుర్

న్యూఢిల్లీ : ఆస్ట్రేలియా బ్యాటర్ జేక్ మెక్‌గర్క్ స్థానంలో బంగ్లాదేశ్ ఎడమచేతి వాటం పేసర్ ముస్తాఫిజుర్ రహ్మాన్‌ను ఢిల్లీ జట్టు తీసుకుంది. స్వదేశానికి వెళ్లిపోయిన మెక్‌గర్క్ తిరిగి రాకపోవడంతో అతడి స్థానంలో ముస్తాఫిజుర్‌ను తీసుకోవాలని ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణయించింది. ఇక..స్వదేశం వెళ్లిపోయిన క్వింటన్ డికాక్ కోల్‌కతా జట్టులో తిరిగి చేరనున్నాడు.

నిషిక తీన్మార్

రిషిత, లక్ష్మికి చెరో రెండు పతకాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో బుధవారం తెలంగాణ క్రీడాకారులు ఆరు పతకాలు కొల్లగొట్టారు. బిహార్‌లో జరిగిన జూనియర్ జిమ్నాస్టిక్స్ వాల్టింగ్ టేబుల్‌లో నిషిక అగర్వాల్ పసిడి పతకం నెగ్గింది. అలాగే అన్‌ఈవెన్ బార్స్, బ్యాలెన్సింగ్ బీమ్‌లో ఒక్కో కాంస్యం సొంతం చేసుకుంది. టెన్నిస్ సింగిల్స్ ఫైనల్లో బసిరెడ్డి రిషిత రెడ్డి 6-1, 2-6, 6-3తో ఐశ్వర్యపై నెగ్గి స్వర్ణంతో మెరిసింది. దండు లక్ష్మీ సిరి 6-4, 6-1తో హర్షిణిపై గెలిచి కాంస్యం అందుకుంది. డబుల్స్ ఫైనల్లో తెలంగాణ ద్వయం రిషిత-లక్ష్మీ సిరి 0-6, 4-6తో ఆకృతి-ఐశ్వర్య చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. వెయిట్‌లిఫ్టింగ్‌లో ఆంధ్ర అమ్మాయి రామలక్ష్మి రజతంతో మెరిసింది.



కిరానా హిల్స్‌లో ఏం జరిగింది?

అణుధార్మికత లీక్ అయ్యిందా?.. అక్కడ పాక్ టాక్టికల్ న్యూక్లియర్ వార్‌హెడ్ల నిల్వ!

- ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో అక్కడికి హడావుడిగా అమెరికా బీ-350 విమానం
- అందులో రేడియేషన్‌ను అంచనా వేసే టెక్నాలజీ
- ఈజిప్ట్ నుంచి బోరాన్‌తో మరో విమానం!
- కిరానా హిల్స్‌లో రేడియేషన్ లీక్ వార్తలకు బలం

(సెంట్రల్ డెస్క్)

పాకిస్థాన్‌లోని కిరానా హిల్స్‌లో ఏం జరిగింది? అక్కడి టాక్టికల్ న్యూక్లియర్ వార్ హెడ్స్ నిల్వలకు నష్టం వాటిల్లిందా? ఫలితంగా.. కిరానా హిల్స్ నుంచి అణుధార్మికత వెలువడుతోందా? అమెరికాకు చెందిన ప్రత్యేక 'న్యూక్లియర్ ఎమర్జెన్సీ' విమానం పాకిస్థాన్‌లో ల్యాండ్ అయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా వెల్లడి చేయడం.. అణుధార్మికతను కొంత వరకు నియంత్రించగలిగే బోరాన్ నిల్వలతో ఈజిప్ట్‌కు చెందిన విమానం ఇస్లామాబాద్‌కు చేరిందనే వార్తలు వెల్లువెత్తడంతో ఇప్పుడు ఈ అంశంపై మరింత ఉత్కంఠ నెలకొంది. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ పరిధిలో.. సర్గోధా జిల్లాలో కిరానా హిల్స్ ఉన్నాయి. వీటి వైశాల్యం 68 చదరపు కిలోమీటర్లు కాగా.. 39 కిలోమీటర్ల వ్యాసార్థంలో పాకిస్థాన్ రక్షణ శాఖ తన స్థావరాలను ఏర్పాటు చేసుకుంది. ఈ కొండల్లో 10కి మించి సొరంగాలను నిర్మించిన పాక్.. వాటిలో టాక్టికల్(చిన్నపాటి అణు దాడులు) న్యూక్లియర్ వార్‌హెడ్ నిల్వలను భద్రపరిచినట్లు వార్తలు వెలువడుతున్నాయి. స్ట్రాటజిక్(భారీ విధ్వంసం సృష్టించే అణు దాడులు) న్యూక్లియర్ వార్‌హెడ్‌లు నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సమీపంలో ఉన్నట్లు అంతర్జాతీయ వార్తాసంస్థలు చెబుతున్నాయి. 1980-89 మధ్యకాలంలో కిరానా హిల్స్‌పై పాకిస్థాన్ టాక్టికల్ న్యూక్లియర్ పరీక్షలు నిర్వహించినట్లు 2023లో 'ద బులెటిన్ ఆఫ్ ది అటామిక్ సైంటిస్ట్స్' నివేదిక వెల్లడించింది. ఇదే నివేదికలో వార్‌హెడ్‌ల నిల్వల ప్రస్తావన ఉండడం గమనార్హం..! ఇక్కడ ఆయుధాల గ్రేడ్ ప్లూటోనియం ఉత్పత్తికి ఉపయోగించే 4భారజల రియాక్టర్లు ఉన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.



పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్, ఆర్మీ చీఫ్ మునీర్ బుధవారం సియాల్‌కోట్‌లోని పస్రూర్ కంటోన్మెంట్‌లో పర్యటించారు. ఇలా యుద్ధ ట్యాంకుపై నిలబడి సైనికులతో మాట్లాడారు. ప్రధాని మోదీ మంగళవారం ఆదంపూర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. షెహబాజ్ మోదీని కాపీ కొడుతున్నారని నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు.

ఇప్పుడు ఎందుకు ఉత్కంఠ?

ఇటీవల 'ఆపరేషన్ సిందూర్'పై వాయుసేన అధికారి ఏకే భారతి ప్రెస్ బ్రీఫింగ్‌లో భాగంగా.. ఓ విలేకరి "కిరానా హిల్స్‌ను టార్గెట్‌గా చేసుకున్నారా? అక్కడ రేడియేషన్ వెలువడుతోందంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి" అని ప్రస్తావించారు. దానికి ఏకే భారతి సమాధానమిస్తూ.. "మా టార్గెట్లలో కిరానా హిల్స్ లేవు. అక్కడ పాకిస్థానీ అణ్వాయుధాలున్నట్లు సమాచారం చెప్పినందుకు ధన్యవాదాలు" అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత రేడియేషన్ లీకేజీపై అంతటా చర్చ మొదలైంది. ఎకనామిక్ టైమ్స్‌తోపాటు.. పలు అంతర్జాతీయ వార్తా సంస్థలు కూడా ఇదే కోణంలో వార్తలను ప్రచురించాయి. దీనికి బలాన్ని చేకూరుస్తూ.. ఫ్లైట్‌రాడార్-24 వంటి ఫ్లైట్ ట్రాకర్ వెబ్‌సైట్లలో అమెరికాకు చెందిన బీ-350(ఏఎంఎస్) విమానం పాకిస్థాన్‌కు వచ్చినట్లు పేర్కొన్నాయి. ఈ విమానాన్ని 'న్యూక్లియర్ ఎమర్జెన్సీ' అని పిలుస్తారు. ఒక ప్రాంతంలో వెలువడే అణుధార్మికత తీవ్రతను గుర్తించే సాంకేతిక పరికరాలు ఈ విమానంలో ఉంటాయి. ఫుకుషిమా ఉదంతంలోనూ ఈ విమానం జపాన్‌కు వెళ్లినట్లు ఎకనామిక్ టైమ్స్ గుర్తుచేసింది. అదేవిధంగా ఈజిప్ట్ నుంచి బోరాన్ నిల్వలతో మరో విమానం పాకిస్థాన్‌కు చేరుకున్నట్లు వార్తలు వచ్చాయి. అణుధార్మికతకు సంబంధించిన న్యూట్రాన్లు బోరాన్-10 ఐసోటోప్‌లలో విలీనం అవుతాయి. ఫలితంగా రేడియేషన్ ప్రభావం తగ్గుతుంది. అందుకే ఈజిప్ట్ బోరాన్‌ను పంపించి ఉంటుందని ఆయా కథనాలు చెబుతున్నాయి.

నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ వద్ద కూడా..

నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సమీపంలో బంకర్లలోని వార్‌హెడ్లకు నష్టం జరిగి.. రేడియో ధార్మికత లీకై ఉండొచ్చని అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ సీఐఏ మాజీ అధికారి, రాండ్ కార్పొరేషన్ విశ్లేషకుడు డెరెక్ గ్రాస్‌మన్‌ను ఉటంకిస్తూ ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో తెలిపింది. ఈ దాడులు పాకిస్థాన్ న్యూక్లియర్ కమాండ్ అథారిటీ పాలిట శరాఘాతమని ఆయన వ్యాఖ్యానించినట్లు ఎకనామిక్ టైమ్స్ కథనం స్పష్టం చేస్తోంది.

ఇంటెలిజెన్స్ హెచ్చరిక ఇదేనా?

పాక్‌పై దాడులను భారత్ తీవ్రతరం చేయడంతో.. ఈ నెల 10వ తేదీన తెల్లవారుజామున ప్రధాని మోదీకి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఫోన్ చేసిన విషయం తెలిసిందే..! దీనికి కారణాలను విశ్లేషిస్తూ సీఎన్ఎన్ ఓ కథనాన్ని ప్రసారం చేసింది. అత్యంత కీలకమైన హెచ్చరికలను ఇంటెలిజెన్స్ వర్గాలు వైట్‌హౌస్‌కు అందజేసినట్లు పేర్కొంది. ఆ వెంటనే అధ్యక్షుడు ట్రంప్, వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో భేటీ అయ్యి.. భారత్-పాక్ ఉద్రిక్తతలను తక్షణం నిలువరించాల్సిన అవసరం ఉందని భావించినట్లు వెల్లడించింది. ఆ మేరకు వైట్‌హౌస్ తీసుకున్న నిర్ణయంతో వాన్స్ వెంటనే(శనివారం ఉదయం) ప్రధాని మోదీకి ఫోన్ చేసినట్లు స్పష్టం చేసింది. ఆ ఇంటెలిజెన్స్ హెచ్చరికలు అణుధార్మికత లీకేజీకి సంబంధించినవే అయి ఉంటాయని తాజా పరిణామాలను బట్టి తెలుస్తోంది. ఇదిలా ఉండగా, భారత్ దాడులతో దారుణంగా దెబ్బతిన్న పాకిస్థాన్.. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం ఢిల్లీని లక్ష్యంగా చేసుకుని, ఫతాహ్ క్షిపణిని ప్రయోగించింది. దీన్ని భారత్ సరిహద్దుల్లోనే కూల్చివేసింది. అయితే.. విశ్రాంత మేజర్ జనరల్ జీడీ భక్షి ఓ న్యూస్‌చానల్‌లో మాట్లాడుతూ.. టాక్టికల్ న్యూక్లియర్ వార్‌హెడ్‌తో ఫతాహ్ క్షిపణి వచ్చి ఉంటుందని, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు.

కర్త, కర్మ, క్రియ.. ఏపీ సింగ్



పాకిస్థాన్ మిలిటరీకి అత్యంత కీలకమైన నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై వైమానిక దాడులు చేయాలన్న మాస్టర్ ప్లాన్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్ అమర్‌ప్రీత్ సింగ్‌దే అని రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ ఎయిర్ బేస్‌పై దాడికి ప్రణాళిక రచించిందీ, అమలు చేసిందీ.. చివరకు పైలట్లను ఎంపిక చేసిందీ ఆయనే అని తెలిపాయి. ఏపీ సింగ్‌కు జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ మద్దతుగా నిలిచారని, ఆపరేషన్‌కు అనుమతి ఇచ్చారని పేర్కొన్నాయి. నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ రావల్పిండిలో ఉంది. దీనికి సమీపంలోనే చక్లాలాలో పాక్ ఆర్మీ చీఫ్ ప్రధాన కార్యాలయం, న్యూక్లియర్ కమాండ్ కార్యాలయం ఉన్నాయి. ఈ నేపథ్యంలో, నూర్‌ఖాన్ బేస్‌పై దాడి చేయడం ద్వారా తాము ఎక్కడైనా దాడి చేయగలదన్న గట్టి సందేశాన్ని పాకిస్థాన్‌కు పంపించాలని ఏపీ సింగ్ భావించారని రక్షణ వర్గాలు వివరించాయి. ఆయన అనుకున్నట్లుగానే, నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై దాడితో పాక్ ఆత్మస్థైర్యం దెబ్బతిన్నదని, ఆ దేశ ఆర్మీ చీఫ్ మూడు గంటల పాటు బంకర్లో దాక్కోవాల్సి వచ్చిందని తెలుస్తోంది. ఈ దాడుల కోసం భారత్ బ్రహ్మోస్ క్షిపణులను ఉపయోగించి ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

భారత్, పాక్ కలిసి డిన్నర్ చేయాలి!

- రెండు దేశాల మధ్య యుద్ధాన్ని నేనే ఆపాను



న్యూయార్క్/లండన్ మే 14: భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తానే కారణమని పదే పదే చెప్పుకొంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. మరోసారి ఇదే విషయం చెప్పారు. రెండు అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధం రాకుండా తన మధ్యవర్తిత్వం దోహదపడిందని అన్నారు. అయితే ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గాలంటే భారత్, పాకిస్థాన్ కలిసి డిన్నర్ చేయాలని సూచించారు. ప్రస్తుతం సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ట్రంప్.. మంగళవారం రియాద్‌లో జరిగిన సౌదీ-అమెరికా ఇన్వెస్ట్‌మెంట్ ఫోరం సదస్సు సందర్భంగా మాట్లాడారు. భారత్, పాక్ మధ్య యుద్ధం జరిగి ఉంటే లక్షల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయేవారని, అలాంటిది జరగకూడదనే తాను కోరుకున్నానని తెలిపారు. తనకు తాను శాంతి దూతగా ట్రంప్ చెప్పుకొన్నారు.

'సింధు'పై పున:సమీక్షించండి

- భారత్‌కు పాక్ జలవనరుల శాఖ లేఖ

ఇస్లామాబాద్, మే 14: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సింధూజలాల ఒప్పందం అమలును నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయాన్ని పున:సమీక్షించాలని పాకిస్థాన్ విజ్ఞప్తి చేసింది. సింధూ జలాలు నిలిపివేస్తే పాకిస్థాన్‌లో తీవ్ర దుర్భిక్షం నెలకొంటుందంటూ ఆదేశ జలవనరుల శాఖ భారత విదేశాంగశాఖకు లేఖ రాసింది. దీనిపై భారత్‌తో చర్చించడానికి సిద్ధమని తెలిపింది. వాస్తవానికి భారత్ ఈ నిర్ణయం తీసుకున్నపుడు సింధూ నదిలో నీళ్లు పారకపోతే రక్తం పారుతుందని వ్యాఖ్యానించిన పాక్.. ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణ తర్వాత వెంటనే దారిలోకొచ్చింది. కాల్పుల విరమణకు అంగీకరించినా సింధూజలాల ఒప్పందంపై వైఖరి మార్చుకోబోమని భారత్ తేల్చి చెప్పింది. పాక్‌తో చర్చలంటూ జరిగితే పీఓకే, ఉగ్రవాదంపైనే జరుగుతాయని ప్రధాని మోదీ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ తరుణంలో పాక్ విజ్ఞప్తి చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. 1960లో భారత్-పాక్ మధ్య సింధూ జలాల ఒప్పందం కుదిరింది.

మనకు ఎలాంటి నష్టం జరగలేదు

- ఆపరేషన్ సిందూర్‌పై కేంద్ర ప్రభుత్వం ప్రకటన

న్యూఢిల్లీ, మే 14: పహల్గాం ఉగ్రదాడి తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భారత సంపత్తికి ఎలాంటి నష్టం వాటిల్ల లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. తద్వారా భారత యుద్ధ విమానాలను దెబ్బతీశామన్న పాక్ వాదనను కొట్టిపారేసింది. అదే సమయంలో నియంత్రణ రేఖను, అంతర్జాతీయ సరిహద్దును దాటకుండానే వైమానిక దాడులు నిర్వహించినట్లు తెలిపింది. దాడుల సమయంలో పాకిస్థాన్‌లోని చైనా తయారీ గగనతల రక్షణ వ్యవస్థలను భారత వైమానిక దళం... జామ్(తాత్కాలికంగా పనిచేయకుండా చేయడం) చేసిందని వెల్లడించింది. జామ్ చేసి పాక్‌లోని సైనిక లక్ష్యాలను దెబ్బతీసినట్లు తెలిపింది. మొత్తం 23 నిమిషాల్లోనే దాడులను పూర్తి చేసినట్లు వెల్లడించింది. అదే విధంగా పాక్ నుంచి వచ్చిన చైనా, టర్కీ తయారీ డ్రోన్లను, మిసైళ్లను... ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ద్వారా విజయవంతంగా అడ్డుకున్నామని భారత్ తెలిపింది. భారత రక్షణ చరిత్రలో, సైనిక చర్యల్లో ఆపరేషన్ సిందూర్ మైలురాయిలా నిలిచిపోతుందని తెలిపింది.

భారత దౌత్యవేత్తను బహిష్కరించిన పాకిస్థాన్

న్యూఢిల్లీ, మే 14 : ఢిల్లీలో పాక్ రాయబార కార్యాలయంలోని ఒక అధికారిని గూఢచర్యం ఆరోపణలపై భారత్ మంగళవారం బహిష్కరించిన నేపథ్యంలో పాకిస్థాన్ ప్రతి చర్యకు దిగింది. బుధవారం ఇస్లామాబాద్‌లోని భారత రాయబార కార్యాలయంలోని ఒక దౌత్య ఉద్యోగిని అవాంఛనీయ వ్యక్తిగా ప్రకటించి బహిష్కరించింది. ఆయన హోదాకు తగని పనులు చేస్తున్నట్లు ఆరోపించింది. 24 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. ఈమేరకు ఆ దేశ విదేశాంగ శాఖ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది.

ఇరాక్ స్టీమర్‌లో పాకిస్థానీ.. కారవార ఓడరేవులో దిగనివ్వని పోలీసులు

బెంగళూరు, మే 14(ఆంధ్రజ్యోతి): ఉత్తర కన్నడ జిల్లా కేంద్రంలోని కారవార ఓడరేవుకు వచ్చిన 'ఎంటీఆర్ ఓషియన్' సరుకు రవాణా స్టీమర్ నుంచి పాకిస్థానీని కిందకు దిగనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఇరాక్‌లోని జుబైర్ నుంచి ఈ నెల 12న కారవార ఓడరేవుకు స్టీమర్ చేరుకుంది. అందులో 15 మంది భారతీయులు, ఇద్దరు సిరియావాసులు, ఒక పాకిస్థానీ ఉన్నారు. స్టీమర్‌లో పాకిస్థానీ ఉన్న విషయాన్ని ఓడరేవుల శాఖ అధికారులు తీరం గస్తీ బృందానికి తెలియజేశారు. దీంతో కారవార పోలీసులు, ఓడరేవు రక్షణ సిబ్బంది అతడిని కిందకు రానివ్వకుండా నిలుపుదల చేశారు. అతడి మొబైల్, ఇతర వస్తువులను కెప్టెన్ ద్వారా స్వాధీనం చేసుకున్నారు. స్టీమర్‌లోని సరుకును దించేందుకు రెండు రోజులు పట్టింది. కారవార నుంచి స్టీమర్ బుధవారం షార్జాకు బయలుదేరింది. అందులో పాకిస్థానీని పంపేశారు. మరోవైపు, ఒడిశాలోని పారాదీప్ ఓడరేవుకు బుధవారం 21 మంది పాకిస్థాన్‌కు చెందిన సిబ్బందితో క్రూడాయిల్ నౌక ఒకటి రావడంతో ఆ రాష్ట్ర పోలీసులు అప్రమత్తమై అక్కడ భద్రత కట్టుదిట్టం చేశారు.

ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని సమాధానం చెప్పాలి

- కాంగ్రెస్ డిమాండ్..దేశ వ్యాప్తంగా ర్యాలీలకు ప్రణాళిక

న్యూఢిల్లీ, మే 14 : భారత్, పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం తానే కుదిర్చానన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉంటున్నారు...? అలాగే ఆపరేషన్ సిందూర్ ఎందుకు నిలిపివేశారో జవాబు చెప్పాలని కోరుతూ దేశ వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. బుధవారం ఇక్కడ ఆ పార్టీ సీనియర్ నేతల సమావేశం జరిగింది. అనంతరం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్, మీడియా, ప్రచార హెడ్ పవన్ ఖేరా మాట్లాడుతూ ఈమేరకు తెలిపారు. సైనిక చర్య సైనిక దళాలు, దేశం సాధించిన విజయమైతే.. బీజేపీ తన సొంతం చేసుకోవాలని చూస్తోందని పవన్ ఖేరా ఆరోపించారు. తమ ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరుతూ పలు రాష్ట్రాల్లో జైహింద్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు.

స్వతంత్ర దేశంగా బలూచిస్థాన్!

- తమను గుర్తించాలని భారత్, ఐక్యరాజ్యసమితికి ఆ ప్రాంత నేతల వినతి

న్యూఢిల్లీ, మే 14: భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ఇప్పటికే ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పాకిస్థాన్‌లోనే అతి పెద్ద ప్రావిన్స్(విస్తీర్ణం పరంగా) అయిన బలూచిస్థాన్.. పాకిస్థాన్ నుంచి విడిపోతున్నట్లు బలూచ్ నేతలు ప్రకటించారు. అంతేకాక బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని భారత్, ఐక్యరాజ్యసమితిని కోరారు. ఈ మేరకు బలూచిస్థాన్ నాయకుడు మీర్ యార్ బలూచ్ ఎక్స్‌లో పలు పోస్టులు చేశారు. రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్థాన్ ఏర్పాటును తన పోస్టుల్లో ప్రకటించారు. అలాగే, న్యూఢిల్లీలో బలూచిస్థాన్ రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. తమను దేశంగా గుర్తించి.. కరెన్సీ, పాస్‌పోర్టు జారీ వంటి ప్రాథమిక అవసరాలకు నిధులు సమకూర్చాలని ఐక్యరాజ్యసమితిని అభ్యర్థించారు. అలాగే, తమను, పాకిస్థానీయులను ఒక్కటిగా చూడవద్దని భారత మీడియాను కోరారు. మీర్ యార్ బలూచ్ చేసిన పోస్టుల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు బలూచిస్థాన్ జెండాలు, స్వతంత్ర బలూచిస్థాన్ మ్యాపులు చూపిస్తున్న ఫొటోలు, వీడియోలు కూడా ఉన్నాయి. కాగా, కషిష్ చౌదరి(25) అనే పాకిస్థాన్‌కు చెందిన హిందూ యువతి బలూచిస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(బీపీఎస్సీ) పరీక్షలో ఉత్తీర్ణత సాధించి అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగం పొందింది. బలూచిస్థాన్‌లో ఈ ఘనత సాధించిన తొలి మైనార్టీ మహిళగా కషిష్ చరిత్ర సృష్టించింది.

డ్రోన్లే కాదు.. సైనికులనూ పంపిన తుర్కియే!

భారత్‌పై దాడికి ఆ దేశం సాయం.. 'సిందూర్'లో ఇద్దరు తుర్కియే సైనికుల మరణమే నిదర్శనం

- మంచిచెడుల్లోనూ పాకిస్థాన్‌కు తోడుంటాం: ఎర్దోగాన్

న్యూఢిల్లీ, మే 14: భారత్‌పై దాడి చేసేందుకు పాకిస్థాన్‌కు డ్రోన్లను ఇవ్వడంతోపాటు తమ దేశ సైనికులను కూడా తుర్కియే పంపిన విషయం బట్టబయలైంది. ఆపరేషన్ సిందూర్‌లో ఇద్దరు తుర్కియే సైనికులు హతమయ్యారు. భారత్‌పై దాడి చేసేందుకు పాకిస్థాన్‌కు 350కిపైగా డ్రోన్లు ఇచ్చిన తుర్కియే.. సైనికులను కూడా పాకిస్థాన్‌కు పంపినట్టు ఇది నిరూపిస్తోందని అధికార వర్గాలు ఇండియా టుడే టీవీకి తెలిపాయి. ఆ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌పై డ్రోన్ దాడులను సమన్వయం చేసుకోవడంలో పాకిస్థాన్ ఆర్మీ అధికారులకు తుర్కియే సలహాదారులు సాయం చేశారు. ఈ నెల 7, 8 తేదీల్లో రాత్రివేళ భారత్‌పైకి 300 నుంచి 400 డ్రోన్లను పాకిస్థాన్ ఆర్మీ ప్రయోగించింది. ఈ డ్రోన్ల శకలాలకు ఫోరెన్సిక్ దర్యాప్తు నిర్వహించగా, అవి తుర్కియేకు చెందిన అసిస్‌గార్డ్ సొంగార్ డ్రోన్లని ప్రాథమికంగా తేలింది. ఈ విషయాన్ని ఆపరేషన్ సిందూర్‌పై మీడియా సమావేశంలో కల్నల్ సోఫియా ఖురేషీ కూడా చెప్పారు. భారత్‌పై దాడికి తుర్కియే సాయం చేయడంపై భారతీయుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతున్నా తుర్కియే అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్దోగన్ వెనక్కి తగ్గడం లేదు. తాజాగా ఆయన బుధవారం పాకిస్థాన్‌కు మద్దతును పునరుద్ఘాటించారు. పాకిస్థాన్‌ను సోదరదేశంగా ఆయన ప్రస్తావించారు. మంచి, చెడ్డ సమయాల్లోనూ పాక్ పక్షాన నిలబడతామని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌కు బలమైన మద్దతు, అచంచలమైన సంఘీభావం తెలియజేశారంటూ ఎర్దోగన్‌కు ధన్యవాదాలు తెలుపుతూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ 'ఎక్స్'లో చేసిన పోస్టుకు స్పందనగా ఎర్దోగన్ ఈ వ్యాఖ్యలు చేశారు.



తుర్కియేకు మేం వెళ్లం

బాయ్‌కాట్ తుర్కియే, అజర్‌బైజాన్ నిరసన దేశంలో ఊపందుకుంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన ఆ దేశాలపై భారతీయుల ఆగ్రహం కొనసాగుతోంది. పహల్గాం దాడులకు ముందు ఆ రెండు దేశాల్లో పర్యటనలకు సిద్ధపడ్డ భారతీయులు.. ఇప్పుడు ఆ ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని సీఎన్ఎన్-న్యూస్ 18 చానల్‌తో మాట్లాడుతూ ఈజ్‌మైట్రిప్ సహ వ్యవస్థాపకుడు ప్రశాంత్ పిట్టి ధ్రువీకరించారు. గత కొద్ది రోజులుగా భారత్ నుంచి పర్యాటక ట్రిప్పులు భారీగా రద్దు అవుతున్నాయని ఆయన తెలిపారు. తుర్కియేకు 22%, అజర్‌బైజాన్‌కు 30శాతానికి పైగా తమ సంస్థ ద్వారా ట్రిప్పులు రద్దు అయ్యాయని చెప్పారు. ఆ రెండు దేశాలతో పాటు చైనాకు కూడా ట్రిప్పులు రద్దు చేసినట్లు ఇక్సిగో సీఈవో అలోకి చెప్పారు.

తుర్కియే, చైనా మీడియా సంస్థలపై భారత్ ఆంక్షలు

- అధికారిక సోషల్ మీడియా ఖాతాలు నిలిపివేత

న్యూఢిల్లీ, మే 14: ఆపరేషన్ సిందూర్‌పై పాకిస్థాన్ తప్పుడు ప్రచారానికి వంత పాడుతున్న తుర్కియే, చైనా మీడియా సంస్థల ఎక్స్ ఖాతాలపై భారత్ బుధవారం ఆంక్షలు విధించింది. తుర్కియే ప్రభుత్వ ఆధీనంలోని ప్రసార సంస్థ 'టీఆర్‌టీ వరల్డ్' ఎక్స్ ఖాతాను కేంద్రం నిలిపివేసింది. తుర్కియే డ్రోన్లతో భారత్‌పై పాకిస్థాన్ దాడి చేసిన కొద్దిరోజులకే ఈ చర్య తీసుకోవడం గమనార్హం. అదేసమయంలో చైనా అధికారిక మీడియా సంస్థలైన 'గ్లోబల్ టైమ్స్', 'జిన్హువా' ఎక్స్ ఖాతాలను కూడా కేంద్రం భారత్‌లో నిషేధించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి తప్పుడు సమాచారాన్ని పోస్టు చేసినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఈ ఖాతాలను యాక్సెస్ చేయడానికి ప్రయత్నిస్తే "చట్టపరమైన డిమాండ్‌కు ప్రతిస్పందనగా భారత్‌లో మీ ఖాతా నిలిపివేశాం" అనే సందేశం కనిపిస్తోంది.

'ఉగ్రవాదులను వాళ్ల మతానికి చెందిన సోదరితో మట్టుబెట్టించారు'

- కల్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ వ్యాఖ్య
- హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- పది సార్లు క్షమాపణ చెప్పడానికైనా సిద్ధం : విజయ్ షా

న్యూఢిల్లీ, మే 14 : ఆపరేషన్ సిందూర్ వివరాలను మీడియాకు వెల్లడించిన వారిలో ఒకరైన కల్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశించి మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయ్యాయి. ఉగ్రవాదులను వాళ్ల తోబుట్టువుతోనే మోదీ మట్టుబెట్టించారంటూ విజయ్ షా అనడం వివాదానికి కారణమైంది. కాంగ్రెస్‌తోపాటు జాతీయ మహిళా కమిషన్, మధ్యప్రదేశ్ హైకోర్టు కూడా ఈ అంశంపై స్పందించాయి. విజయ్‌షా వ్యాఖ్యలను క్యాన్సర్‌తో పోల్చిన హైకోర్టు.. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బుధవారం ఆదేశించింది. అసలేం జరిగిందంటే.. మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా.. ఇండోర్‌లో మంగళవారం జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రధాని మోదీపై పొగడ్తల జల్లు కురిపించారు. ఈ క్రమంలో " పహల్గాంలో ఉగ్రవాదులు మన సోదరీమణుల నుదుట సిందూరాన్ని తుడిపి వారిని వితంతువులను చేస్తే.. ప్రధాని మోదీ వాళ్ల(ఉగ్రవాదుల) మతానికే చెందిన సోదరిని విమానంలో పంపి ఉగ్రవాదులను మట్టుబెట్టించారు" అని అన్నారు. నిజానికి, ఆపరేషన్ సిందూర్‌లో కల్నల్ సోఫియా ఖురేషీ ప్రత్యక్షంగా పాల్గొనలేదు. విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీతో కలిసి ఆపరేషన్ వివరాలను మీడియాకు వివరించారు. ఖురేషీ ముస్లిం కావడంతో.. విజయ్‌షా ఆమెనే ఉగ్రవాదుల సోదరి అన్నారని, మత విద్వేషాలను రెచ్చగొట్టారని దుమారం రేగింది. విషయం తీవ్ర వివాదాస్పదంగా మారడంతో స్పందించిన విజయ్ షా తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చుకున్నారు. సోఫియా ఖురేషీని కలలో కూడా అవమానించనని, తన సొంత సోదరి కంటే ఎక్కువగా ఆమెను గౌరవిస్తున్నానని పేర్కొన్నారు. సోఫియా ఖురేషీ దేశానికి చేసిన సేవలకు ఆమె సెల్యూట్ చేస్తున్నానని, తన మాటలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే పది సార్లు క్షమాపణ చెప్పడానికైనా తాను సిద్ధమని వి



విజయ్ షా

బీఎస్ఎఫ్ జవాన్ పూర్ణం కుమార్‌ను భారత్‌కు అప్పగించిన పాకిస్థాన్

అమృత్‌సర్, మే 14: పాకిస్థాన్ రేంజర్ల అదుపులో ఉన్న మన బీఎస్ఎఫ్ జవాన్ విడుదల విషయంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. 21 రోజుల తర్వాత బీఎస్ఎఫ్ జవాన్ పూర్ణం కుమార్ షాను బుధవారం భారత్‌కు పాకిస్థాన్ అప్పగించింది. ఉదయం 10.30 గంటలకు మన జవాన్‌ను అట్టారి-వాఘా సరిహద్దు వద్ద పాకిస్థాన్ రేంజర్లు బీఎస్ఎఫ్‌కు అప్పగించినట్టు బీఎస్ఎఫ్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. పాకిస్థాన్ రేంజర్లతో బీఎస్ఎఫ్ నిరంతరం నిర్వహించిన ఫ్లాగ్ సమావేశాలు, ఇతర కమ్యూనికేషన్ మార్గాల ద్వారా బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌ను వెనక్కి తీసుకురావడం సాధ్యపడినట్టు చెప్పారు. ఇన్ని రోజులు బీఎస్ఎఫ్ జవాన్.. పాక్ రేంజర్ల అదుపులో ఉన్న నేపథ్యంలో ఈయనకు పూర్తిస్థాయిలో బాడీ చెకప్‌తోపాటు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. 24వ బీఎస్ఎఫ్ బెటాలియన్‌కు చెందిన షాను పంజాబ్‌లో భారత్-పాకిస్థాన్ మధ్య ఉన్న అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పాక్ రేంజర్లు ఏప్రిల్ 23న అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఫెరోజ్‌పూర్ సెక్టార్ ప్రాంతంలో విధుల్లో ఉన్న షా అనుకోకుండా సరిహద్దు దాటడంతో పాకిస్థాన్ రేంజర్లు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. బీఎస్ఎఫ్ జవాన్‌ను బుధవారం పాకిస్థాన్ అప్పగించిన వెంటనే దాదాపు రెండు వారాలుగా కస్టడీలో ఉన్న పాకిస్థాన్ రేంజర్‌ను భారత్ విడుదల చేసింది.



పూర్ణం కుమార్ షా

శిల్పా.. సౌందర్యం

(మొదటిపేజీ తరువాయి)

మంత్ర ముగ్ధులయ్యారు. కాకతీయుల కాలం నాటి శిల్పాలను చూసి ఆశ్చర్య చకితులయ్యారు. ఆదివాసీ కొమ్ముకోయ నృత్యంతో సుందరీమణులకు ఎర్రటి తివాచీ పరిచి.. జిల్లా అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ సమీపంలోని రాతి గోడ వద్ద అతిథుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక తాంబాళాల్లో కాళ్లు కడుక్కొని ఆలయంలోకి ప్రవేశించారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు హరీష్‌శర్మ, ఉమాశంకర్.. రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి సుందరీమణులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎన్ఐటీ మాజీ ప్రొఫెసర్ పాండురంగారావు రామప్ప ఆలయ విశిష్టతను వివరించారు. ఆలయం నుంచి బయటకు వస్తూ 'తెలంగాణ... జరూర్ ఆనా' అంటూ సుందరీమణులు నినదించారు. భారతదేశ సంప్రదాయం ప్రకారం రెండు చేతులు జోడించి నమస్కరించారు. ఫొటోలకు ఫోజులిచ్చి.. సెల్ఫీలు తీసుకుని సంబరపడ్డారు. మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్‌లతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం ఆలయ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సభాస్థలం వద్దకు చేరుకుని.. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల తన బృందంతో కలిసి రాణి రుద్రమదేవి చరిత్రను నృత్యం రూపంలో ప్రదర్శించి అతిథులను మెప్పించారు. పేరిణి నృత్య కళాకారుడు గజ్జెల రంజిత్‌కుమార్ బృందం శివతాండవ నృత్యం ప్రదర్శించారు. టూరిజం శాఖ ఏర్పాటు చేసిన లేజర్ షోను అందాలభామలు ఆస్వాదించారు. అతిథులకు అటవీశాఖ ఆధ్వర్యంలో వెదురు కర్రతో తయారు చేసిన అందమైన బహుమతులను మంత్రి సీతక్క, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్ చేతుల మీదుగా అందజేశారు. ఆలయ తూర్పు ముఖద్వారం వైపు ఉన్న ఇంటర్ ప్రిటేషన్ సెంటర్‌లో సుందరీమణులు విందు చేసి అక్కడినుంచి బయలుదేరారు.

శిల్పవనంలో ముద్దుగుమ్మల సందడి

ప్రపంచ సుందరి పోటీదారుల్లో 22 మంది మరో బృందంగా వరంగల్ కోటను సందర్శించారు. సాయంత్రం 4.35 గంటలకు హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌కు చేరుకున్న సుందరీమణులకు స్థానిక మహిళలు బతుకమ్మలతో సంప్రదాయ డోలు, వాయిద్యాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. మహిళలతో కలిసి అందగత్తెలు బతుకమ్మ ఆట, పాటలతో నృత్యాలు చేస్తూ హుషారెత్తించారు. చారిత్రక వేయి స్తంభాల ఆలయానికి చేరుకున్న అందాల భామలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. తొలుత సుందరీమణులు ఆలయం ఆవరణలో ఉన్న కోనేరును పరిశీలించారు. శిలా శాసనంలో ఉన్న ఆలయ చరిత్రను గైడ్ వివరించారు. సుందరీమణుల కోసం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తాంబాళాల్లో చెంబులోని నీటితో కాళ్లను కడుక్కున్నారు. ఆలయంలోని నందిని చూసి ఆశ్చర్యపోయారు. వేయి స్తంభాలతో ఆలయాన్ని నిర్మించారని, ఇసుకతో పునాదులను ఏర్పాటు చేశారని గైడ్ తెలిపారు. శివుడు, విష్ణువుతో పాటు సూర్యుడు కొలువైన పుణ్యక్షేత్రంగా సుందరీమణులకు వివరించారు. అనంతరం నంది విగ్రహం వద్ద మిస్సమ్మలు పోటీపడి ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. దక్షిణం వైపు పునరుద్ధరించిన కల్యాణ మండపం వద్దకు వెళ్లి విద్యుత్ కాంతులు జిగేల్ జిగేల్ అంటుండగా.. ఫొటోలకు ఫోజులిచ్చారు. అధికారులకు, మీడియా, అక్కడి వచ్చిన వారికి నమస్కార్ అంటూ చేతులు ఊపుతూ ఉత్సాహన్ని చూపించారు. అనంతరం గర్భగుడిలో శివలింగం వద్ద రుద్రేశ్వరస్వామికి ముద్దుగుమ్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్‌శర్మ ప్రపంచ అందగత్తెలకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి, పూర్ణకుంభ స్వాగతంతో పాటు వేద మంత్రాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. రుద్రేశ్వరస్వామికి అభిషేకాలు చేయించారు. ముద్దుగుమ్మలకు తీర్థప్రసాదాలను అందించి జరి అంచు కండువాలతో సత్కరించారు. వేయి స్తంభాల ఆలయంలో సుందరీమణులు సుమారు గంటసేపు గడిపారు.



రామప్ప ఆలయంలోని శిల్పాలను సెల్‌ఫోన్లలో బంధిస్తున్న వివిధ దేశాల సుందరీమణులు

కోటలో సుందరీమణులు కోలాహలం

కాకతీయ సామ్రాజ్య కళా వైభవానికి, శిల్పకళానైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిన వరంగల్ కోటను సుందరీమణులు తిలకించారు. కీర్తితోరణం వద్ద పోటాపోటీగా ఫొటోలకు ఫోజులిచ్చారు. కోట నిర్మాణం, చరిత్రతో పాటు స్వయంభూ శివాలయం లాంటి కాకతీయుల నిర్మాణాలు, ప్రాముఖ్యతలను సౌండ్ అండ్ లైట్ ద్వారా ప్రదర్శిస్తూ మిస్ వరల్డ్ పోటీదారులకు వివరించారు. కోటలోని శిల్పవనంలో శిలలను పరిశీలించారు. ఫొటోలకు ఫోజులిస్తూనే.. సెల్ఫీలు దిగుతూ సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ తమ ఆనందాన్ని తమ దేశంలోని వారితో పంచుకున్నారు. కాగా, కాకతీయుల కాలంలో పురుడు పోసుకున్న పేరిణి నృత్యాన్ని కళాకారులు వరంగల్ కోటలో ప్రదర్శించి ముద్దుగుమ్మలను ఆశ్చర్య పరిచారు. రాణిరుద్రమ నృత్య రూపకం సుందరీమణులను మంత్రముగ్ధులను చేసింది. కోటలో ఏర్పాటు చేసిన ఫ్లియా మార్కెట్‌ను సుందరీమణులు సందర్శించారు. వీరికి ఇటీవలే జీఐ ట్యాగ్ పొందిన చపాట మిర్చిని చూపించారు. అలాగే వరంగల్ పసుపును పరిచయం చేస్తూ, దాని ప్రత్యేకతలను తెలిపారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన వరంగల్ దర్రీస్ (జంపకానాలు) గురించి వివరించారు. అందాలభామలకు వరంగల్ కళాకారులు అరుదైన జ్ఞాపికలను అందించారు. నగరంలోని రంగశాయిపేటకు చెందిన కళాకారులు ఆరు నెలలుగా శ్రమించి తయారు చేసిన షీల్డులను, బ్యాగ్‌లను అందజేశారు. వారి కోసం తయారు చేసిన ప్రత్యేక వంటకాలను వడ్డించారు. మిస్‌వరల్డ్ పోటీదారుల పర్యటనకు పోలీసులు సుమారు వెయ్యిమందితో మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. కాగా, మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వటం తెలంగాణకు గర్వకారణమని మంత్రి కొండా సురేఖ అన్నారు. మిస్ వరల్డ్ పోటీ దారులకు వరంగల్ కోటలో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర సంప్రదాయం, పర్యాటక ప్రాముఖ్యాన్ని ప్రపంచానికి చాటేందుకు ఇది చక్కటి అవకాశమన్నారు. ఈ పోటీలతో తెలంగాణ పర్యాటక ప్రదేశాలకు ప్రపంచవ్యాప్తంగా విశేష ప్రచారం లభిస్తోందని పేర్కొన్నారు.

కొందరు పోటీల్లో.. మరికొందరు పర్యటనల్లో..

మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ దేశాల సుందరీమణులు ఒక్కో రోజు రాష్ట్రంలోని ఒక్కో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతానికి వెళుతున్నారు. తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచ వ్యాప్తం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పర్యటనలకు రూపకల్పన చేసింది. అయితే ఓవైపు ప్రపంచ సుందరి పోటీలు కొనసాగిస్తూనే ఈ పర్యటనలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో మిస్‌వరల్డ్ పోటీని రోజుకు కొందరికి చొప్పున బ్యాచ్‌ల వారీగా నిర్వహిస్తున్నట్లు, ఆరోజు పోటీలేని వారు పర్యటనలకు వెళుతున్నట్లు సమాచారం.


నేడు యాదగిరిగుట్టకు.. పోచంపల్లికి

ప్రపంచ సుందరి పోటీదారులు గురువారం సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మిక దివ్యక్షేత్రం యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శించనున్నారు. మరో బృందం సుందరీమణులు చేనేత కళాత్మకతకు ప్రసిద్ధి గాంచిన భూదాన్‌పోచంపల్లిని వెళ్లనున్నారు.



రామప్ప ఆలయం వద్ద వివిధ దేశాల అందగత్తెలతో మంత్రి సీతక్క

800 ఏళ్ల క్రితం నాటి శిల్పానికి హైహీల్స్!





రామప్ప శిల్ప కళా సౌందర్యానికి అందాల భామల ఫిదా

నాట్యగత్తెల ముద్రలను అనుకరిస్తూ ఫొటోలు

హైదరాబాద్ సిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): 800 ఏళ్ల క్రితం చెక్కిన శిల్పంలోని యువతి కాలికి హైహీల్స్ పాదరక్షలా..!! శిల్పాల ఆహార్యంలో మినీ స్కర్ట్‌లా ..!! ఆలయ గోడలపై ఈజిప్టు, పర్షియన్, రోమన్ దేశాల వనితల శిల్పాలా..!! ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన చారిత్రక రామప్ప దేవాలయాన్ని బుధవారం సందర్శించిన మిస్ వరల్డ్ పోటీదారులకు ఎదురైన అనుభవాలు ఇవి. కాకతీయుల శిల్పకళా వైభవానికి ప్రతీకైన చారిత్రాత్మక నిర్మాణాన్ని చూసి వారంతా మైమరిచిపోయారని స్థానిక గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ చెప్పారు. మరీ ముఖ్యంగా సాలభంజికలు, మదనికలు, నాట్యగత్తెల శిల్ప సౌందర్యాన్ని చూసి ఆశ్చర్యచకితులయ్యారని తెలిపారు. కొందరైతే రాగిణి శిల్పానికి ఆనాడే చెక్కిన హైహీల్స్ పాదరక్షలను చూసి నోరువెళ్లబెట్టారని చెప్పారు. మరొక సాలభంజిక ఆహార్యంలో మినీ స్కర్ట్(పొట్టి వస్త్రాలు), మదనికల విభిన్న హెయిర్ స్టైల్స్, కాలి అందెలు, చేతి కంకణాలు తమనెంతగానో ఆకట్టుకున్నాయని సుందరీమణులు స్థానిక గైడ్లతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఆలయ గోడలపై ఈజిప్టు, పర్షియన్, రోమన్ దేశాల వనితల శిల్పాలు చూసి 13వ శతాబ్దంలోనే ఇదెలా ఎలా సాధ్యమైందంటూ గైడ్లను ప్రశ్నలమీద ప్రశ్నలు వేశారు. అలాగే, భరతముని నాట్యశాస్త్రమంతా కొలువుదీరి ఉండే నాట్యభంగిమలు, ఆ శిల్పాలలో తొణికిసలాడే సౌందర్యానికి సమ్మోహితులయ్యారు. 'ప్రపంచంలో మరెక్కడా ఇంతటి అద్భుతమైన శిల్పసౌందర్యాన్ని చూడలేదంటూ' తోటివారితో చెబుతూ సుందరీమణులు తమ సంతోషాన్ని పంచుకున్నారని గైడ్లు చెప్పారు. మిస్ వరల్డ్ పోటీదారులు నాట్యభంగిమలను అనుకరిస్తూ రకరకాల ముద్రలతో ఫొటోలు దిగడం, అమితాసక్తితో ఆలయ నిర్మాణాన్ని తిలకించడం తమను ఆశ్చర్యానికి గురి చేసిందని టి. వెంకటేష్ అనే గైడ్ చెప్పారు. కొన్ని దేశాల వారైతే శిల్పాలను చూసి ఆనందం పట్టలేక ఎగిరి గంతేసినంత పనిచేశారని విజయ్ చెప్పారు. మిస్‌వరల్డ్ పోటీదారుల్లో ఏ ఒక్కరిలోనూ తాము దర్పం, అహం భావం చూడలేదని గైడ్లు కొనియాడారు. సాధారణ భక్తుల్లాగే సాదాసీదాగా మెలిగారని, ఆలయ చరిత్ర తెలుసుకోడానికి అమితాసక్తి కనబరిచారని చెప్పారు. భూకంపాలను తట్టుకొని నిలిచేలా రామప్ప నిర్మాణంలో ఆనాడు వినియోగించిన శాండ్‌బాక్స్ టెక్నాలజీ, నీళ్లలో తేలాడే ఇటుకల ప్రత్యేకతను నిట్ విశ్రాంత ఆచార్యుడు పాండురంగారావు వారికి వివరించారు.

రవ్వకేసరి రుచిచూసి...

సంప్రదాయ దుస్తుల్లో భారతీయత ఉట్టిపడేలా సింగారించుకొని వచ్చిన సుందరీమణులు పరమశివుని పూజలో పాల్గొన్నారు. విభూతి, కుంకుమ నుదుట ధరించి... తీర్థ, ప్రసాదాలు అందుకున్నారు. పూజారి శఠగోపం పెడుతున్న సమయంలో కొందరు భామలు పసిపిల్లల్లా సంబురపడ్డారని ప్రత్యక్షంగా చూసిన వారు చెబుతున్నారు. ఇక, రవ్వకేసరి ప్రసాదాన్ని అందాల భామలు లొట్టలేసుకొని మరీ తిన్నారట



వరంగల్ కోటను పరిశీలిస్తూ...

ప్రజాసంఘాలు, మహిళల నిరసన..

మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలంటూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు నిరసనలకు దిగారు. వేయి స్తంభాల ఆలయం వద్ద మిస్ వరల్డ్ పోటీదారులు ఆలయానికి వస్తున్న క్రమంలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యు), చైతన్య మహిళా సమాఖ్య, పౌరహక్కుల సంఘం, డెమొక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు, యువకులు రోడ్డుపైకి వచ్చి ప్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో విద్య, వైద్యం సరిగ్గా అందక ప్రజలు అల్లాడుతుంటే ప్రభుత్వం అందాల భామల పేరుతో ప్రజా ధనాన్ని వృధాగా ఖర్చు చేస్తోందని నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకుని హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.





వేయిస్తంభాల ఆలయంలోని నంది విగ్రహానికి కోర్కెలు చెప్పుకొంటున్న ఓ భామ, రుద్రేశ్వరుడికి జలాభిషేకం

సుందరీమణి కాళ్లు తుడిపించారంటూ విమర్శలు



వెంకటాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీదారులు రామప్ప దేవాలయంలోకి ప్రవేశించే ముందు... వారు కాళ్లు కడుక్కునేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక తాంబాళాలు ఏర్పాటు చేశారు. స్థానిక వలంటీర్లు వారికి నీళ్లు, టవల్ అందించి కాళ్లు కడుక్కునేందుకు సహకరించారు. అయితే, వలంటీర్లలో ఒకరు ఓ సుందరీమణి కాళ్ల వద్దకి టవల్ పట్టుకుని ఉన్నట్టుగా ఉన్న వీడియో ఒకటి బయటికి రాగా ఆ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. మిస్ వరల్డ్ పోటీదారుల కాళ్లు తుడిపించి ప్రభుత్వం తెలంగాణ ఆడపడుచులను అవమానించింది అని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు.

పైసలిస్తామన్నా.. పట్టించుకోలే!

కొందరు అధికారుల నిర్లక్ష్యంతో మిస్ వరల్డ్ పోటీల స్పాన్సరర్లు వెనక్కి..

ఫలితంగా సర్కారుపై 27 కోట్ల భారం

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలకు నిధులిస్తామని ముందుకొచ్చిన స్పాన్సర్లు.. అధికారుల నిర్లక్ష్యంతో వెనక్కి వెళ్లిపోయారు. ఫలితంగా స్పాన్సర్ల నుంచి వస్తాయని ఆశించిన నిధులు రాలేదు. దీంతో పోటీల నిర్వహణకు ప్రభుత్వ వాటాగా ఖర్చు చేయాల్సిన సొమ్ము మొత్తం ఖజానా నుంచే భరించాల్సి వస్తోంది. మిస్ వరల్డ్ పోటీలకు సుమారు రూ.54 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. ఇందులో 50 శాతం అంటే రూ.27 కోట్ల వరకు మిస్ వరల్డ్ నిర్వహణ సంస్థ భరిస్తుండగా మిగతా సగం నిర్వహణ రాష్ట్రంగా తెలంగాణ ప్రభుత్వం సర్దుబాటు చేయాలి. ఈ మొత్తం రూ.27 కోట్లలో రూ.25 కోట్ల వరకు స్పాన్సర్ల నుంచి సమకూరుతుందని భావించారు. పలు సంస్థల నిర్వాహకులతో చర్చలు జరపగా స్పాన్సర్‌షిప్‌కు అంగీకరించారు. కానీ కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి స్పాన్సర్లను పట్టించుకోకపోవడంతో వెనక్కి వెళ్లిపోయారు. మిస్ వరల్డ్ పోటీలతో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు, పర్యాటక కేంద్రాలు, చారిత్రాత్మక ప్రాశస్త్యం ఉన్న ప్రాంతాలు, హస్తకళా ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు పరిచయం కావడంతో పాటు తమ తమ సంస్థలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందని జాతీయ బ్యాంకులు, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఇతర వ్యాపార వాణిజ్య సంస్థలు స్పాన్సర్‌షిప్‌కు ముందుకొచ్చాయి. దీంతో ప్రభుత్వం ఖజానాపై భారం పడకుండా ఆయా సంస్థల సహకారంతో మిస్ వరల్డ్ పోటీలను అట్టహాసంగా నిర్వహించేందుకు పర్యాటక శాఖ ద్వారా ప్రణాళికలు సిద్ధం చేసింది. మిస్ వరల్డ్ నిర్వహణ సంస్థ ప్రతినిధుల సమన్వయంతో మే 10 నుంచి 31 వరకు మిస్ వరల్డ్ పోటీదారులతో భారీ ఎత్తున కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో పర్యాటక శాఖ అధికారులు వివిధ శాఖల సమన్వయంతో మిస్ వరల్డ్ పోటీదారులు హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించేలా ఏర్పాట్లు చేశారు. ఏ కార్యక్రమానికి ఎవర్ని స్పాన్సర్‌గా ఎంపిక చేయాలో, ఏ మేరకు ఆర్థిక సాయం పొందాలో ఖరారు చేసే బాధ్యత ప్రభుత్వం పర్యాటక శాఖ అధికారులకు అప్పగించింది. స్పాన్సర్లను ఆహ్వానించి చర్చించే బాధ్యతలు తీసుకున్న అధికారుల్లో కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆయా సంస్థలు వెనక్కి వెళ్లిపోయినట్టు తెలిసింది. దీంతో భారం సర్కారు ఖజానాపై పడింది.

గురుకులాలకు నిత్యావసరాలు, కాస్మెటిక్స్..

సరఫరా బాధ్యత మహిళా సంఘాలకు

రాష్ట్ర సర్కారు సూత్రప్రాయ నిర్ణయం

- వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలుకు కసరత్తు
- త్వరలో సీఎంకు సమగ్ర నివేదిక

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సాధారణ గురుకులాలతోపాటు ఇతర ఎస్సీ, బీసీ వసతి గృహాలకు నిత్యావసరాలు, కాస్మెటిక్స్‌ను మహిళా సంఘాల ద్వారా సరఫరా చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీంతో విద్యార్థులకు నాణ్యమైన సరుకులు అందడమేకాకుండా మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతమయ్యే అవకాశం ఉంటుందని భావిస్తోంది. కాస్మెటిక్స్ విక్రయాల కోసం గురుకులాల వద్ద మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయించాలని, విద్యార్థులు నేరుగా వెళ్లి వారికి అవసరమైనవి కొనుక్కునే అవకాశం కల్పించాలనుకుంటోంది. మరోవైపు మండల పరిధిలోని గురుకులాలు, ఇతర వసతి గృహాలకు తాజా కూరగాయలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈమేరకు మాతృదినోత్సవం సందర్భంగా ఈ అంశాలన్నింటిపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో చర్చించినట్టు తెలిసింది. గురుకులాలకు వస్తువుల సరఫరా బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించే అంశంపై సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించినట్టు సమాచారం. విద్యార్థులకు అవసరమైన ప్లేట్లు, గ్లాసులు, ట్రంక్‌పెట్టెలు, బూట్లు, బ్యాగులు, టై, బెల్టు, బకెట్లు, ఎడ్యుకేషన్ కిట్లు, స్పోర్ట్స్ డ్రెస్సులు, కాస్మెటిక్స్ తదితరాల సరఫరాకు రాష్ట్రస్థాయి లో టెండర్లు పిలవాలని... కూరగాయలు, పళ్లు, నిత్యావసరాల సరఫరా బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించనున్నట్టు తెలిసింది. కాస్మెటిక్స్‌ను సెంట్రలైజ్డ్ టెండర్లలో కూడా మహిళా సంఘాలకు లబ్ధి చేకూరే విధానాలేమి ఉన్నాయో అధ్యయనం చేయాలని సూచించినట్టు తెలుస్తోంది. చికెన్, కోడిగుడ్ల సరఫరాను ఏజెన్సీలకు అప్పగించే యోచనలో ఉన్నట్టు సమాచారం. వచ్చే విద్యా సంవత్సరం నుంచే మహిళా సంఘాల ద్వారా సరఫరా చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు సమగ్ర నివేదికను సిద్ధం చేసి త్వరలోనే సీఎంకు సమర్పించనున్నట్టు అధికారికవర్గాలు చెబుతున్నాయి.

గుత్తేదారు వ్యవస్థకు స్వస్తి!

గురుకులాల్లో నిత్యావసరాలు, కాస్మెటిక్స్‌కు సంబంధించి గుత్తేదారు వ్యవస్థకు స్వస్తి పలికి.. దాని స్థానంలో మండల కేంద్రాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు మహిళా సంఘాలకు బాధ్యతలను అప్పగించనున్నారు. తల్లులు ఇంట్లో తమ పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని ఎంత బాధ్యతగా అందిస్తారో.. గురుకులాలకు కూడా అదే స్థాయిలో మహిళలు నాణ్యమైన కూరగాయలు, నిత్యావసరాలను అందిస్తారని ప్రభుత్వం భావించడమే ఇందుకు కారణం. అదే విధంగా పిల్లలకు ప్రతి ఏటా ప్రభుత్వం ఉచితంగా అందించే యూనిఫారమ్ విషయంలోనూ నేతన్నలతో మాట్లాడి, ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

12 లక్షల మంది విద్యార్థులు..

గురుకులాలకు నిత్యావసరాలు, కాస్మెటిక్స్ కూరగాయల సరఫరాకు సంబంధించి మహిళలకు కొన్ని బడా కంపెనీలతో ప్రత్యేక శిక్షణను ఇప్పించా లని ప్రాథమికంగా నిర్ణయించారు. వ్యాపారంలో మెళకువలు నేర్పి నష్టంరాకుండా చూడవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇక కూరగాయల సరఫరా విషయంలో అత్యంత జాగ్రత్త వహించేలా చర్యలు తీసుకోనున్నారు. కనీసం రెండ్రోజులకు సరిపడా నిత్యావసరాలు గురుకులాలు, హాస్టళ్లలో ఉండేలా చూడనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సాధారణ గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ (కేజీబీవీ), ఏకలవ్య మోడల్ స్కూల్, అర్బన్ రెసిడెన్షియల్, ప్రత్యేక పాఠశాలలు కలిపి 2,053 ఉండగా.. సుమారు 10,12,603 మంది విద్యార్థులున్నారు. ఇవీ కాక ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల 1,698ఉండగా.. వీటిలో దాదాపు 1,93,399 మంది ఉంటున్నారు. మొత్తంగా 3,751 పాఠశాలలు, హాస్టళ్లలో కలిపి దాదాపు 12,06,002 మంది విద్యార్థులు ఉంటారు. వీరి భోజనాల కోసం ఆయా గురుకులాలు టెండర్లు పిలిచి సరుకులు సరఫరా చేయిస్తున్నారు.

గురుకుల విద్యార్థులకు స్మార్ట్ కార్డులు..

కాస్మెటిక్స్ కొనేందుకు విద్యార్థులకే ప్రత్యేక స్మార్ట్ కార్డు ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దుకాణానికి వెళ్లి అవసరమైనవి కొనుక్కోవడంతో పాటు డబ్బును ఖర్చు చేసే తీరు పిల్లలకు తెలుస్తుందని, దీంతో ఆర్థిక నిర్వహణపై వారికి అవగాహన ఏర్పడుతుందని భావిస్తున్నారు. కాస్మెటిక్స్‌కు అవసరమయ్యే నగదును గురుకులాల అధికారులు స్మార్ట్ కార్డులో జమచేస్తారు. కాస్మెటిక్స్ విక్రయించే మహిళా సంఘాల దుకాణాల్లోనే ఆ కార్డు పనిచేస్తుంది. కార్డులో ఎంత నగదు ఉంది, వేటికి ఎంత ఖర్చు చేశారన్న వివరాలు విద్యార్థులకు తెలుస్తాయి.

సరిహద్దు ఉద్రిక్తతలతో..

అందాల పోటీలకు ముడిపెట్టొద్దు

- 'మిస్ వరల్డ్'పై పసలేని విమర్శలు
- తెలంగాణ సంస్కృతి చరిత్రకు ప్రతీక
- పర్యాటకాభివృద్ధే లక్ష్యంగా పోటీలు
- మంత్రి కొండా సురేఖ



హనుమకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): సరిహద్దుల్లో ఉద్రిక్తతలకు, అందాల పోటీలకు ముడిపెట్టొద్దని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచసుందరి అందాల పోటీల నిర్వహణపై కొందరు పసలేని విమర్శలు చేస్తుండడాన్ని ఆమె ఖండించారు. వరంగల్ కోట ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన 'మిస్ వరల్డ్' పోటీదారులతో నిర్వహించిన హెరిటేజ్ వాక్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు ప్రారంభం కావడానికి ఏడాది ముందే అందాల పోటీల నిర్వహణ కసరత్తు మొదలైందని గుర్తుచేశారు. ఓరుగల్లు అంటేనే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రకుకు నిలువెత్తు నిదర్శనమన్నారు. మిస్‌వరల్డ్ పోటీలు ప్రపంచ వేడుక అని, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటేందుకు ఇది చక్కటి అవకాశమని అన్నారు. వరంగల్ భవ్య, దివ్య, నవ్య నగరంగా పేర్గాంచిందని, ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ సంపద, చారిత్రక ప్రదేశాలు గొప్ప అనుభూతిని కలిగిస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో వరంగల్ నగరాన్ని రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. త్వరలో మామునూరుకు ఎయిర్‌పోర్టు రానుందన్నారు.

అందాల పోటీల కోసం పేదల ఇళ్లు కూలుస్తారా?

- ఈ చర్యలపై రాహుల్ సమాధానం చెప్పాలి: కేటీఆర్

హైదరాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): అందాల పోటీల కోసం పేదల ఇళ్లు కూలుస్తారా? ఇదేనా ప్రజాపాలన అంటూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. అందాల పోటీలో పాల్గొనేవారి పర్యటన కోసం వరంగల్‌లో దారివెంట ఇళ్ల ధ్వంసం అప్రజాస్వామికమన్నారు. కాంగ్రెస్ అరాచక పాలనా విధానంపై, అమానవీయ చర్యలపై రాహుల్ గాంధీ స్పందించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదప్రజల జీవితాలు రాక్షస బుల్డోజర్లకింద నలిగిపోవాలా అని ప్రశ్నించారు. పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాగా, ప్రపంచసుందరి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చినవారి కాళ్లను తెలంగాణ మహిళలతో కడిగించడం అభ్యంతరకరమని.. ఇది మొత్తం తెలంగాణ సమాజాన్ని అవమానించినట్లేనని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు.

ఈఎస్ఐలో ఆటోమేటెడ్ టోకెన్!

» త్వరలో ప్రవేశపెడతామన్న ఆస్పత్రి కమిటీ సభ్యుడు

» 'ఆంధ్రజ్యోతి' ఫొటో వార్తకు స్పందన

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో త్వరలోనే ఆటోమేటెడ్ టోకెన్ విధానాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆస్పత్రి డెవలప్‌మెంట్ మెంబర్, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ తెలిపారు. ఈఎస్ఐ ఆస్పత్రిలో ఓపీ కోసం చిరుద్యోగులతో తీవ్ర రద్దీ నెలకొంటున్న నేపథ్యంలో బుధవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'ఈఎస్ఐ ఓపీ కౌంటర్.. జనసముద్రం' అనే శీర్షికతో ఫొటో వార్తను ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పందిస్తూ సనత్‌నగర్ ఈఎస్ఐని సందర్శించాల్సిందిగా ఆస్పత్రి డెవలప్‌మెంట్ మెంబర్ మనోహర్‌ను ఆదేశించారు. దీంతో బుధవారం మనోహర్ ఈఎస్ఐ ఆస్పత్రికి చేరుకొని డీన్ శిరీష్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. అనంతరం ఆయనతో పాటు ఆస్పత్రి ఓపీ, వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు త్వరిత సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి అధికారులకు మనోహర్ సూచించారు.


ప్రమాణ స్వీకారం అనంతరం సమాచార కమిషనర్లతో సీఎం రేవంత్

యుద్ధంలో మేమే ముందున్నాం

» బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డితో సీఎం సరదా సంభాషణ

» సమాచార కమిషనర్లకు శుభాకాంక్షలు తెలిపిన రేవంత్

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): భారత్- పాకిస్థాన్ యుద్ధం విషయంలో బీజేపీ కంటే కాంగ్రెసే ముందుందని, బీజేపీ కంటే ముందే కాంగ్రెస్ ఎప్పుడో యుద్ధం చేసి చూపించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం సచివాలయంలో సమాచార హక్కు చట్టం కమిషనర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై, వెళ్తున్న క్రమంలో బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి.. సీఎంకు ఎదురుపడ్డారు. ఆ సందర్భంగా సీఎం రేవంత్ ఆయనతో కొద్దిసేపు సరదాగా మాట్లాడారు. యుద్ధం విషయంలో మీకంటే మేమే ముందున్నామన్న సీఎం వ్యాఖ్యలకు ఎమ్మెల్యే రాకేశ్ స్పందిస్తూ.. మేము చేయాల్సింది చేశాం.. ఇంకా చేయాల్సింది చాలా ఉందని, ఇంకా అయిపోలేదని అన్నారు. కాగా, అంతకుముందు రాష్ట్ర సమాచార హక్కు కమిషన్‌కు నియామకమైన బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్, పర్వీన్, దేశాల భూపాల్‌లను కమిషనర్లుగా సచివాలయంలో ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ కార్యక్రమానికి సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు.

క్యాన్సర్ బాధిత కుటుంబానికి అండగా సీఎం

» సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.12 లక్షలు అందజేత

» నాలుగు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో కథనం

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధిత కుటుంబాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదుకున్నారు. తక్షణ చికిత్స కోసం లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) కింద రూ.5 లక్షలు అందించగా.. చికిత్స అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మరో రూ.7 లక్షలను మంజూరు చేశారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో బాధితుడు సాయిచరణ్‌కు రూ.7 లక్షల చెక్కును అందించారు. సిద్దిపేటకు చెందిన సాయిచరణ్ (35)కు జన్యు మార్పిడి కారణంగా కోటి మందిలో ఒకరికి వచ్చే అరుదైన అక్యూర్డ్ మైలాయిడ్ లుకేమియా (బ్లడ్ క్యాన్సర్) బారిన పడ్డారు. అతని చికిత్సకు కుటుంబ సభ్యులు సిద్దిపేట మండలం ఎన్సాన్‌పల్లిలోని తమ ఇంటిని విక్రయించారు. అయినప్పటికీ చికిత్సకు అవసరమైనంత డబ్బులు సరిపోకపోవడంతో సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సీఎం తక్షణ సాయంగా మంజూరు చేసిన రూ.5 లక్షలతో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో సాయిచరణ్‌కు స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ పూర్తయింది. తాజాగా చికిత్సకు అదనంగా వ్యయమైన మరో రూ.7 లక్షలను సీఎంఆర్ఎఫ్ ద్వారా సీఎం రేవంత్ చెక్కును సాయిచరణ్ కుటుంబ సభ్యులకు అందించారు. కాగా సాయిచరణ్ సమస్యను వివరిస్తూ "మా నాన్నను బతికించండి" శీర్షికన ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం తథ్యం

» జూన్ 2 లేదా డిసెంబరు 9లోగా: ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

హైదరాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయబోతున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ జోస్యం చెప్పారు. జూన్ 2 తర్వాత లేదా డిసెంబరు 9లోగా విలీనం తథ్యమని తెలిపారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఒప్పందం కుదిరి, కేసీఆర్ నాడు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి విలీనం చేయబోతున్నారని చెప్పారు. కాంగ్రెస్‌కు చెందిన ప్రముఖ న్యాయవాదిని రాజ్యసభకు పంపడం, ఇరు పార్టీల మధ్య అంతర్గత ఒప్పందాన్ని స్పష్టం చేస్తోందన్నారు. అందుకే బీఆర్ఎస్ నేతలపై వివిధ కేసుల్లో విచారణ మందకొడిగా జరుగుతోందని ఆరోపించారు. సీఎం మార్పు కూడా జరగనుందని జోస్యం చెప్పారు.

ఆ విలీనం జరగకుంటే బీజేపీని నిషేధిస్తారా?

» ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు అద్దంకి దయాకర్ సూటి ప్రశ్న

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం కానున్నట్లు నీకు ఎవరు చెప్పారు? నువ్వు చెప్పినట్లుగా జూన్ 2న లేదా.. డిసెంబరు నెలలో విలీనం కాకుంటే.. తెలంగాణలో బీజేపీని నిషేధిస్తారా?" అంటూ బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. అబద్ధాలు ప్రచారం చేయడంలో బీజేపీ వాళ్లు దిట్టలు అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్‌లలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఎవరి వర్గమో చెప్పాలన్నారు. గతంలోనూ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఈ విధంగానే కారుకూతలు కూస్తే ఏమైందో అందరికీ తెలుసని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ డీఎన్ఏ ఒక్కటేనని, కమలం కాడకు గులాబీ పువ్వును అంటు కట్టారన్నారు. వచ్చే టర్మ్‌లోనూ రేవంత్‌రెడ్డే సీఎం కానున్నారన్న సంగతిపై బీజేపీ నేతలకు స్పష్టత ఉందని, అందుకే ఇలా మాట్లాడుతున్నారని ఆయన అన్నారు.

టీపీసీసీకి మూడ్రోజుల్లో కొత్త కార్యవర్గం!

» అధిష్ఠానంతో మహేశ్‌గౌడ్ భేటీ

న్యూఢిల్లీ, మే 14 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ కొత్త కార్యవర్గ నియామకం ఓ కొలిక్కి వచ్చినట్టు సమాచారం. కాంగ్రెస్ అధిష్ఠానం రెండు, మూడు రోజుల్లో నూతన కమిటీని ప్రకటించే అవకాశముంది. బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. కేసీ నివాసంలో సుమారు గంటసేపు జరిగిన సమావేశంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ కమిటీలకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు. నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారిని పార్టీ పదవుల్లో తీసుకోకూడదనే అంశంపై చర్చ జరిగినట్లు సమాచారం. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో పార్టీ పదవుల్లోకి తీసుకుంటే.. వారిని నామినేటెడ్ పదవికి రాజీనామా చేయించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే సిద్ధం చేసిన జాబితాపై తుది చర్చలు జరిగాయని.. 100 మందితో జంబో కార్యవర్గం ఏర్పాటు అవుతుందని తెలుస్తోంది.

నేటి నుంచి సరస్వతి పుష్కరాలు

కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమం వద్ద విస్తృత ఏర్పాట్లు.. నేడు పుష్కర్ ఘాట్‌కు సీఎం

భూపాలపల్లి, హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): సరస్వతి నది పుష్కరాలకు రాష్ట్రంలో సర్వం సిద్ధమైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమంలో గురువారం తెల్లవారుజాము నుంచి పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. శ్రీ మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద సరస్వతి.. పుష్కరాలకు అంకురార్పణ చేయనున్నారు. గురువారం ఉదయం 5.44 గంటలకు ప్రారంభమయ్యే పుష్కరాలు ఈ నెల 26వ తేదీ వరకు 12 రోజుల పాటు కొనసాగుతాయి. సీఎం రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం 4 గంటలకు కాళేశ్వరం వస్తారు. త్రివేణి సంగమం వద్ద సిద్ధం చేసిన సరస్వతి ఘాట్‌ను ప్రారంభిస్తారు. అలాగే, సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం నదిలో పుణ్యస్నానం ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుంటారు. సాయంత్రం 5.30 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద జరిగే సరస్వతి నదీ హారతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు స్వగ్రామం, కాటారం మండలం ధన్వాడకు రోడ్డు మార్గంలో వెళ్లి రాత్రి భోజనం అనంతరం హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు. కాగా, పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలోని ముక్తీశ్వర క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రాష్ట్రం నలుమూలల రోజుకు 40వేల నుంచి 50వేల మంది భక్తులు పుష్కరాలకు వస్తారని అధికారుల అంచనా. భక్తుల పుణ్యస్నానాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జ్ఞాన సరస్వతి ఘాట్‌లలో అధికారులు వసతులు సిద్ధం చేస్తున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ 33 జిల్లాల నుంచి 220 ప్రత్యేక బస్సులు నడపనుంది. 1700 మంది పోలీసులు భద్రత విధుల్లో పాల్గొంటున్నారు. కాగా, త్రివేణి సంగమం వద్ద ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి 11గంటల వరకు యాగాలు జరుగుతాయి. సాయంత్రం 6.45 నుంచి 7.35 వరకు సరస్వతి ఘాట్‌లో సరస్వతి నవరత్న మాలహారతి నిర్వహిస్తారు. కాళేశ్వరం యాప్, వెబ్ సైట్ ద్వారా వివిధ సేవలను అందుబాటులోకి తెచ్చామని మంత్రి కొండా సురేఖ తెలిపారు.


కాళేశ్వరంలోని పుష్కరఘాట్ వద్ద సాగుతున్న పనులు

ఇంజనీర్ల పని నేతలు చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ, "శ్రీశైలం, శ్రీరాంసాగర్‌లు సాంకేతిక పరిజ్ఞానం లేనప్పుడే కట్టారు. ఎన్ని ఉపద్రవాలు, వరదలు వచ్చినా ఆ ప్రాజెక్టులు నిటారుగా నిలబడ్డాయి. 22 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిన సాగర్‌కుగానీ, 2009లో సామర్థ్యానికి మించి వరదలు వచ్చినా శ్రీశైలం ప్రాజెక్టుకుగానీ ఏమీ కాలేదు. చెక్కు చెదరకుండా నిలబడ్డాయి. సాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్‌ల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదు. కానీ, కాళేశ్వరంపై సీఎంగా బాధ్యతలు చేపట్టేనాటికి రూ.1.02 లక్షల కోట్లు బిల్లులు చెల్లించగా.. మరో రూ.10 వేల కోట్ల బిల్లులు బకాయి ఉన్నాయి. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా.. 50 వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదు. రూ.1.02 లక్షల కోట్లతో నిర్మించి.. మూడేళ్లలోపే కుప్పకూలిన ప్రాజెక్టు భూప్రపంచంలోనే లేదు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంజనీర్లు సాగర్, శ్రీశైలం, ఉస్మాన్‌సాగర్‌లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎలా కట్టకూడదో అనేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు ఉదాహరణ అని పేర్కొన్నారు.

భావోద్వేగంతో నడిపించారు..

నీళ్లు, నిధులు, నియామకాలను భావోద్వేగంగా మార్చి.. రాజకీయం చేసి, రెండుసార్లు ప్రభుత్వాన్ని నడిపించారని బీఆర్ఎస్‌నుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పదేళ్లలో కేవలం సాగునీటి ప్రాజెక్టులపై రూ.2 లక్షల కోట్లు ఖర్చుపెట్టారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వాయిదా పడుతూ, నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులు ఒక్కటి కూడా పూర్తి కాలేదంటే.. దీనికి కారణాలేంటో శాఖలో చేరే ఇంజనీర్లు ఆలోచన చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన పదేళ్లలో ఏ ప్రాజెక్టూ పూర్తికాలేదని, కానీ.. రూ.2 లక్షల కోట్లు ఖర్చయ్యాయని విమర్శించారు. నిధులు వరదలా పారాయని, అవి ఎవరి జేబుల్లోకి వెళ్లాయో ఆలోచన చేయాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికే ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీటిపారుదల శాఖను కేటాయించామని, అందుకే ఈ శాఖలో నియామకాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు.


జలసౌధలో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు ఉత్తమ్ పొన్నం, తదితరులు

30 ఏళ్లు పనిచేస్తేనే ఈఎన్‌సీ..

"కాలం కలిసివస్తే రెండు మూడేళ్లలో ఎమ్మెల్యే కావొచ్చు. కానీ, ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) కావాలంటే మాత్రం 30 ఏళ్ల సర్వీసు చేయాల్సిందే. కాలిగోటితో వచ్చిన అవకాశంతో గాలి మోటార్‌లలో తిరుగుతూ.. ఇక్కడ బ్రిడ్జిలు, బ్యారేజీలు కట్టాలని చెబితే ఎలా జరుగుతుందో చెప్పేందుకు కళ్లముందు కాళేశ్వరం ఉంది. అందుకే ఎవరైనా అధికారులు, రాజకీయ నాయకులు పరిమిత జ్ఞానంతో చెప్పిన పని చేస్తే... తరువాత ఊచలు లెక్కబెట్టాల్సింది మీరే. ఏది పడితే అది కళ్లు మూసుకొని చేస్తే ఇబ్బందులు తప్పవు. మీరు కట్టే ప్రాజెక్టులు భవిష్యత్తు తరాలకు మేలు చేయాలి. సరైన అంచనాలు వేసుకొని, ఎవరిపని వారే చేయాలి. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు ఉంటుందో, ఏది పోతుందో తెలియడం లేదు. ఏ ప్రాజెక్టును చూసినా గాలిలో పేకమేడల్లాగా కూలుతున్నాయి. ప్రతి ప్రాజెక్టును సమగ్రంగా అధ్యయనం చేస్తున్నాం. 75% పూర్తయిన ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నిధులు వెచ్చించడానికి ఇబ్బందులు ఉన్నాయి. అయినప్పటికీ కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, సమ్మక్క, దేవాదులను ప్రాధాన్య జాబితాలో పెట్టి, పూర్తిచేయాలని నిర్ణయం తీసుకున్నాం" అని రేవంత్ వివరించారు.

గ్రూప్-1పై రాజకీయ ప్రేరేపిత పిటిషన్..

ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్లు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూశారని, తాము అధికారంలోకి వచ్చి నోటిఫికేషన్ ఇస్తే.. అది వద్దంటూ ధర్నాలు చేసే పరిస్థితి వచ్చిందని సీఎం అన్నారు. "14 నెలల్లో 60 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టాం, ప్రైవేట్‌లో లక్ష ఉద్యోగాలు ఇచ్చాం. గ్రూప్-1 నియామక ప్రక్రియను కొందరు రాజకీయ ప్రేరేపిత పిటిషన్లు వేసి అడ్డుకున్నారు. లేకుంటే ఈ రోజు 563 మందికి ఉద్యోగాలు వచ్చేవి. అర్హత లేనివారు పిటిషన్లు వేశారు. దీని వెనక రాజకీయ నాయకులు, పార్టీలు ఉన్నాయి. త్వరలోనే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 నియామకాలు పూర్తి చేస్తాం" అని సీఎం చెప్పారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టుల విషయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాధించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకెళుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల ప్రక్రియను సులభతరం చేయండి

తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని వివిధ రకాల నిర్మాణాలు, ఇతర సదుపాయాల కల్పనకు సంబంధించిన అనుమతుల ప్రక్రియ సులభతరంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక అందించాలని ఆదేశించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పౌరసేవలు, అనుమతులపై సచివాలయంలో బుధవారం సీఎం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఔటర్ రింగురోడ్డు (ఓఆర్ఆర్) లోపల జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్‌లో వివిధ రకాల నిర్మాణాలకు ప్రజలు పలు విభాగాలకు దరఖాస్తు చేసుకుని ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. అవసరమైన సేవలన్నీ ఒకేచోట లభించేలా సింగిల్‌విండో విధానం ఉండాలని సూచించారు. ఇందుకోసం రెవెన్యూ, పురపాలక, జలవనరులు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్తు విభాగాలు సంయుక్తంగా పని చేయాలన్నారు. ఆయా శాఖలు వసూలు చేసే బిల్లులు సైతం సింగిల్ విండో విధానంలో ఒకే చోట చెల్లించే విధానం ఉండాలన్నారు. ఈ నేపథ్యంలో ఆస్తులు, వనరుల గుర్తింపునకు లైడార్ సర్వే చేయాలని, సులభతర విధానాల అధ్యయనానికి నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. మెరుగైన పౌర సేవలను అందించేందుకు శాఖల విభజనలో ఏకరూపత ఉండాలన్నారు. ఏ కారణం లేకుండా అనుమతులను నిరాకరించడానికి వీల్లేదని పేర్కొన్నారు. ఏ కారణంతోనైనా అనుమతులు ఆలస్యమైతే ఆ విషయం దరఖాస్తుదారులకు తెలియజేయాలని, వాటి పరిష్కారానికి ఏం చర్యలు తీసుకోవాలో కూడా అధికారులే సూచించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు

» భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నుంచి భూభారతి చట్టం అమల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.



గత పదేళ్లుగా రాష్ట్రంలో పేరుకుపోయిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఆశయంతో ఏప్రిల్ 14న భూభారతి చట్టాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల మొత్తం రెవెన్యూ సేవలు ప్రజలకు దూరమయ్యాయని పేర్కొన్నారు. ఈ వ్యవస్థను ప్రజలకు చేరువ చేసి మెరుగైన సేవలను అందిస్తామని బుధవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో తొలుత ప్రయోగాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, రెండో దశలో భాగంగా మే 5వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మరో 28 మండలాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా మండలాల్లో ఎదురైన సమస్యలను దృష్టిలో పెట్టుకుని జూన్ 2 నుంచి అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. సాదా బైనామాలకు సంబంధించి కోర్టులో కేసు ఉన్నందున, స్టే ఎత్తి వేసిన వెంటనే సమస్యకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

కొత్త పార్టీ పెట్టే యోచనలో కవిత: టీపీసీసీ

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. కొత్త పార్టీ పెట్టే యోచనలో ఉన్నారని, ఈ మేరకు తమకు విశ్వసనీయ సమాచారం ఉందని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆమె నిర్ణయాన్ని కాంగ్రెస్ స్వాగతిస్తోందని చెప్పారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో బీసీలు, మహిళలకు అన్యాయం జరిగిందని, పదేళ్ల పాలనలో సామాజిక తెలంగాణను నిర్మించలేకపోయామని ఒప్పుకొన్నందుకు కవితకు ధన్యవాదాలు తెలుపుకొంటున్నామన్నారు. కొత్తగా పార్టీ పెడుతున్న కవిత.. కేసీఆర్ నియంత పోకడలను అనుసరించవద్దని హితవు పలికారు. తనను జైల్లో వేసిన బీజేపీతో కలిసి బీఆర్ఎస్ ఆడుతున్న నాటకాలను కవిత జీర్ణించుకోలేక పోతున్నారన్నారు.

కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధించాలి

» సమ్మక్క సాగర్‌కు త్వరలోనే ఎన్‌వోసీ

» ఈ దఫా ప్రాధాన్య ప్రాజెక్టులకే నిధులు

» 5 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వడమే లక్ష్యం

» ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల్లో న్యాయమైన 70 శాతం వాటా సాధించేలా ట్రైబ్యునల్‌లో బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం రాత్రి జలసౌధలో నీటి పారుదల ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. 'పోలవరం ప్రాజెక్టు నుంచి కృష్ణా డెల్టాకు తరలించే నీటికి బదులుగా సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీలు వాడుకోవాలని బచావత్ ట్రైబ్యునల్ వెసులుబాటు ఇచ్చింది. 35 టీఎంసీలను మహారాష్ట్ర, కర్ణాటక వాడుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నందున... మిగిలిన 45 టీఎంసీలపై తెలంగాణకే పూర్తి హక్కు ఉంది. ఆ నీటిని దక్కేలా చూడాల'ని సీఎం సూచించారు. సమ్మక్కసాగర్ బ్యారేజీకి ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) వారం రోజుల్లో రానుందని, ఆ తర్వాత కేంద్ర జలవనరుల సంఘం నుంచి ప్రాజెక్టు డీపీఆర్‌కు క్లియరెన్స్ సాధించాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిధులన్నీ ప్రాధాన్య ప్రాజెక్టులకు ఇస్తామని, 5 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వడమే లక్ష్యమని చెప్పారు. రూ.లక్షల కోట్లు పెట్టిన కాళేశ్వరంలోని బ్యారేజీ కుంగిందని, పట్టుమని 50 వేల ఎకరాలకు నీరు అందించలేని పరిస్థితి ఉందన్నారు. కాబట్టి తక్కువ నిధులతో ఎక్కువ ఆయకట్టు అందించే ప్రాజెక్టులు పూర్తి చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2027 జూన్ నాటికి కృష్ణా బేసిన్‌లో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసేలా లక్ష్యం నిర్దేశించుకోవాలన్నారు. ఎస్ జైపాల్‌రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఉద్ధండపూర్ దాకా పూర్తి చేయడానికి తొలిప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. కోయిల్‌సాగర్ లిఫ్టును 2026 జూన్‌లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి, జవహర్ నెట్టెంపాడు, రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకాలను ఈ ఏడాది డిసెంబరుకల్లా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రణాళిక సంఘం ఉప చైర్మన్ చిన్నారెడ్డి, జగ్గారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సీఎంవో కార్యదర్శి మాణిక్యరాజ్ కన్నన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ్‌ను సీఎం అని సంబోధించిన రేవంత్

సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ముఖ్యమంత్రి అని.. సీఎం రేవంత్‌రెడ్డి సంబోధించారు. సాగునీటి పారుదల శాఖకు సంబంధించి ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ఎస్ఎల్‌బీసీ గురించి ప్రస్తావిస్తూ.. ఉత్తమ్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాక ఆ ప్రాజెక్టులో కదలిక వచ్చిందని పేర్కొన్నారు.

అజ్ఞానిలా రేవంత్‌రెడ్డి మాటలు

» అధికారులను ఉరితీయాలని నివేదికలు చెబుతాయా?

» ఏ జ్ఞానంతో కాళేశ్వరం కూలిందంటున్నారు?: హరీశ్

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ అజ్ఞానిలా మాట్లాడారని మాజీ మంత్రి హరీశ్ ఆరోపించారు. రాజకీయ నాయకుల సూచనలు పాటిస్తే ఊచలు లెక్కపెడతారని ఇంజనీర్లను హెచ్చరించడం ఏంటని నిలదీశారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్నవారిలో ఉత్సాహం నింపాల్సిందిపోయి హెచ్చరికలతో భయభ్రాంతులకు గురిచేయడం ముఖ్యమంత్రికి తగదన్నారు. రేవంత్ రోజురోజుకూ సీఎం పదవికి ఉన్న గౌరవాన్ని దిగజార్చుతున్నారని మండిపడ్డారు. అధికారులను ఉరితీయాలని విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికలు చెబుతాయా? ఇది ప్రజాస్వామ్యమా? రేవంత్ రాచరిక రాజ్యమా? అని బుధవారం ఎక్స్‌లో హరీశ్ ప్రశ్నించారు. ఇంత అజ్ఞానం ఉన్న వ్యక్తి సోమాలియా నుంచి అమెరికా వరకు ఎక్కడా కనిపించరని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించినట్లు అసెంబ్లీ సాక్షిగా విడుదల చేసిన శ్వేతపత్రంలోనే ప్రకటించారని.. మళ్లీ ఇప్పుడు 50 వేల ఎకరాలకు కూడా నీళ్లివ్వలేదంటూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారన్నారు. రాజకీయాలు మాట్లాడడం తప్ప, కుప్పకూలిన ఎస్ఎల్‌బీసీ భవితవ్యం గురించి ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో రూ.3900 కోట్లతో 12 కిలోమీటర్ల సొరంగం పనులు పూర్తి చేసింది వాస్తవం కాదా? ముఖ్యమంత్రి దీనిపై చర్చకు సిద్ధమా? అని హరీశ్ సవాల్ విసిరారు.

లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా బాలశౌరి

» సభ్యుడిగా తెలంగాణ నుంచి రఘునందన్‌రావుకు చోటు

న్యూఢిల్లీ, మే 14(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా జనసేన ఎంపీ బాలశౌరి నియమితులయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో తెలంగాణ నుంచి బీజేపీ ఎంపీ ఎం.రఘునందన్‌రావుకు చోటు లభించింది. మొత్తం 15 మంది సభ్యులకు గానూ 13 మందిని స్పీకర్ ఓం బిర్లా నామినేట్ చేయగా రెండు ఖాళీలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలోనూ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా ఎంపీ బాలశౌరి పదవీ బాధ్యతలు నిర్వహించారు.

అన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్

» ఇప్పటికే 47 చోట్ల.. జూన్ నుంచి 97 కార్యాలయాల్లో..

» ఇక దస్తావేజులపై ఆధార్-ఈ సంతకం

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోల స్లాట్ బుకింగ్ విధానాన్ని అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వాటిలో 47 కార్యాలయాల్లో ఇప్పటికే స్లాట్ బుకింగ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. మిగిలిన 97 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జూన్ నుంచి స్లాట్ బుకింగ్‌ను అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. రిజిస్ట్రేషన్ల రద్దీ అధికంగా ఉండే కార్యాలయాల్లో అవసరమైన అదనపు సిబ్బంది నియామకం, కార్యాలయాల విలీన ప్రక్రియ చేపట్టారు. స్లాట్ బుకింగ్‌కు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, కొత్త అప్లికేషన్లను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఏప్రిల్ 10వ తేదీ నుంచి తొలిదశలో 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌ను అమల్లోకి తీసుకొచ్చిన ప్రభుత్వం.. మే 12వ తేదీ నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. సానుకూల ఫలితాలు వస్తున్నాయని, దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు వస్తున్న వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. లోటుపాటులను సరిదిద్ది దళారీ వ్యవస్థకు తావులేకుండా పూర్తిస్థాయిలో ఈ విధానాన్ని అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ఇక దస్తావేజుల రిజిస్ట్రేషన్ సమయంలో సంతకాల కోసం ఎక్కువ సమయం పడుతోంది. ఈ వ్యవధిని తగ్గించడంతో పాటు సురక్షితమైన ధ్రువీకరణతో వ్యక్తి గుర్తింపును నిర్ధారించేలా ఆధార్-ఈ సంతకాన్ని అందుబాటులోకి తేనున్నారు. ఇప్పటికే ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ విధానం అమల్లో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా జూన్ నుంచి దీన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విధానంతో వ్యక్తుల ఆధార్ సంఖ్యను ఉపయోగించి దస్తావేజులపై ఎలక్ట్రానిక్ పద్ధతిలో సంతకం చేసే వెసులుబాటు ఉంటుంది. ఇంటర్నెట్ సదుపాయం ఉన్న ప్రాంతాల్లో ఆధార్ సంఖ్యను నమోదు చేసిన మొబైల్ నంబరు ఉంటే ఎక్కడి నుంచైనా దస్తావేజులపై ఆధార్-ఈ సంతకం చేసే అవకాశం ఉంటుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.